V3 NEWS




www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శనివారం
02-11-2024
సంపుటి : 01 । సంచిక : 180 । పేజీలు : 13 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

# ప్రపంచంలోని హిందువుల హక్కులు పరిరక్షిస్తా

హిందువులను పట్టించుకోని బైడెన్, కమలా హారిస్

గెలిస్తే భారత్-అమెరికా సంబంధాలు పటిష్టం

హిందువుల ఓట్లపై గురిపెట్టిన ట్రంప్



**వాషింగ్టన్:** అమెరికా, బంగ్లాదేశ్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువుల హక్కులను పరిరక్షిస్తానని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ హామీ ఇచ్చారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్, డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ అమెరికాతోపాటు ప్రపంచంలోని హిందువులను పట్టించుకోలేదని ట్రంప్ విమర్శించారు. రాడికల్ లెఫ్ట్ నుంచి ఎదురవుతున్న మత వ్యతిరేక అజెండా నుంచి హిందువులను రక్షిస్తానని ట్రంప్ తెలిపారు. అధ్యక్ష ఎన్నికల్లో గెలిస్తే భారత్-అమెరికా సంబంధాలను మిగతా2లో...

# మహారాష్ట్ర ఎన్నికల బరిలో 7,994 మంది అభ్యర్థులు

- మొత్తం 288 అసెంబ్లీ స్థానాలు
- 921 మంది నామినేషన్ల తిరస్కరణ
- ఉపసంహరణకు గడువు 4వ తేదీ

**ముంబయి:** మహారాష్ట్రలో నవంబర్ 20న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల పర్వం ఇటీవల ముగిసిన సంగతి తెలిసిందే. కాగా 288 అసెంబ్లీ స్థానాల్లో పోటీపడేందుకు మొత్తం 7,994 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో దిగినట్లుగా ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. వారిలో 921 మంది నామినేషన్ల పేపర్లను అధికారులు తిరస్కరించినట్లుగా మిగతా2లో...






## తప్పు చేసిన వారిని వదిలిపెట్టను

- రాజకీయ కక్షసాధింపులకు పోను
- లీడరంటే ప్రజల మనసులో అభిమానం ఉండాలి
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**విశ్వంభర, ఇచ్ఛాపురం:** తప్పు చేసిన వారిని వదిలిపెట్టనని, రాజకీయ కక్ష సాధింపులకు పోనని ముఖ్యంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మహిళలు అన్ని వేళలా ఆత్మగౌరవంతో మిగతా2లో...



## మీరు చేయాల్సింది మోకాళ్ల యాత్ర

- కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందే
- మోదీపై కాంగ్రెస్ యుద్ధం దేనికోసం?
- కాంగ్రెస్ వన్నీ ఉత్తర కుమార ప్రగల్భాలే
- దీపావళి దాటినా రాజకీయ బాంబులు పేల్చలేదేం?
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్

2



# విద్యార్థులకు బలవర్ధక ఆహారం

పెంచిన డైట్, కాస్మొటిక్ ఛార్జీలను పది రోజుల్లోగా అందుబాటులోకి తేవాలి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- ఛార్జీల పెంపుపై ప్రతిపాదనల ఆమోదంతో రాష్ట్రంలో 7,65,705 మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్రయోజనం
- ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రభుత్వ వసతి గృహ విద్యార్థినీ విద్యార్థులకు ఇకపై బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించాలని, పెంచిన డైట్, కాస్మొటిక్ ఛార్జీలను పది రోజుల్లోగా అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ప్రస్తుతం అమలులో ఉన్న రేట్లకు 40 శాతం మేరకు డైట్, కాస్మొటిక్ ఛార్జీలను పెంచాలన్న అధికారుల నేతృత్వంలోని కమిటీ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి యథాతథంగా ఆమోదించారు.ఈ పెంపుదల వల్ల రాష్ట్రంలో 7,65,705 మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. కీలకమైన ఈ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, వివిధ సంక్షేమ విభాగాల సెక్రటరీలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎంపీ మల్లు రవి కూడా పాల్గొన్నారు . దీపావళి పండుగ శుభ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాలు, తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ ఛార్జీలను ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే.

## విద్యార్థులకు ఇదే అసలైన దీపావళి

- వారికి మేలు చేసేందుకే డైట్ ఛార్జీల పెంపు
- గతంలో పిల్లలు అర్ధాకలితో ఇబ్బందులు పడ్డారు
- విద్యా శాఖకు బీఆర్ఎస్ చేసింది శూన్యం
- గత ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ నాశనమైంది
- మంత్రి సీతక్క



2

# భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేస్తా

## కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు శాపం

- కాంగ్రెస్ పాలనలో జరిగిన పతనం నుంచి తెలంగాణ కోలుకోవడం అసాధ్యం
- ప్రజల పక్షాన కొట్లాడటమే మా ప్రస్తుత బాధ్యత
- బి.ఆర్.ఎస్. తిరిగి అధికారంలోకి రావడం ఖాయం
- కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు, పార్టీకీ మార్గదర్శనం చేస్తున్నారు
- రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి
- సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రజలతో కేటీఆర్ సంభాషణ




**విశ్వంభర, హైదరాబాద్:** పార్టీ కార్యకర్తలు అంతా కోరుతున్నందున భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రను నిర్వహిస్తానని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. దీపావళిరోజు నెటిజన్లతో మాజిక మాధ్యమం ఎక్స్ సంభాషణ ఆస్క్ కేటీఆర్ లో ఆయన ఈ విషయం తెలిపారు. పలువురు ప్రత్యేకంగా మిగతా9లో...

# కులంపేరు తప్పుగా నమోదు చేయిస్తే క్రిమినల్ చర్యలు

- కులగణన బృహత్తర కార్యక్రమం
- ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి
- కరీంనగర్ అభిప్రాయ సేకరణలో
- బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్



2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 115 | ₹ 137 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 199 | ₹ 226 |

# బీఆరెస్ పదేళ్లలో చేయలేని అభివృద్ధిని.. పదినెలల్లో చేశాం

## ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

బోడుప్పల్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో పదేళ్ల పాలనలో బీఆరెస్ చేయలేని అభివృద్ధిని.. తాము పది నెలల కాలంలో చేశామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో సుమారు రూ.6.68 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. బోడుప్పల్‌లో వక్ఫ్ బోర్డు మిగతా2లో...



# నాగార్జునసాగర్‌లో స్టార్ హోటల్ నిర్మిస్తాం

- వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి చర్యలు
- మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి
- బుద్ధవనం పరిసర ప్రాంతాల పరిశీలన
- ప్రభుత్వ భూములపై సర్వే నిర్వహించి వివరాలు సమర్పించాలని సబ్ కలెక్టర్‌కు ఆదేశాలు

8

# ఎక్సైజ్ పీఎస్‌లో విచారణకు హాజరైన రాజ్ పాకాల

- రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో విచారించిన పోలీసులు
- న్యాయవాదితో కలిసి వచ్చిన రాజ్ పాకాల



**విశ్వంభర, హైదరాబాద్:** జన్వాడ ఫాంహౌస్ పార్టీ కేసులో నిందితుడు, మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్‌పాకాల అలియాస్ పాకాల రాజేంద్రప్రసాద్ శుక్రవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఎక్సైజ్ పీఎస్‌లో విచారణకు హాజరయ్యారు. న్యాయవాదితో కలిసి వచ్చిన రాజ్ పాకాలను రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో విచారించారు. విదేశీ మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరి వద్ద కొనుగోలు చేశారనే మిగతా2లో...

# పంచాంగం

**02-11-2024, శనివారం**

శ్రీ క్రోధినామ సంవత్సరం
ఆశ్వయుజ మాసం కృష్ణపక్షం
తిథి: పాడ్యమి రా.08.19 వరకు తర్వాత విదియ
నక్షత్రం: విశాఖ తె.05.51 వరకు
సూర్యోదయం: ఉ.6.18
సూర్యాస్తమయం: సా.5.40
వర్జ్యం: ఉ.10.19 నుంచి మ.12.03వరకు
దుర్ముహూర్తం: ఉ.07.49 నుంచి ఉ.08.35 వరకు
రాహుకాలం: ఉ.09.09 నుంచి ఉ.10.34 వరకు
అమృత ఘడియలు: రా.08.16 నుంచి రా.10.02 వరకు

## ఎక్సైజ్ పీఎస్‌లో విచారణకు హాజరైన రాజ్ పాకాల

(మొదటి పేజీ తరువాయి)
అంశాలపై ప్రధానంగా విచారించినట్లు సమాచారం. బుధవారం రాజ్ పాకాలను 7 గంటలకు పైగా మోకిల పోలీసులు విచారించిన విషయం తెలిసిందే. ఆయన ఫోన్‌ను స్వాధీనపర్చుకుని స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్న అనంతరం విడిచిపెట్టారు. బీఎన్ఎస్ఎస్ 35 (3) సెక్షన్ కింద మరోసారి పిలిస్తే విచారణకు రావాలని పోలీసులు సూచించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎక్సైజ్ పోలీసుల ఎదుట రాజ్ పాకాల విచారణకు హాజరయ్యారు.

## బీఆరెస్ పదేళ్లలో చేయలేని అభివృద్ధిని.. పదినెలల్లో చేశాం

(మొదటి పేజీ తరువాయి)
సమస్య న్యాయస్థానం పరిధిలో ఉందని.. అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అధికారంలోకి రాగానే మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు కేటాయించామని చెప్పారు. గత ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వకుండా, తమ బంధువులకు, కార్యకర్తలకు ఇచ్చారని ఆరోపించారు. అర్హులను గుర్తించే ప్రక్రియ ప్రారంభమైందని, ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు. రూ.13 కోట్లతో బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని చెరువుల అభివృద్ధి కోసం నిధులు కేటాయించామన్నారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ.10 లక్షలతో పేదలకు వైద్యం అందిస్తున్నామని చెప్పారు. జూనియర్, డిగ్రీ కళాశాలలు మంజూరు కోసం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల 5వేల ఉద్యోగాలు ఇస్తున్నామని, ఇప్పటి వరకు 50వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు.

## మహారాష్ట్ర ఎన్నికల బరిలో 7,994 మంది అభ్యర్థులు

(మొదటి పేజీ తరువాయి)
రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ఎన్నికలకు అభ్యర్థుల నామినేషన్ దాఖలు ప్రక్రియ అక్టోబర్ 22న ప్రారంభమై 29తో ముగిసింది. అక్టోబర్ 30న నామినేషన్ పత్రాల పరిశీలన పూర్తయ్యింది. అభ్యర్థిత్వాల ఉపసంహరణకు నవంబర్ 4 చివరి తేదీ. 288 మంది శాసనసభ్యులున్న మహారాష్ట్రలో నవంబరు 20న ఒకేవిడతలో పోలింగ్ జరగనుంది. నవంబరు 23న ఫలితాలను ప్రకటించనున్నారు. ప్రస్తుతం బీజేపీ, శివసేన, ఎన్సీపీలతో కూడిన మహాయుతి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించి మళ్లీ అధికారంలోకి రావాలని కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ), శివసేన (యూబీటీ)లతో కూడిన ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమి ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో మొత్తం 9.7 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. అయితే, ఇందులో తొలి ఓటర్లు కేవలం 2శాతం మాత్రమే కావడం గమనార్హం. మొత్తం ఓటర్లలో 5 కోట్ల మందికి పైగా పురుషులు కాగా.. 4.6 కోట్ల మంది మహిళలు ఉన్నారు. 18-19 ఏళ్ల వయసు గల తొలి ఓటర్లు 22.22 లక్షల మంది అని ఈసీ తెలిపింది. ఇక, శతాధిక వృద్ధులు 21,089 మంది ఉన్నారని పేర్కొంది. 2019 నాటి ఎన్నికలతో పోలిస్తే రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య దాదాపు 72 లక్షలకు పెరిగింది.

## కులంపేరు తప్పుగా నమోదు చేయిస్తే క్రిమినల్ చర్యలు

**విశ్వంభర, కరీంనగర్:** కులగణన సర్వే సందర్భంగా కులం పేరు తప్పుగా నమోదు చేయించుకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ హెచ్చరించారు. కులగణన బృహత్తర కార్యక్రమమని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరీంనగర్‌లో నిర్వహించిన అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో నిరంజన్ మాట్లాడారు. ''జనాభాలో బీసీలు 52 శాతం ఉన్నామని ఇప్పటిదాకా చెప్పుకొంటున్నాం. అది నిరూపించుకునేందుకు ఈ సర్వే కీలకం. ఈ గణన ద్వారా బీసీలతో పాటు అన్ని కులాల జనాభా లెక్కలు, వారి ఆర్థిక స్థితిగతులు తెలుస్తాయి. ఎవరి ఒత్తిళ్లకు లొంగకుండా మా దృష్టికి వచ్చిన విషయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం. కులగణన జరుగుతున్న సమయంలో కుల సంఘాలు కీలక పాత్ర పోషించాలి. సర్వే సక్రమంగా జరిగేలా చూడాలి. 80వేల నుంచి 90వేల మంది ఎన్యుమరేటర్లు జనగణనలో పాల్గొంటారు. ఎవరూ దీన్ని రాజకీయం చేయొద్దు. అపోహలు, ఆటంకాలు సృష్టించడం మంచిది కాదు. న్యాయస్థానం పట్ల గౌరవం ఉంది. కోర్టు సూచించినట్టే ముందుకు వెళ్తాం. న్యాయనిపుణుల సలహా మేరకు ఈనెల 13 వరకు ప్రజాభిప్రాయ సేకరణ కొనసాగిస్తాం. ప్రజాభిప్రాయ సేకరణలో చాలా రకాల విజ్ఞప్తులు వస్తున్నాయి. కొన్ని కులాల పేర్లు ఎప్పుడూ విననివి కూడా మా దృష్టికి వస్తున్నాయి. రిజర్వేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా అందరు సహకరించాలి. అనాథలకు ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండ్లు కూడా ఉన్నాయి'' అని నిరంజన్ తెలిపారు.

## టీటీడీ ధర్మకర్తల మండలిలో మరో సభ్యుడికి అవకాశం

**విశ్వంభర, అమరావతి:** తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలక మండలిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఛైర్మన్‌గా బీఆర్ నాయుడుతో పాటు మరో 23 మంది సభ్యులను ప్రకటించారు. తాజాగా శుక్రవారం దేవాదాయశాఖ విడుదల చేసిన జాబితాలో బీజేపీ నేత జి.భానుప్రకాశ్‌రెడ్డి పేరు చేర్చారు. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా దేవాదాయశాఖ కార్యదర్శి, దేవాదాయశాఖ కమిషనర్, తుడా ఛైర్మన్, టీటీడీ ఈవో కొనసాగనున్నారు.

# ప్రపంచంలోని హిందువుల హక్కులు పరిరక్షిస్తా



(మొదటి పేజీ తరువాయి)
మరింత పటిష్ఠం చేస్తానని హామీ ఇచ్చారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఇండో-అమెరికన్ ఓటర్లు కీలకంగా మారారు. ఈసారి మునుపెన్నడూ లేని విధంగా రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీల మధ్య హోరాహోరీ పోటీ నెలకొనటం వల్ల అభ్యర్థులిద్దరూ ఆ వర్గం ఓట్లను ఆకర్షించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. దీపావళి పండుగను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపిన రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులు, క్రిష్టియన్లు, ఇతర అల్పసంఖ్యాకులపై జరిగినదాడిని తీవ్రంగా ఖండించారు. తన హయాంలో ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు. ట్రంప్ ప్రకటనపై హిందూస్ ఫర్ అమెరికా ఫస్ట్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ ఉత్సవ్ సందూజ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రకటన చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చేవారం జరిగే ఎన్నికల్లో భారత్-అమెరికా సంబంధాలు, ఇమ్మిగ్రేషన్ సమస్య పరిష్కారం వంటి అంశాలు ప్రభావం చూపనున్నాయి. వాషింగ్టన్‌లో అధికారం చేపట్టే విషయంలో భారత్-అమెరికా సంబంధాలు పెద్దగా ప్రభావం చూపబోవనే వారు కూడా ఉన్నారు. కానీ భారత్-అమెరికా మధ్య సంబంధాలు మెరుగుపడాలని ఇండో-అమెరికన్లు అభిప్రాయపడుతున్నారు. అందుకు ట్రంప్ లేదా హారిస్ ఎవరు ప్రయత్నిస్తారనేది చూడాల్సి ఉందంటున్నారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌నకు గతంలో ప్రధాని మోదీతో మంచి సంబంధాలు ఉండేవని, ఆయన హయాంలో ఇరుదేశాల మధ్య సంబంధాలు బాగుండేవని ఇండో-అమెరికన్ సంఘం అధ్యక్షుడు అవినాష్ గుప్తా తెలిపారు.

**ఇమ్మిగ్రేషన్ సమస్య కూడా ముఖ్యమైన అంశం**

ఇమ్మిగ్రేషన్ సమస్య కూడా ముఖ్యమైన అంశమని మరికొందరంటున్నారు. అనేకమంది తమ పిల్లల భవిష్యత్‌పై ఆందోళనతో ఉన్నారని పేర్కొంటున్నారు. ఎంతోమంది ఇండో-అమెరికన్లు గ్రీన్‌కార్డ్ కోసం ఎదురుచూస్తున్నారు. హెచ్ 1 బీ వీసాతో అమెరికాలో ఉంటున్నవారు తమ పిల్లలు భారత్‌కు తిరిగి వెళ్లాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా ఆస్తుల కొనుగోలుపై నిర్ణయం, తమ పిల్లల స్కూలింగ్ తర్వాత ఇతర ప్రాంతాలకు మారటం సంక్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇమ్మిగ్రేషన్ సమస్యను ఎలా పరిష్కరిస్తారనే అంశంపై ఇప్పుడు ఇండో-అమెరికన్ల దృష్టి కేంద్రీకృతమైంది. ఇంకా అమెరికా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం, ఉద్యోగ కల్పన వంటి అంశాలు కూడా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కీలకపాత్ర పోషించనున్నాయని పలువురు ఇండో-అమెరికన్లు అభిప్రాయపడుతున్నారు. డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలాహారిస్‌కు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ రన్నింగ్‌మేట్ జేడీ వాన్స్‌కు భారత్‌తో సంబంధాలు ఉండటంతో ఇండో--అమెరికన్లు ఈసారి జరుగుతున్న అధ్యక్ష ఎన్నికల పట్ల ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఇండో-అమెరికన్ల ఓటింగ్ శాతం తక్కువగా ఉండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పుడు ఇండో-అమెరికన్లు ఓటువేయటం అత్యంత ముఖ్యమైన విషయంగా మారింది.

**బంగ్లాలో హిందువులపై దాడిని ఖండిస్తున్నా**

బంగ్లాదేశ్‌లో ఇటీవల హిందువులపై జరిగిన దాడిని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. తాను అధ్యక్ష ఎన్నికల్లో గెలిస్తే భారత్‌తో అమెరికా సంబంధాలను మరింత పటిష్ఠం చేస్తానని పేర్కొన్నారు. దీపావళి పండుగ నేపథ్యంలో సోషల్‌మీడియా వేదికగా ఆయన పోస్టు చేశారు. ఈ సందర్భంగా హిందువులకు ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్, డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్ అమెరికాతోపాటు, ప్రపంచంలోని హిందువులను పట్టించుకోలేదని విమర్శించారు."నా పరిపాలనతో ఇండియాతో పాటు నా స్నేహితుడు, ప్రధాని మోదీతో బలమైన భాగస్వామ్యాన్ని ఏర్పరుచుకుంటాం. కమలా హారిస్ గెలిస్తే అధిక పన్నులు, కఠినమైన నిబంధనలతో మీ చిన్న వ్యాపారాలను దెబ్బతీస్తుంది. నేను గెలిస్తే పన్నులు, నిబంధనల్లో కొత విధిస్తా. అమెరికాను చరిత్రలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిర్మిస్తా. ఇంతకుముందు ఎన్నడూ లేనివిధంగా అమెరికాను అత్యంత శక్తిమంతగా, ఉత్తమంగా తీర్చిదిద్దుతా. అమెరికాను మరోసారి ఉన్నతస్థాయిలో నిలబెడతా. దీపావళి పండగ చెడుపై విజయం సాధించేలా చేస్తుందని నమ్ముతున్నాను" అని ట్రంప్ పేర్కొన్నారు. గతంలో అధ్యక్షుడిగా ఉన్న సమయంలో భారత్‌తో ట్రంప్ సానుకూలంగా వ్యవహరించారు. ట్రంప్, మోదీ హౌడీ మోదీ పేరుతో 2019లో టెక్సాస్‌లో, 2020లో అహ్మదాబాద్‌లో నమస్తే ట్రంప్ పేరిట భారీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ రెండు సభలకు ఇరు దేశాల నుంచి భారీ మద్దతు లభించింది. దీంతో భారతీయుల్లో ట్రంప్ పట్ల అభిమానం పెరిగింది. ఈ నేపథ్యంలోనే అమెరికాలో భారీ సంఖ్యలో ఉన్న ఇండో అమెరికన్లను ఆకట్టుకోవడానికి అందివచ్చిన ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు ట్రంప్. మరో ఐదు రోజుల్లో ఎన్నికలు ఉండడం వల్ల జోరుగా ప్రచారం చేస్తున్నారు.

# మీరు చేయాల్సింది మోకాళ్ల యాత్ర



**విశ్వంభర, బెజ్జంకి:** ''మూసీ పునరుజ్జీవంపైన సీఎం పాదయాత్ర చేస్తానంటున్నడు. ఇప్పుడేమో ట్విట్టర్ టిల్లు కూడా రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తాడట. ఈ రెండు పార్టీలు ఒక్కటే కదా? 6 గ్యారంటీల పేరుతో ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక మోసం చేసిన ఘనత రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ దైతే, గత 10 ఏళ్ల పాలనలో ప్రజలను అడుగడుగునా మోసం చేసిన చరిత్ర ట్విట్టర్ టిల్లు ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ ది. మీ ఇద్దరూ చేయాల్సింది పాదయాత్ర కాదు. మోకాళ్ల యాత్ర.'' అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని చెప్పిన బండి సంజయ్ 'ఇద్దరూ కలిసి అటు నుండి ఒకరు ఇటు నుండి ఇంకొకరు పాదయాత్ర చేసుకోండి. ఆ తరువాత మీరిద్దరూ కలిసి బహిరంగ సభ పెట్టుకుని రాహుల్ గాంధీ, కేసీఆర్ లను పిలుచుకోండి.''అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీకి చేతనైతే 6 గ్యారంటీలపై పాదయాత్ర చేయాలని సవాల్ విసిరారు. శుక్రవారం మానకొండూరు నియోజకవర్గంలోని ఇల్లంతకుంట, బెజ్జంకి మండలాల్లో పర్యటించిన బండి సంజయ్ కుమార్ స్థానిక బీజేపీ నేతలను కలుసుకున్నారు. కార్యకర్తలతో ముచ్చటించారు. అనంతరం బెజ్జంకి మండల కేంద్రం పార్టీ మండలాధ్యక్షుడు రవి నివాసానికి వచ్చారు. . ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డితోపాటు స్థానిక నేతలతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ''ఎన్నికలకు ముందే రాజకీయాలు. ఆ తరువాత అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నా. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో అందరితో కలిసి పనిచేసేందుకు యత్నిస్తున్నా. గత ప్రభుత్వం ఎంత మూర్ఖంగా ఆలోచించిందో తెలిసింది. అభివృద్ధి విషయంలో మేం సహకరిస్తామని చెప్పినా చేయలేదు'' అన్నారు.

**రేవంత్ రెడ్డి, కేటీఆర్ పాదయాత్రపై...**

''రెండు పార్టీలు ఒక్కటే కదా? ఇద్దరూ కలిసి అటు నుండి ఒకరు, ఇటు నుండి ఇంకొకరు పాదయాత్ర చేసుకోండి. కలిసే బహిరంగ సభ పెట్టుకుని కేసీఆర్ ను, సోనియాగాంధీని పిలుచుకోండి. గత 10 ఏళ్లలో ప్రజలను ఏ విధంగా మోసం చేశామో, అవినీతికి పాల్పడ్డామో బీఆర్ఎస్ నేతలు చెప్పుకోండి. 6 గ్యారంటీలపై ప్రజలను చేసి గద్దెనెక్కినంక వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్న విషయాన్ని కాంగ్రెస్ నేతలు చెప్పుకోండి. సిగ్గుండాలే. మీరు చేయాల్సింది పాదయాత్ర కాదు.. రెండు పార్టీల నేతలు మోకాళ్ల యాత్ర చేయాలి.

బీఆర్ఎస్ హయాంలో నేను పాదయాత్ర చేస్తే మాపై దాడి చేయించింది బీఆర్ఎస్ వాళ్లు కదా? ప్రజలు తిరగబడితే ఆనాడు తోక ముడిచారు. అట్లాంటి మీరు ఏ ముఖం పెట్టుకుని పాదయాత్ర చేస్తారు? అసలు దేనికోసం పాదయాత్ర చేస్తున్నరు? రైతుల సమస్యలపై ఏనాడూ స్పందించలే. నిరుద్యోగులు, విద్యార్థులు, ప్రజా సమస్యలపై ఏనాడూ నోరే విప్పడం లేదు? ప్రధాన ప్రతిపక్షనేతగా ఉన్న కేసీఆర్ గత 6 నెలలుగా ఫాంహౌజ్ కే పరిమితమైండు. కుటుంబానికి ఆపదొస్తే తప్ప నోరు విప్పడు. మరి ఏ ముఖం పెట్టుకుని పాదయాత్ర చేస్తారు?

మూసీపై పాదయాత్ర చేస్తానంటున్న రేవంత్ రెడ్డికి 6 గ్యారంటీలను అమలు చేశామని చెప్పుకుంటూ పాదయాత్ర చేసే దమ్ముందా? నిజంగా అట్లా చేస్తే ప్రజలే తిరగబడతరు. రైతు భరోసా ఇవ్వకుండా గోస పెడుతున్నరు. మహిళలకు తులం బంగారం, స్కూటీ, నెలనెలా రూ.2500లు ఇస్తానని మోసం చేసిండు. 6 గ్యారంటీల పేరుతో ఓట్లేయించుకుని నిలువునా మోసం చేసిండు. 2 లక్షల ఉద్యోగాలిస్తామని మోసం చేశారు. ఉద్యోగులకు 5 డీఏలు పెండింగ్ లో ఉన్నా ఇవ్వకుండా మోసం చేసిండు. ఫీజు రీయంబర్స్ మెంట్ ఇవ్వకుండా కాలేజీలు మూసివేసే పరిస్థితి ఉన్నా పట్టించుకోవడం లేదు. ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ... గద్దెనెక్కినంక చేతులెత్తేసి సిగ్గు లేకుండా పాదయాత్ర చేస్తానంటారా?

అసలు కాంగ్రెస్ వన్నీ ఉత్తి మాటలే. ఉత్తర కుమార ప్రగల్భాలే. వాళ్ల చేతలకు మాటలకు పొంతనే లేదు. దీపావళికి ముందే రాజకీయ బాంబులు పేలుతాయన్నరు. పండుగనాడు అందరి ఇండ్లలో పటాకులు పేలినయ్ కానీ... కాంగ్రెసోళ్ల రాజకీయ బాంబు మాత్రం పేలలే. తుస్సుమంది. ఎందుకంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలూ ఒక్కటే. కలిసి డ్రామాలాడుతున్నయ్. కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతి, అక్రమాలు, అరాచకలపై పైకి విచారణ చేసి జైళ్లలో వేస్తమని ప్రకటనలిస్తరు,కాళేశ్వరం, ధరణి, గొర్రెల స్కాం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్ విచారణలో కేసీఆర్ కుటుంబం దోషులని మాట్లాడతరు. దీపావళికి ముందే రాజకీయ బాంబులు పేలుతయంటరు. బీఆర్ఎస్ పెద్దలు అరెస్ట్ కాబోతున్నరని ప్రభుత్వంలో ఉన్నోళ్లే బహిరంగంగానే మాట్లాడతరు. కానీ అరెస్టులు కాదు కదా. కనీసం నోటీసులు కూడా ఇవ్వలేకపోయారు.

6 గ్యారంటీలను అమలు చేయకుండా, అవినీతికి పాల్పడ్డ కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేయకుండా మూసీ పునరుజ్జీవం పేరుతో కాంగ్రెస్ నేతలు డ్రామాలాడుతున్నరు. రూ-.లక్షన్నర కోట్లు దోచుకునే కుట్రకు తెరదీస్తున్నరు. వీటిపై మేం నిలదీస్తుంటే... మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించి రాహుల్ గాంధీని ప్రధాని చేసేందుకు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ నుండే యుద్ధం ప్రారంభించిందని అనడం సిగ్గుచేటు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం కల్ల. ప్రధాని కాలేడనే విషయం రాహుల్ కు కూడా తెలుసు. ప్రజలకు ఇంకా బాగా తెలుసు. యుద్ధం సంగతి తరువాత... యుద్ధ ప్రాతిపదికన ప్రజలకిచ్చిన 6 గ్యారంటీలను అమలు చేసి మీ దమ్ము చూపండి'' అని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు.

# విద్యార్థులకు ఇదే అసలైన దీపావళి

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచినందున విద్యార్థులకు ఇదే అసలైన దీపావళి అని పంచాయతీరాజ్ గిరిజన అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం సచివాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల బాధలు తెలిసిన రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నారని,విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలనే లక్ష్యంతో ఆయన పనిచేస్తున్నారని అందుకే ఎన్నడూ లేని విధంగా హాస్టల్, గురుకుల విద్యార్థులకు డైట్ కాస్మోటిక్ 40% పెంచడం జరిగిందని, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు 40 శాతం చార్జీలను పెంచిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. డైట్ ఛార్జీలు ఏడేండ్లుగా, కాస్మెటిక్ ఛార్జీలు గత 16 సంవత్సరాలుగా పెరగలేదని ఆమె అన్నారు. ఏడు సంవత్సరాల క్రితం డైట్ ఛార్జీలు కొంచెం పెంచి.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుందని, ఏడేళ్లుగా ధరలు విపరీతంగా పెరిగిన అనుగుణంగా డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచలేదని ఆమె మండిపడ్డారు. దీంతో పిల్లలు అర్ధాకలితో ఇబ్బందులు పడ్డారని, విద్యా శాఖకు బీఆర్ఎస్ చేసింది శూన్యమని ఆమె మండిపడ్డారు. బీర్ఎస్ హయాంలో విద్య వ్యవస్థ నాశనమైందని ఆమె అన్నారు. పదేళ్ళు అధికారంలో ఉండి టాయిలెట్స్ కట్టలేదు.. తాగు నీరు, మౌలిక వసతులు కల్పించలేదని మంత్రి సీతక్క విమర్శించారు. ఈ సమస్యలను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పన కోసం ప్రత్యేక దృష్టి పెట్టారని, డైట్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచడంతో 7.65 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి జరగనుందన్నారు. పిల్లలకు కడుపునిండా భోజనం పెట్టాలని పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఇక హాస్టల్ విద్యార్థులు అర్ధాకలితో అవస్థలు పడాల్సిన అవసరం లేదని, పెంచిన ఛార్జీలతో విద్యార్థులకు పోషకాహారం అందించాల్సిన బాధ్యత టీచర్లది హాస్టల్ సిబ్బందిది అని ఆమె అన్నారు. హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ ఛార్జీలు గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లిస్తామని ఆమె తెలిపారు. పెంచిన ఛార్జీలు అందుకోబోతున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## తప్పు చేసిన వారిని వదిలిపెట్టను

(మొదటి పేజీ తరువాయి)
జీవించాలని అన్నారు. దీపం 2.0లో భాగంగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈదుపురంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో సీఎం మాట్లాడారు. ''మొన్నటి ఎన్నికల్లో తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు రాజీలేని పోరాటం చేశారు. వైసీపీ నేతలు ప్రజాస్వామ్య హద్దులు దాటి ఇబ్బంది పెట్టారు. బాధ్యతగల ప్రజాప్రతినిధిని.. తప్పు చేసిన వారిని వదిలిపెట్టను, రాజకీయ కక్షసాధింపులకు పోను. నాయకుడు అంటే ప్రజల మనస్సుల్లో అభిమానం ఉండాలి. సమాజం పట్ల బాధ్యత కలిగిన వ్యక్తిని నేను. కట్టెల పొయ్యితో మహిళలు పడిన బాధలు నాకు తెలుసు. దీపం పథకం కింద సిలిండర్ ఇచ్చి మహిళల కష్టాలు తీర్చా. డ్వాక్రా సంఘాలకు మళ్లీ పూర్వ వైభవం తెస్తాం. మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా మారుస్తాం.

**పింఛను 3 నెలలకు ఒకసారి కూడా తీసుకోవచ్చు..**

ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలవాలని చెప్పిన విషయం నాకు గుర్తుంది. గ్యాస్ సిలిండర్‌కు మీరు కట్టిన డబ్బు 48 గంటల్లో రిఫండ్ అయ్యేలా చూస్తాం. సిలిండర్‌కు డబ్బు కట్టే పనిలేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. 64లక్షల మందికి పింఛను ఇస్తున్న ప్రభుత్వం మనదే. అన్ని రాష్ట్రాల కంటే మనమే ఎక్కువ పింఛను ఇస్తున్నాం. ఆర్థిక సమస్యలు ఉన్నా పథకాలు అమలు చేస్తున్నాం. ప్రభుత్వం వద్ద డబ్బు లేదు.. ప్రజలకు అండగా ఉండాలనే మనసుంది. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు అండగా ఉన్నాం. పింఛను మొత్తాన్ని 3 నెలలకు ఒకసారి కూడా తీసుకోవచ్చు. పింఛను ఎవరు ఆపినా నిలదీయండి.. అది మీ హక్కు. పింఛను డబ్బును ఇంటి వద్దే గౌరవంగా ఇవ్వాలని ఆదేశించాం.

**బెల్టు షాపులు పెడితే బెల్టు తీస్తా..**

ఉచితంగా ఇసుక ఇస్తున్న ఏకైక ప్రభుత్వం ఎన్డీయే ప్రభుత్వం. ఇసుక విషయంలో అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్టు కింద అరెస్టు చేస్తాం. మా హయాంలో నాసిరకం మద్యం ఉండదు. బెల్టు షాపులు ఉండవు. బెల్టు షాపులు పెడితే బెల్టు తీస్తా. కనీవినీ ఎరుగని విజయాన్ని అందించిన ప్రజల కోసం అనునిత్యం కష్టడతాం. పోలవరం కోసం రూ.990 కోట్లతో కొంత్త డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తున్నాం. ఫేజ్-1 కింద కేంద్రం రూ.12,500 కోట్లు ఇచ్చింది. అమరావతిని మళ్లీ గాడిలో పెట్టాం. కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించింది. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తున్నాం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడతామని హామీ ఇచ్చాం. ఇప్పటికే రెండు.. మూడు సమావేశాలు జరిగాయి. కేంద్రం డబ్బులు కూడా ఇచ్చింది. రెండో ఫర్నేస్‌లో ఆపరేషన్ ప్రారంభమైంది. విశాఖ రైల్వే జోన్‌కు లైన్ క్లియర్ చేశాం. రేపో.. ఎల్లుండో భూమి పూజ చేస్తాం. టెక్కలి లేదా పలాసలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తాం. మూలపేటలో 10వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తాం. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉద్యోగాలు డిసెంబరు లోపు ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. అర్హులైన అందరికీ ఇళ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు ఇస్తాం'' అని చంద్రబాబు వివరించారు. ఒక్క అవకాశం అంటూ వచ్చి.. జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశారని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ధ్వజమెత్తారు. చంద్రబాబు ఇచ్చిన దీపం వెలుగులను వైసీపీ ప్రభుత్వం ఆర్పేసిందన్నారు. ఉద్దానం సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సీఎం చంద్రబాబును కోరారు. ఉత్తరాంధ్ర యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఉత్తరాంధ్రకు పరిశ్రమలు తెచ్చి వలసలు అరికడతామని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే అశోక్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

### మాజీ మంత్రి హరీశ్‌రావు



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందంటూ మాజీమంత్రి హరీశ్ రావు విమర్శించారు. పంటల కొనుగోళ్లు, బోనస్‌పై 'ఎక్స్' వేదికగా స్పందించారు. లాభసాటి వ్యవసాయమని, అన్ని పంటలకు బోనస్ అని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. రైతులను మోసగించిందని ఆరోపించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించుకోలేని దుస్థితికి రేవంత్‌రెడ్డి సర్కార్ రైతును దిగజార్చిందని మండిపడ్డారు. బోనస్.. బోగస్ అయ్యిందని ఆక్షేపించారు. కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొని... రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# ఇజ్రాయెల్‌పై మరో దాడికి ఇరాన్ ప్లాన్

- అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందే జరిగే చాన్స్
- దళాలకు అయతొల్లా అలీ ఖమేని



**టెహ్రాన్:** ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య పరస్పర దాడులతో పశ్చిమాసియా భగ్గుమంటోంది. తాజాగా మరోసారి ఇజ్రాయెల్‌పై దాడికి ఇరాన్ యత్నిస్తోందని నిఘా వర్గాల సమాచారం. అమెరికా ఎన్నికలు జరిగే నవంబర్ 5వ తేదీకి ముందే ఈ దాడి జరిగే అవకాశం ఉన్నట్లు ఓ నివేదిక తెలిపింది. మరోవైపు ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల మిలిటెంట్ల ద్వారా ఇజ్రాయెల్‌పై దాడి చేయించేందుకు టెహ్రాన్ యత్నిస్తోందని తెలుస్తోంది. ఇజ్రాయెల్‌పై ప్రతిదాడి చేయాలని ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేని తన దళాలను ఆదేశించినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది.
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు అంతకంతకూ ముదురుతున్నాయి. ఇజ్రాయెల్‌పై మరోసారి దాడికి ఇరాన్ సిద్ధం అవుతున్నట్లు ఇజ్రాయెల్ నిఘా వర్గాల సమాచారం. ఇరాక్ గడ్డ నుంచి ఇరాన్ ఈ దాడులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనుండగా అంతకుముందే ఈ దాడులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. భారీ సంఖ్యలో డ్రోన్లు, బాలిస్టిక్ మిస్సైళ్లతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడేందుకు ఇరాన్ చూస్తున్నట్లు యాక్సియోస్ రిపోర్టు వెల్లడించింది. ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల మిలిటెంట్ల ద్వారా ఈ దాడిని చేపట్టేందుకు టెహ్రాన్ సిద్ధమవుతున్నట్లు ఆ నివేదిక పేర్కొంది. అందువల్ల ఇజ్రాయెల్ మరోసారి ప్రతీకార చర్యలు చేపట్టకుండా ఉండే అవకాశం ఉంటుందని ఇరాన్ భావిస్తోంది.
హమాస్ అధినేత ఇస్మాయెల్ హనీయా, హెజ్‌బొల్లా చీఫ్ సయ్యద్ హసన్ నస్రల్లా, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్‌కు చెందిన నిల్ఫోరూషన్ మరణానికి ప్రతీకారంగా నెల క్రితం ఇజ్రాయెల్‌పై ఇరాన్ భీకరంగా విరుచుకుపడింది. 200 మిస్సైళ్లతో ఇరాన్ దాడి చేయడం వల్ల ఇజ్రాయెల్ ప్రజలు బంకర్లలో తలదాచుకున్నారు. అందుకు ప్రతీకారంగా ఇజ్రాయెల్ కూడా ఇటీవల ఇరాన్‌పై దాదాపు 200 యుద్ధవిమానాలతో దాడికి దిగింది. డ్రోన్ ఫ్యాక్టరీలు, బాలిస్టిక్ క్షిపణి తయారీ, ప్రయోగ కేంద్రాలపై దాడి చేసింది. ఇజ్రాయెల్ దాడుల్లో నలుగురు ఇరాన్ సైనికులు మృతి చెందగా, క్షిపణి తయారీ కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడికి ప్రతీకారం తప్పదని ఇరాన్ హెచ్చరించింది. దాడి ఘటన తమ దేశంపైకి రాకుండా ఉండేందుకు ఇరాక్ గడ్డ నుంచి దాడి చేయాలని ఇరాన్ భావిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి.
మరోవైపు ఇజ్రాయెల్‌పై ప్రతిదాడి చేయాలని ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీఖమేని తన దళాలను ఆదేశించినట్లు తెలుస్తుంది. ఈ మేరకు ఓ వార్తాసంస్థ కథనాన్ని ప్రచురించింది. ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో జరిగిన నష్టం, ప్రతిదాడికి సంబంధించి ఇరాన్ అధికారులు చర్చించుకున్నారు. జాతీయ భద్రతా మండలి రూపొందించిన ప్రణాళికలకు అనుగుణంగా ప్రతిదాడికి సిద్ధమవ్వాలని ఖమేనీ తన సైనిక అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్‌కు చెందిన సైనిక స్థావరాల జాబితాను ఇరాన్ అధికారులు రూపొందిస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఇజ్రాయెల్‌పై మళ్లీ ఇరాన్ దాడి చేస్తుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగాయి. ఇరాన్ మరోసారి దాడి చేస్తే గతంలో తాము వదిలేసిన టార్గెట్లను ధ్వంసం చేస్తామని ఇజ్రాయెల్ కూడా ఇప్పటికే హెచ్చరించింది.

# పోలయ్య కవి కూకట్లపల్లికి ఘన సన్మానం



**విశ్వంభర, హైదరాబాద్ :** చిక్కడపల్లి త్యాగరాజ గానసభలో బుధవారం సాయంత్రం మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ వీడీ రాజగోపాల్ అధ్యక్షతన మహర్షి వాల్మీకి జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డా. సాధనాల వెంకట స్వామి నాయుడి అధ్యక్షతన డా. అరవా రవీంద్ర బాబు సమన్వయ కర్తగా నిర్వహించిన కవి సమ్మేళనంలో 60 మంది కవులు పాల్గొని కవితా గానం చేసి సభను "రామ నామ మయం" చేశారు. ప్రముఖ కవి పోలయ్య కూకట్లపల్లి "ఏమని వర్ణింతు నేనేమని వర్ణింతు" శీర్షికతో "కమ్మని కవితను" గానం చేసి ప్రముఖుల ప్రశంసలు పొందారు.
తదనంతరం కవులను కళాకారులను ఘనంగా సత్కరించారు. పద్మశ్రీ డాక్టర్ కొలకలూరి ఇనాక్, డా. కళారత్న బిక్కి కృష్ణ, డా. వీడీ రాజగోపాల్, ఏఎల్ క్రిష్ణా రెడ్డి, డా. వీఎస్ రావు, అంబికా లక్ష్మీ నారాయణ (ఎంపీ అనంతపురం)లు పోలయ్య కవి కూకట్లపల్లిని ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీత పోలయ్య కవిని తోటి కవి మిత్రులు, శ్రేయోభిలాషులు అభిమానులు అభినందించారు. తనను సన్మానించిన సాహితీమూర్తులకు కూకట్లపల్లి పోలయ్య కృతజ్ఞతలు తెలిపారు. కవిసమ్మేళనం తర్వాత కృష్ణ తులాభారం పద్య నాటకం ఆహూతులను ఆకట్టుకుంది. ఈ సభకు చాలా మంది కవులు కళాకారులు ప్రముఖులు హాజరై మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ చేసే సాహితీ సేవను, కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా డా. వీడీ రాజగోపాల్ పలువురు సాహితీ ప్రముఖులకు, కవులకు, కళాకారులకు వాల్మీకి సేవారత్న, సాహితి సేవారత్న, కవిశ్రేష్ఠ బిరుదులను ప్రదానం చేశారు. కమ్మని భోజనంతో సభ దిగ్విజయంగా ముగిసింది.

# సీఎం రేవంత్ రెడ్డికి ఎంజేపీ మియాపూర్ విద్యార్థుల కృతజ్ఞతలు



**విశ్వంభర, చేవెళ్ల / మొయినాబాద్ :** మోహినాబాద్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు, తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీసీ వెల్ఫేర్ మినిస్టర్, పొన్నం ప్రభాకర్ లకు ఎంజేపీ మియాపూర్ బాయ్స్ విద్యార్థులు, ప్రిన్సిపాల్ కె,గీతాంజలి, ఉపాధ్యాయులు మెస్ చార్జీలు పెంచినందుకు గాను కేక్ కట్ చేసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గీతాంజలి మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు, ఆరోగ్యపరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ జె, నరేష్, డిప్యూటీ వార్డెన్, నవాజ్, ఉపాధ్యాయులు, దేవులపల్లి రమేశ్, అనంతయ్య, జే విజయ్, గోవింద్, శ్రవణ్, చక్రపాణి, రాజేందర్, మోహన్, అనురాధ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి కుర్చీకి ఏమీ కాదు

* టచ్ చేసే వాళ్లు ఇంకా పుట్టలేదు

* ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ ఎస్‌కు రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే 100 స్థానాలు భారాసకు వస్తాయని మాజీ మంత్రి హరీశ్‌రావు కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. నాలుగు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో బీఆర్ ఎస్ పరిస్థితి ఏమైందో మరిచిపోయారా అని ప్రశ్నించారు. జనం మిమ్మల్ని జీరో చేసి విసిరి అవతల పారేస్తే.. వంద సీట్లు వస్తాయని ఇంకా పొంకనాలు కొడతారా అని ధ్వజమెత్తారు.
రెండు ఎన్నికల్లో ప్రజలు బీఆర్ ఎస్‌ను తిరస్కరించారని, భవిష్యత్తులో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తెలంగాణ ప్రజలు తిరిగి కేసీఆర్ మొహం కూడా చూడరని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేతగా ఉండమని జనం ఓట్లేస్తే ఫామ్ హౌస్‌కే పరిమితమయ్యారని ఆరోపించారు. బీఆర్ ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే తెలంగాణ డ్రగ్స్‌కు అడ్డాగా మారుతుందని, హైదరాబాద్‌లో గంజాయి సాగు చేసే పరిస్థితి వస్తుందని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి కుర్చీకి ఏమీ కాదు.. ఆ కుర్చీని టచ్ చేసే వాళ్లు పుట్టలేదన్నారు. బీఆర్ ఎస్‌లో తన కుర్చీ ఉంటుందో, ఊడుతుందో హరీశ్‌రావు చూసుకోవాలని వ్యాఖ్యానించారు.

# నవంబర్ 3న జీఎన్‌సాయి బాబా స్మారక సభను జయప్రదం చేయాలి

**విశ్వంభర, మహబూబ్‌నగర్ :** సాయిబాబా జీవితం పోరటం అంశంపై ఈనెల మూడవ తేదీ ఆదివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎస్ఎం ఫంక్షన్ హాల్‌లో ప్రముఖ ప్రజాస్వామ్యవాది, పౌర హక్కుల సంఘం నేత జీఎన్ సాయిబాబా స్మారక సభను ఉదయం 11 గంటల నుంచి నిర్వహిస్తున్నట్టు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్, కేఎన్‌పీఎస్ నాయకుడు డీ చంద్రశేఖర్, చైతన్య మహిళా సంఘం నాయకురాలు శ్రీదేవి, సీపీఐ నాయకులు సురేష్, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకుడు పి అరుణ్ కుమార్, ప్రముఖ విద్యావేత్తలు లక్ష్మణ్ గౌడ్, జగపతిరావు, తెలంగాణ సాహిత్య వేదిక అధ్యక్ష కార్యదర్శులు వల్లభాపురం జనార్ధన్, ఖాజా మైనద్దీన్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నేరం రుజువు కాకుండా పది సంవత్సరాలు జైలులో అండా సెల్ కఠిన కారాగార శిక్షను సాయిబాబా అనుభవించాడని వారు తెలిపారు. కవులను, రచయితలను, మేధావులను జైలలో నిర్బంధించి భారతీయ జనతా పార్టీ ఫాసిస్టు విధానాలను కొనసాగిస్తుందని తెలిపారు. మతోన్మాద, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా, పౌర ప్రజాస్వామిక విలువల కోసం, దోపిడీ, పీడన లేని సమాజం కోసం స్వప్నించిన సాయిబాబా ఆశయాలను కొనసాగించడంలో భాగంగా ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలో సాయిబాబా కుమార్తె మంజీరా, ప్రొఫెసర్ హరగోపాల్, పాణి, టీపీఎఫ్ నాయకుడు రవిచంద్ర, వామపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ సభలో విద్యావంతులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థులు, కార్మికులు, ఉపాధ్యాయులు, రైతు కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# త్వరలో తెలంగాణకు కొత్త ముఖ్యమంత్రి

## ఎమ్మెల్యే ఏలేటి సంచనల వ్యాఖ్య



**విశ్వంభర, హైదరాబాద్ :** త్వరలో తెలంగాణకు కొత్త ముఖ్యమంత్రి వస్తాడని బీజేపీ శాసనసభా పక్షనేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఏడు నెలల నుంచి రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. కేరళ వెళ్లినా కూడా రేవంత్ రెడ్డికి ప్రియాంక గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని గుర్తు చేశారు. అక్కడ దూరం నుంచి చూసి వచ్చాడు తప్ప కలవలేదన్నారు. మూసీ ప్రాజెక్టు వ్యయాన్ని మూడు రెట్లు పెంచిన తరువాత అవినీతి ఉందని బయటపడింది.. అందుకోసమే ప్రక్షాళన చేపట్టారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఏకపక్ష ధోరణిని సీనియర్ మంత్రులు ఒప్పుకోవడం లేదని, జూన్ నుంచి డిసెంబర్ లోపు తెలంగాణలో కొత్త ముఖ్యమంత్రి రావడం ఖాయమన్నారు. తాను రీసెర్చ్ చేస్తేనే మాట్లాడుతానని స్పష్టం చేశారు. మహేశ్వర్ రెడ్డి కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



దీపావళి వేడుకల్లో భాగంగా ఖైరతాబాద్‌లో ఆనందంతో కాకరవత్తి వెలిగిస్తున్న చిన్నారి భవిష్య శ్రీ. - విశ్వంభర, ఖైరతాబాద్









# శివకేశవులకు ప్రీతికరం కార్తీక మాసం

సనాతన హైందవ ధర్మంలో కాలం అనంతమైనది. కాలం మహా బలవంతమైనది. కాలం సమస్తమైనది. అందుకే భగవద్గీతలో గీతాచార్యుడు కాలాత్ కలయికాం అహం అంటాడు. (నేను భావ స్వరూపంలో ఉండి కాలం లెక్కలు కట్టుకుంటూ ఉంటాను)

అనాదిగా ప్రతి తెలుగు మాసంలో పున్నమి నుండి అమావాస్య వరకు గల కాలాన్ని 'సర్వసంది కాలం' అంటారు. అమావాస్య నుండి పౌర్ణమి వరకు గల 16 రోజులలో ఒక్కొక్క రోజు చంద్రుడికి ఒక్కొక్క కళ హెచ్చుతూ ఉంటుంది. 16 కళలతో ఒప్పుతున్న పూర్ణిమనాడు చంద్రుడు సంపూర్ణ కాంతివంతుడు అవుతాడు. ఇలా చంద్రుడు 16 కళలతో సంపూర్ణమైన వెలుగులతో ప్రకాశించే దినాలు ఏడాదికి 12 ఉంటాయి. అంటే ఏడాదికి 12 పూర్ణిమలు వస్తాయన్నమాట. ఏడాదిలో వచ్చే 12 పున్నమలలోను ఒక్కొక్క నక్షత్రంతో కూడి ఉంటాడు చంద్రుడు. ఆ రోజు చంద్రుడు ఏ నక్షత్రంతో కూడి ఉంటాడో ఆనాటి నక్షత్రాన్ని బట్టి ఆ పౌర్ణమికి ఆ పేరు కలుగుతుంది. అట్లే ఆ మాసం కూడా ఏర్పడుతుంది. ఆ నక్షత్రం పేరుతోనే వ్యవహరిస్తారు. కార్తీక మాసంలో పౌర్ణమి రోజు చంద్రుడు కృత్తికా నక్షత్రంతో కూడి ఉండటంవలన ఆ పౌర్ణమిని 'కార్తీక పౌర్ణమి' అని, ఆ మాసానికి కార్తిక మాసం అని పేరు వచ్చింది. ఏడాదిలో వచ్చే 12 పున్నములను 12 పర్వాలుగా పెద్దలు నిర్ణయించారు. హిందువుల పండుగలను పరిశీలిస్తే, కృష్ణపక్షంలో కంటే శుక్లపక్షంలోనే పండుగలు ఎక్కువగా వస్తూ ఉంటాయి. భోగార్హమైన పున్నమి పండువెన్నెల ఊరికే పోకుండా అది పూర్తిగా అనుభవనీయం కావడానికి ప్రతి పున్నమను మన పెద్దలు పండుగలుగా ఏర్పరిచారు.

**కౌముది మాసం, త్రిపుర పౌర్ణమి**

తెలుగు నెలల ప్రకారం సంవత్సరంలో 8వ మాసం కార్తీక మాసం. కార్తీక మాసానికి కౌముది మాసం





అని కూడా పేరు. కార్తీక మాసానికి అధిదేవత దామోదరుడు. కార్తీక మాసంలో వచ్చే పూర్ణిమను 'త్రిపుర పూర్ణిమ' అంటారు. ఇది శంకరుడికి మిక్కిలి ప్రీతికరమైన రోజు ఈరోజు శంకరుడు త్రిపురాసురుని సంహరించినందున దీనికి త్రిపుర పూర్ణమి అనే పేరు స్థిరపడింది. శంకరుని కీర్తిని నారదుని వలన విని త్రిపురాసురుడు శంకరుడి కంటే తానే బలవంతుడనని అహంకారపడతాడు. శంకరుడు అంటే అసూయ చెందుతాడు. అంతటితో ఆగక త్రిపురాసురుడు కైలాసం మీదకు దండెత్తి శంకరుని యుద్ధానికి పురికొల్పుతాడు. మూడు రోజులు యుద్ధం తీవ్రంగా జరుగుతుంది. ఆ యుద్ధంలో శంకరుడు త్రిపురాసురుని సంహరించగా అప్పుడు దేవతలు శంకరుని స్తోత్రం చేశారు. ఈనాటి రాత్రి మహిళలు శంకరుని విజయాన్ని స్మరిస్తూ తులసి కోట వద్ద 720 దూది వత్తులను నేతిలో ముంచి పెద్ద దీపం వెలిగిస్తారు అని ఒక పురాణ కథ వివరిస్తుంది.

**పదహారు కళలతో వెలిగే కార్తిక పౌర్ణమి**

కార్తీక పౌర్ణమి రోజున చంద్రుడు కృత్తిక నక్షత్రంలో ఉంటాడు. కృత్తికకు అగ్ని నక్షత్రం అని పేరు. ఈ నక్షత్రానికి అధిపతి అగ్నిదేవుడు. కనుక ఈ రోజున దీపారాధన మూలకంగా అగ్నిని ఆరాధించాలనే పెద్దల నిర్ణయం ప్రకారం కార్తీక పౌర్ణమి రోజు ఆలయాలలో అనంతమైన దీపాలను వెలిగించే ఆచారం అనాదిగా ఏర్పడింది. ఇది కూడా ఒక విధమైన దీపాల పండుగ వంటిదే అయితే చిమ్మ చీకట్లు కమ్మిన అమావాస్య రోజున దీపావళి వస్తే ఈ పండుగ పూర్ణచంద్రుడు 16 కళలతో వెలిగే నిండు పున్నమినాడు రావడం విశేషం.

**కార్తీక దీపోత్సవం**

ఈ కార్తీక మాసంలో శివకేశవుల భేదం లేకుండా అన్ని ఆలయాలలో ఒకే రోజున ఒకే విధంగా జరిపే ఉత్సవం కార్తీక పౌర్ణమి నాటి కార్తీక దీపోత్సవం. మామూలుగా కృత్తికా నక్షత్రం కార్తీక పౌర్ణిమ తిథి కలిసి వస్తుంటాయి అప్పుడప్పుడు నక్షత్రము ఒక రోజున పౌర్ణమి ఒక రోజున విడివిడిగా రావడం కూడా జరుగుతుంది. ఎక్కువగా కృత్తికా నక్షత్రాన్ని ఈ దీపారాధనకు ముఖ్యమని భావిస్తారు. అందుకే ఈ దీపారాధనకు కృత్తికా దీపం లేదా కార్తీక దీపం అని పేరు వచ్చింది.

**ఆరోగ్య ప్రదం కార్తీక వన భోజనం**

కార్తీక మాసంలో చేసే వనభోజనం ఎంతో ఆరోగ్యప్రదం. వనభోజనం అన్న మాటకి యదార్ధమైన అర్థం ఏమిటంటే 'వనం' అన్న మాటకి అమర కోశం వ్యాఖ్యానం చేసింది. వనం అంటే మాట. అందరూ అరణ్యమును ప్రేమించి కలిసి సంతోషంగా భక్ష్య భౌజియా పానీయాలతో కూడిన షడ్రసోపేతమైన పదార్థాలను ఆరగిస్తూ, మంచి మాటలు వినాలి. ఇకపై వీలైనంత వరకు వైరాగ్య భావంతో జీవించాలని అర్థం. కానీ ఏదో అన్నము ఒక్కటే తినడానికి వనభోజనానికి వెళ్ళక్కర్లేదని శాస్త్రాలు చెబుతున్నాయి. వాస్తవంగా ఆలోచిస్తే అందరము చివరికి జనాలను విడిచి వనాలకు వెళ్లాల్సిన వారమే కదా! ఈ వాస్తవాన్ని కార్తీక మాస వన భోజనం మనకు తెలియజేస్తుంది. "పుత్రం పౌత్రం సమాసాధ్య వానప్రస్తాశ్రమేవసేత్. భార్యా, పుత్రీం, నివేశ్యచ" అన్నాడు వేదవ్యాస మహర్షి. అందుకే వన భోజనానికి వెళ్లేవారు వైరాగ్య భావనతో, పవిత్ర చింతనతో, నిష్కల్మష హృదయంతో వెళ్లాలి. ప్రకృతిలో ఆరోగ్యాన్ని సిద్ధింపజేసే ఆమలక (ఉసిరి చెట్లు) వృక్షాలు, తులసి వనము, మామిడి చెట్లు ఎక్కడ ఉన్నాయో అక్కడికే వెళ్లాలి. మామిడి చెట్టుకు సంస్కృతంలో 'రసాలం' అని పేరు. పరమేశ్వరుడు ఉన్న ఏకైక చెట్టు రసాలం అనగా మామిడి చెట్టు. ఉసిరి, మామిడి, తులసి చెట్లున్న వనానికి వెళ్లి మాత్రమే భోజనం చేయాలి అలా చేసిన భోజనమే కార్తీక మాస వన భోజనం అవుతుంది.

**జ్వాలా తోరణం**

కార్తీక మాసంలో పూర్ణిమనాడు చేసే మరొక దీపోత్సవం ఎదురెదురుగా రెండు స్తంభాలు పాతి వాటికి అడ్డంగా ఒక దూలాన్ని కడతారు ఎండు గడ్డిని ఆ మూడు బాజులకు దట్టంగా చుట్టి దాన్ని అంటిస్తారు. ఆ గడ్డి మండుతూ ఉండగా దాని కిందుగా పల్లకిలో స్వామివార్లను మూడుసార్లు తిప్పే ఆచారాన్ని కొన్ని పురాణ కథలు వివరిస్తున్నాయి. జ్వాలా తోరణ రూపంలోనే గాక ఆకాశదీపం, నందా దీపం, దొప్పలలో దీపాలు వెలిగించి పొలాల్లో, తటాకాలలో వదలడం వంటి ప్రక్రియల రూపంలో ఈనాడు ప్రధానంగా అగ్నిని ఆరాధిస్తున్నారు. ఈ మాసం పూర్తిగా ప్రతి సాయంత్రం ప్రతి ఇంటిలో ద్వారానికి రెండు వైపులా ద్వీపాలు వెలిగిస్తారు ఇంటి ముంగిట గుమ్మట దీపాలు వేలాడదీస్తారు. ఏది ఏమైనా పగలు తగ్గి రాత్రి హెచ్చుగా ఉండే ఈ కాలంలో నెమ్మదిగా చలి ప్రభావం పెరుగుతుంది. ఆ చలి ప్రభావాన్ని తగ్గించి, వాతావరణంలో ఉష్ణాన్ని పెంచి వాతావరణ సమతుల్యతను కాపాడటానికి ఇంటింటా ఈ దీపారాధనలు దోహదం చేస్తాయన్నది వాస్తవమైన విషయం. దీన్నే పెద్దలు చెప్పిన ఆచారంగా మనం పాటిస్తే మనకు తెలియకుండానే మనందరికీ ఎంతో ఉపకారం జరుగుతుంది. అందుకే 'పెద్దల మాట సద్దన్నపు మూట' అనే నానుడి ప్రచారంలోకి వచ్చింది.

ఏది ఏమైనా దక్షిణ భారతదేశంలో కార్తీక మాసానికి కార్తీక దీపోత్సవాలకు ఎంతో విశేషమైన ప్రాధాన్యత ఉంది అని చెప్పక తప్పదు. ఈ మాసంలో శివుడు అగ్ని రూపంలో వ్యక్తమవుతాడని పురాణాలు చెబుతున్నాయి. అగ్ని అన్నింటిలో ఉండే అపవిత్రతని ఏ విధంగా నశింపజేస్తాడో అదేవిధంగా భగవంతుడు మానవునిలోని అజ్ఞానం, అహంకారం, అసూయ మొదలైన చెడ్డ గుణాలను జ్ఞానమనే ఒక్క దీపాన్ని వెలిగింపజేసి ప్రకాశవంతం చేస్తాడని ఈ కార్తిక మాసంలో జరిపే దీపోత్సవం మనకు తెలియజేస్తుంది. ఈ విషయాన్ని అర్థం చేసుకుంటూ తాత్వికచింతనతో కార్తిక మాసాన్ని వైభవంగా జరుపుకుందాం! సనాతన హైందవ ధర్మాన్ని నిలబెడుదాం! స్వస్తి.



వ్యాసకర్త: "సాహిత్య కళా విభూషణ"
-చౌడూరి నరసింహారావు
ఆధ్యాత్మిక,సామాజిక విశ్లేషకులు

# పురుష పాత్రలను పోషించిన మహానటి

## నేడు అబ్బూరి కమలాదేవి జయంతి

మగవారు స్త్రీ పాత్రలు పోషిస్తున్న పాత కాలపు రోజులలో ఒక మహిళ పురుషపాత్రలను ధరించడం ఆశ్చర్యం కలిగించక మానదు. ఆ ఘనత అబ్బూరి కమలా దేవికే దక్కింది.

తెలుగు రంగ స్థలంలో పురుష పాత్రలను అద్భుతంగా పోషించి, చరిత్ర సృష్టించిన మహానటి అబ్బూరి కమలాదేవి. ఆనాటి సమాజంలో స్త్రీలకు అందుబాటులో లేని అవకాశాలను అందుకుని, తన ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నారు.



**బాల్యం ... ప్రారంభ జీవితం:**

1925 నవంబర్ 2న కృష్ణా జిల్లా, పెడన గ్రామంలో జన్మించిన కమలాదేవి, చిన్నప్పటి నుండి సంగీతం , నాటకాలపై ఆసక్తి చూపించేవారు. తన అన్నయ్యతో కలిసి నాటకాలకు వెళ్లి, రిహార్సల్స్ చూడటం ఆమెకు నాటకాలపై మమకారం పెంచింది. అయితే, ఆనాటి సమాజంలో స్త్రీలు నటించడం అనేది అంగీకరించలేని విషయం. కుటుంబం నుండి వ్యతిరేకత ఎదుర్కొన్నప్పటికీ, తన కలలను వదులుకోలేదు.

**రంగస్థల ప్రస్థానం:**

ఇంటి నుండి వెళ్లి, గుడివాడలో మల్లికార్జునరావు వద్ద పద్యాలు నేర్చుకున్న కమలాదేవి, తులసీదాసు నాటకంలో మమత పాత్రను, కృష్ణలీలలు నాటకంలో దేవకి పాత్రలను పోషించి ప్రేక్షకులను అలరించారు. ఆ తర్వాత ఏలూరుకు వెళ్లి అక్కడ అద్దంకి శ్రీరామమూర్తి, బందా కనకలింగేశ్వరరావు వంటి ప్రముఖ నటులతో కలిసి నటించారు.

**చారిత్రక నిర్ణయం:**

'శ్రీకృష్ణ తులాభారం' నాటకంలో శ్రీకృష్ణుని పాత్ర పోషించడం ద్వారా కమలాదేవి తెలుగు రంగస్థల చరిత్రలో ఒక మైలురాయిని సృష్టించారు. ఆనాటి సమాజంలో మహిళ ఒక పురుష పాత్రను పోషించడం అనేది అసాధారణమైన విషయం. కమలాదేవి తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుని, మహిళలకు కూడా ఏ పాత్రనైనా పోషించగలమని నిరూపించారు.

**ప్రముఖుల సరసన నటించే అవకాశం**

ఈమె అబ్బూరి వరప్రసాదరావు, పీసపాటి, మల్లాది, పువ్వుల సూరిబాబు, మాధవపెద్ది వెంకటరామయ్య, షణ్ముఖి ఆంజనేయ రాజు, అద్దంకి శ్రీరామమూర్తి, ఆచంట వెంకటరత్నం నాయుడు, కళ్యాణం రఘురామయ్య, బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి మొదలైన ప్రముఖులతో కలిసి నటించిన అరుదైన అవకాశం ఆమెకు దక్కింది. కురుక్షేత్రం నాటకంలో రఘురామయ్య ఒకటవ కృష్ణుడుగా నటిస్తే ఈమె రెండవ కృష్ణుడిగా, మాధవపెద్ది వెంకట్రామయ్య దుర్యోధనుడి పాత్రలో నటిస్తే ఈమె కృష్ణుడుగా, బాలనాగమ్మ నాటకాలలో పీసపాటి సత్యవతి బాల నాగమ్మగా వేషం కడితే ఈమె కార్యవర్ధిగా చింతామణి నాటకంలో బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి చింతామణిగా నటిస్తే ఈమె బిల్వమంగళుడిగా నటించారు.

**అబ్బూరి నాగేశ్వరరావుతో జీవితం:**

అబ్బూరి నాగేశ్వరరావును కులాంతర వివాహం చేసుకుని అబ్బూరి కమలాదేవిగా మారారు. తెనాలిలో ప్రముఖ నాటక నిర్మాత అయిన అబ్బూరి నాగేశ్వరరావు కమలాదేవి ప్రతిభను గుర్తించి, ఆమెతో కలిసి పనిచేయడం ప్రారంభించారు. వీరి కలయిక తెలుగు రంగస్థలానికి ఎన్నో మంచి నాటకాలను అందించింది.

**పురస్కారాలు ... గుర్తింపు:**

కమలాదేవి తన సుదీర్ఘ నట జీవితంలో అనేక పురస్కారాలను అందుకున్నారు. ఆమె తెలుగు రంగస్థలంపై చేసిన కృషిని గుర్తించి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమెకు అనేక గౌరవాలు అందించింది. అబ్బూరి కమలాదేవి తెలుగు రంగస్థలంపై చూపించిన ప్రభావం అపారమైనది. ఆమె తన నటన ద్వారా మహిళలకు స్వేచ్ఛ , సమానత్వాన్ని అందించారు. ఆమె తర్వాత వచ్చిన అనేకమంది మహిళా నటీమణులకు స్ఫూర్తిగా నిలిచారు. అబ్బూరి కమలాదేవి ఒక గొప్ప నటి మాత్రమే కాకుండా, ఒక సాహస స్త్రీ కూడా. ఆమె తన కాలంలో సాంప్రదాయాలను అతిక్రమించి, తన కలలను సాకారం చేసుకున్నారు. తెలుగు రంగస్థల చరిత్రలో ఆమె పేరు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలిచి ఉంటుంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# కార్తీకం.. ప్రతీరోజు పండుగే

పరమ పవిత్రమైనది కార్తీకం. శివకేశవులిద్దరికీ అభేదం చెబుతూ శివ సన్నిధిలో విష్ణు ధ్యానం చేయడమేనేదే కార్తీక మాస విశిష్టత అంటూ పురాణాలు చెబుతున్నాయి. కార్తీక మాస మహాత్మ్యం, విశిష్టత గురించి పద్మపురాణం, స్కాంధ పురాణం, కార్తీక పురాణం ఇంకా అనేకమైన పురాణాలు చాలా విపులంగా చెప్పాయి. రాత్రులందు విష్ణుభగవానుని సన్నిధిలో జాగారం చేయడం, వేకువ ఝామునే లేచి స్నానం చేయడం, తులసి ఆకులను సేవించడం, దీపాన్ని దానం చేయడం, మాసం చివరి రోజున ఉద్యాపన చేయడం కార్తీక మాసంలో విధిగా చేయాల్సినవి. వీటిని ఎవరైతే శ్రద్ధగా భక్తిగా పాటిస్తారో వారికి సంపూర్ణ ఫలం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. చంద్రుడు అగ్ని నక్షత్రమైన కృత్తికా నక్షత్రంలో పూర్ణస్థితిలో ఉంటాడు. కనుక ఈ మాసానికి కార్తీక మాసమని పేరు. శివకేశవులిద్దరికీ ఎంతో ప్రీతికరమైనది. కనుకనే ఎన్నో మంచి పనులు ఈ మాసంలో ప్రారంభిస్తారు. ముముక్షువులకు ఎంతో మనసైనది ఈ కార్తీక మాసం. కార్తీక మాస మాహాత్మ్యాన్ని మొదటగా వశిష్ఠ మహర్షి జనక మహారాజుకు చెప్పగా నారద మహర్షి పృథు చక్రవర్తికి చెప్పాడు. సూతుడు శౌనకాదిమునులకు మరింతగా వివరించి చెప్పాడు. ఈ కార్తీక మాసంలోని ఒక్కొక్క రోజుకు ఒక్కో విశేషం ఉంది. ఈ నెల రోజులూ పర్వదినాలే.

**1. కార్తీక శుద్ధ పాడ్యమి:** దీనిని బలి పాడ్యమి అంటారు. ఈ రోజున బలి చక్రవర్తిని పూజించడం ఆచారం. దానాలు చేస్తే సంపదలు వృద్ధి చెందుతాయని పెద్దలు చెబుతుంటారు. తెల్లవారుఝామునే లేచి స్నానం చేసి, ఆలయానికి వెళ్ళి కార్తీక వ్రతం నిర్విఘ్నంగా సాగేటట్లు అనుగ్రహించమని ప్రార్థించి సంకల్పం చెప్పుకుని ఆకాశ దీపాన్ని దర్శించుకోవాలి.

**2. విదియ:** ఈ రోజున భగినీ హస్త భోజనం చేయాలి. దీనిని యమ ద్వితీయ, భ్రాతృ ద్వితీయ అని కూడా అంటారు. ఈ రోజు సోదరి ఇంటికెళ్ళి ఆమె చేతి భోజనం చేసి కానుకలు ఇవ్వాలి. అట్లా చేసినవారికి స్త్రీలకు ఐదవ తనం వృద్ధి చెందుతుంది. మగవారికి యమగండం వాటిల్లదు అని పురాణాలు చెబుతున్నాయి. ఈ రోజున యముడు తన సోదరి యమునతో కలిసి సహపంక్తి భోజనం చేశాడని పురాణాలు చెబుతున్నాయి.

**3.తదియ:** అమ్మవారికి కుంకుమ పూజలు చేయాలి. అందువల్ల సౌభాగ్య సిద్ధి.

**4.చవితి:** దీనినే నాగుల చవితి అంటారు. ఈ రోజున సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి (పాము) పుట్టలో పాలు పోసి పూజ చేయాలి. సంతానం లేని వారు తప్పనిసరిగా పూజ చేయాలి. పుట్టలో పాలు పోయాలి. అందువల్ల పిల్లలు కలుగుతారట.

**5. పంచమి:** దీనినే జ్ఞాన పంచమి అని అంటారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేయడం వల్ల జ్ఞానం వృద్ధి అవుతుంది.

**6. షష్ఠి :** ఈ రోజున బ్రహ్మచారికి ఎర్రని కండువా దా నం చేస్తే సంతానం కలుగుతుంది.

**7. సప్తమి:** ఈ రోజున ఎర్రని వస్త్రంలో గోధుమలు పోసి దాన మివ్వడం వల్ల ఆయుష్షు వృద్ధి చెందుతుంది.

**8. అష్టమి:** ఈ రోజున గోష్ఠాష్టమి అంటారు. గోపూజ చేయడం వల్ల విశేష ఫలితం లభిస్తుంది.

**9. నవమి :** నేటి నుంచి మూడు రోజుల పాటు విష్ణు త్రిరాత్ర వ్రతాన్ని ఆచరించాలి.







**10.దశమి:** ఈ రోజు రాత్రి విష్ణు పూజ చేయాలి.

**11.ఏకాదశి:** ఈ రోజును ప్రబోధన ఏకాదశి అని, ఉత్థాన ఏకాదశి అని, తొలి ఏకాదశి అని అంటారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి (అదే తొలి ఏకాదశి) నాడు ప్రారం భమైన చతుర్మాస వ్రతం ఈ ఏకాదశితో ముగుస్తుంది. ఆనాడు తొలి ఏకాదశినాడు శయనించిన శ్రీ మహావిష్ణువు ఈ రోజున యోగనిద్ర నుంచి మేల్కొంటారు. అందుకే ఇది ఉత్థాన ఏకాదశి అయ్యింది. దీనినే బోధనైకాదశి అని కూడా అంటారు. కనుక ఈ రోజు విష్ణు పూజ చేసిన వారికి ఉత్తమ గతులు లభిస్తాయని, వస్త్రదానం చేయాలని చెబుతారు.

**12. ద్వాదశి :** క్షీరాబ్ధి ద్వాదశి అని, చిలుకు దశి అని అంటారు. క్షీరం అంటే పాలు, అబ్ధి అంటే సముద్రం, ద్వాదశి అంటే మాసంలోని పన్నెండవ రోజు అని అర్థం. శ్రీహరి కార్తీక శుద్ధ ఏకాదశి నాడు యోగనిద్ర ముగించి ఉత్తితుడు కాగానే పాలముద్రంలో తన మామగారింట్లో అభినందనలు అందుకుంటాడు. లక్ష్మీదేవి అందంగా ముస్తాబు కాక శ్రు చేస్తుంది. ఆ మర్నాడు వచ్చే ద్వాదశి అందుకే క్షీరాబ్ధి ద్వాదశి అని అంటారు. పూర్వం దేవతలు, రాక్షసులు అమృతం కోసం పాల సముద్రాన్ని ఈ రోజునే చిలికారని, అందుకే దీనిని చిలుకు ద్వాదశి అని కూడా అంటారు. ఈ రోజు సాయంత్రం ఉసిరి మొక్కను, తులసి మొక్క దగ్గర వుంచి దామోదరుడిని పూజించి దీపాలు వెలిగిస్తారు. తద్వారా సర్వపాపాలు నశిస్తాయి. తులసి పూజలు చేసిన వారింట్లో ఎవరికీ అకాల మరణం సంభవించదని చెబుతుంటారు. ఈ రోజును హరి బోధిని అని కూడా అంటారు. అంబరీషుడు ద్వాదశీ వ్రతాన్ని ఆచరించి విష్ణుకృపకు పాత్రుడైనాడని పురాణాలు చెబుతుంటాయి.

**13. త్రయోదశి :** ఈ రోజు సాలగ్రామ దానం చేయడం వల్ల సర్వ కష్టాలు దూరమవుతాయి.

**14. చతుర్దశి :** వైకుంఠ చతుర్దశి అని కూడా అంటారు. ఈ రోజు మహావిష్ణువు పరమశివుడిని పూజించారు. ఈ రోజు రాగి లేదా ఇత్తడి కుందులతో దీపాలు వెలిగించి దీపారాధన చేయాలి. ఈరోజు పాషాణ చతుర్దశి వ్రతం కూడా కొందరు చేసుకుంటారు.

**15. కార్తీక పౌర్ణమి :** మహా పవిత్రమైన ఈ రోజున నదీ స్నానం చేసి పగలంతా ఉపవాసం ఉండి శివాలయంలో రుద్రాభిషేకం చేయించి, మట్టిప్రమిదలో 365 ఒత్తులను ఆవు నేతిలో వెలిగిస్తే సమస్త పాపాలు భస్మీపటలమై ఇహలోకంలో సర్వసౌఖ్యాలను అనుభవించి అంత్యకాలాన పుణ్యలోకాలు పొందుతారు. ఈ రోజు రాత్రి శివాలయం వద్ద జ్వాలాతోరణం వెలిగిస్తారు. దానిని దర్శించడం వల్ల సర్వపాపాలు తొలగిపోతాయి. త్రిపురాసురులను వధించిన పరమేశ్వరునికి దృష్టి దోషం పోయేందుకు పార్వతీదేవి మొదటిగా జ్వాలా తోరణ ఉత్సవాన్ని చేసినట్లు ఆర్యులు చెబుతున్నారు. ఈ రోజును త్రిపుర పూర్ణిమ అని కూడా అంటారు.

సాగర మథనం జరిగినప్పుడు సముద్రం నుంచి ఉద్భవించిన హాలాహలాన్ని శివుడు మింగుతున్న సమయంలో తన పతికి ఏ ఆపదా కలగకుండా తన మాంగల్యాన్ని కాపాడాలని కోరుకుంటూ శివాలయం వద్ద జ్వాలాతోరణం వెలిగిస్తానని పార్వతీదేవి మొక్కుకుంది. విషం మింగిన శివుడికి ఎట్లాంటి ఆపదా కలగలేదు కాబట్టి శివాలయం వద్ద జ్వాలాతోరణం వెలిగించి మొక్కు తీర్చుకున్నదని, అప్పటి నుంచి ప్రతి శివాలయం వద్ద జ్వాలాతోరణం ఉత్సవాన్ని ర్వహిస్తున్నారని పౌరాణికులు చెబుతున్నారు. ఈ రోజున మార్కండేయ పురాణం పంచిపెడితే పౌండరీక యజ్ఞం చేసిన ఫలితం దక్కుతుంది.

**16. బహుళ పాడ్యమి:** ఈ రోజు ఆకుకూరలు దానం చేయాలి.

**17. విదియ :** వనభోజనం చేయడం విశేషఫలం లభిస్తుంది.

**18. తదియ :** పండితులకు, గురువులకు తులసి మాలలను దం ఇవ్వడంవల్ల తెలివితేటలు వృద్ధి అవుతాయి.

**19. చవితి:** పగలంతా ఉపవసించి, సాయంత్రంవేళ గణపతిని గరికతో పూజించి ఆ గరికను తలగడ కింద పెట్టుకుని పడుకుంటే దుస్వప్న దోషాలు తొలగి, సకల సంపదలు కలుగుతాయి.

**20. పంచమి :** చీమలకు నూకలు చల్లడం, శునకాలకు అన్నపెట్టడం వల్ల శుభ ఫలితాలు కలుగుతాయి.

**21.షష్ఠి:** గ్రామదేవతలను పూజించాలి.

**22. సప్తమి :** జిల్లేడు పూలతో గుచ్చిన దండను శివుడికి సమర్పించడం వల్ల సంపదలు వృద్ధి చెందుతాయి.

**23. అష్టమి :** కాలభైరవాష్టకం చదివి, మినపగారెలతో దండ తయారుచేసి కాలభైరవుడికి (కుక్కకు) సమర్పిస్తే బోధన వృద్ధి కలుగుతుంది.

**24. నవమి :** వెండి లేదా రాగి చెంబులో నీరుపోసి పండితునికి ఇవ్వడం వల్ల పితృదేవతలు తరిస్తారు.

**25. దశమి :** అన్న సంతర్పణ చేసినచో విష్ణుమూర్తికి ఇష్టులై కోరికలు తీర్చుకోవచ్చు.

**26. ఏకాదశి :** దీనిని రమా ఏకాదశి అని కూడా అంటారు. ఈ రోజున పెసర పిండితో చేసిన లడ్లు, బెల్లం దానం చేసిన విశేష ఫలం లభిస్తుంది. ఈ రోజున విష్ణుమూర్తి ఆలయంలో దీపారాధన, పురాణ శ్రవణం, పఠనం, జాగరణ విశేష ఫలితాలనిస్తాయి.

**27. ద్వాదశి:** అన్నదానం లేదా స్వయం పాకం ఇవ్వడం కరం, దూడతో కలిసిన ఆవును పూజించడం పుణ్యదాయకం.

**28. త్రయోదశి:** నవగ్రహారాధన చేయడం వల్ల గ్రహదోషాలు తొలగుతాయి. యమధర్మరాజుకు తర్పణాలు వదలాలి అని పురాణాలు బుతున్నాయి.

**29. చతుర్దశి:** మాస శివరాత్రి అని కూడా అంటారు. శివుని పూజించడం వల్ల అపమృత్యు దోషాలు, గ్రహ బా ధలు తొలగిపోతాయి. శివపూజకు ఎంతో విశేషంగా అనుకూలించిన రోజు.

**30. అమావాస్య :** నేడు పితృదేవతలు పేరిట అన్నదానం లేక స్వయంపాకం ఇవ్వటం వల్ల పెద్దలకు నరక బాధలు తొలిగి స్వర్గసుఖాలు కలుగుతాయి. భారత యుద్ధ సమయంలో శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి గీతోపదేశం చేశాడని, అందువల్ల ఈ రోజు గీతా జయంతి అని పురాణాలు, శాస్త్రాలు చెబుతున్నాయి. కొన్ని ప్రాంతాలలో చాకలి పోలిని స్వర్గానికి పంపించే ఆచారాన్ని ఈ రోజు కూడా కొనసాగిస్తున్నారు. బోళా శంకరుడు భక్తవశంకరుడు అయిన పరమేశ్వరునికి ఎంతో ఇష్టమైన ఈ కార్తిక మాసం లోని మొత్తం రోజులన్నీ ప్రీతి పాత్రమైనవేనని పౌరాణికులు, ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు కదా. శక్త్యానుసారంగా శివారాధన చేసి ఆదిదంపతుల అనుగ్రహానికి పాత్రులు కాగలరు.



-అక్షర కిరీటి తెన్నేటి మాస్టారు
పశ్చిమ గోదావరి జిల్లా
సెల్: 8247433432



నూతనంగా బదిలీపై వచ్చిన ఆర్డీవో సరితను మర్యాదపూర్వకంగా కలిసిన షాద్‌నగర్ తాలూకా టీఎన్జీవో నేతలు జిల్లా ఉపాధ్యక్షులు ఆనంద్ సింగ్, తాలూకా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, తాలూకా ప్రచార కార్యదర్శి శ్రీహరి, షాద్‌నగర్ ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ బాలవర్ధన్, ఆర్డీఓ ఆఫీస్ సూపరింటెండెంట్ రాకేష్ తదితరులు. - విశ్వంభర, షాద్‌నగర్

## మైసిగండి మైసమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తా
## కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలం మైసిగండి దేవస్థానం సమీపంలోని పురేనాగిరి కొండపై వెలసిన దత్తాత్రేయ స్వామికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి పీసీసీ సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్ దీపావళి పండుగ పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురేనాగిరి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. అనంతరం మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని సందర్శించారు. మైసమ్మ ఆలయ అర్చకులు, నిర్వాహకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఫౌండర్ ట్రస్ట్ శిరోలి పంతుతో కలిసి ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి తెలంగాణలోనే గొప్ప దేవాలయాల్లో ఒకటిగా ఉండేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, తహసీల్దార్ జ్యోతి, జీ గూడూరు భాస్కర్ రెడ్డి, నాయకులు శేఖర్, హీరాసింగ్, తులసీరాం, చందోజీ తదితరులు పాల్గొన్నారు.

## స్కాలర్షిప్స్ విడుదల అయ్యేవరకు
## ఏఐఎస్ఎఫ్ పోరాటాలు ఆగవు



**విశ్వంభర, షాద్‌నగర్:** ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ ఇంచార్జ్ ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం షాద్‌నగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఎమ్మెల్యే ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల చదువుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ రూ. 8 వేల కోట్ల పైగా ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో 13లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యార్థుల స్కాలర్ షిప్ బకాయిలను విడుదల చేస్తామని చెప్పిన మాట తప్పారని అయన ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ షాద్ నగర్ అధ్యక్షులు నరేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ రావును కలిసిన కంబాల పరమేష్



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేష్ శుక్రవారం మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు హరీష్ రావును హైదరాబాదులోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. హరీష్ రావు రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నారని త్వరలో కల్వకుర్తి నియోజకవర్గంలో కూడా తలపెట్టే రైతు దీక్షకు హాజరుకావాలని కోరారు. ఆయన దీనికి సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, మహేష్, తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## క్యాంపు కార్యాలయంలో నేడు
## సమగ్ర కుల గణన సమీక్షా సమావేశం



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కులగణనపై నేడు ఎమ్మెల్యే సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణనపై కల్వకుర్తి క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అధికారులు, కాంగ్రెస్ నాయకుల తో కలిసి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు క్యాంపు కార్యాలయంలో జరిగే సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

# సిండికేట్లైన వైన్స్, బెల్టు షాపులు

- నిబంధనలు పాటించని వైన్ షాప్‌పై చర్యలు తీసుకోవాలి
- ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం
- ఇష్టానుసారంగా దందా చేస్తున్న వైన్స్, బెల్ట్ షాపులు




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం మోత్కూర్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని ఆత్మకూరు (ఎం), మండలంలో మోత్కూర్ కి చెందిన ఒక పత్రిక విలేకరీ అండదండలతో విచ్చలవిడిగా బెల్ట్ షాపుల నిర్వహన జరుగుతూ మద్యంను అధిక రేట్లకు అమ్ముతూ దోచుకుంటున్న బెల్టు షాపులపై చర్యలు తీసుకొని వాటిని మూసివేయాలని, నిబంధనలు పాటించని వైన్ షాప్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలో వైన్ షాపుల నిర్వాహకులు సిండికేట్గా ఏర్పడి అక్రమ దందా చేస్తున్నారని, బెల్టు షాపులను ప్రోత్సహిస్తూ అధిక ధరలకు మద్యాన్ని అమ్ముతూ దోచుకుంటున్నారు. వైన్స్ షాపుల్లో కొన్ని బ్రాండ్లకు కృత్రిమ కొరతను సృష్టిస్తూ, బెల్ట్ షాపులకు సప్లై చేస్తున్నారు. వైన్ షాపులో యాజమానులు అధిక ధరలకు బెల్టు షాపులకు మద్యం సరాపార చేయడం బెల్టు షాపులు వాటిపై రేట్లు పెంచి అమ్మడం జరుగుతున్న ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంలో అనేక అనుమానాలకు తావిస్తుందని, అధికారుల నిర్లక్ష్యం వల్లే బెల్ట్ షాపులు వైన్ షాపుల యజమానులు రెచ్చిపోయి ఇష్టానుసారంగా మద్యం వ్యాపారం చేస్తున్నారని, గతంలో అనేకసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని, వైన్ షాపులకు పర్మిట్ రూములకు అనుమతులు ఇస్తే బార్లను మించి పోతున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పర్మిట్ రూంలలో తినుబండారాల్లో నాణ్యత, శుభ్రత పాటించడం లేదు, అధికారుల పర్యవేక్షణ లేదు మండిపడుతున్నారు. ఇష్టానుసారంగా మద్యం పేరుతో దందా చేస్తున్న వైన్ షాపులపై చర్యలు తీసుకొని, బెల్టు షాపులను రద్దు చేయాలని ఎక్సైజ్ అధికారులను ఆత్మకూరు(ఎం) మండల ప్రజలు కోరుతున్నారు.

## కులగణనకు సిద్ధం కావాలి

### ఆర్థిక, కుల వివక్షత తొలిగి అందరం సమానమే



**విశ్వంభర, మహేశ్వరం :** తెలంగాణలో ఆర్థిక, సామాజిక అసమానతలు తొలగించేందుకు సీఎం రేవంత్ రెడ్డి తలపెట్టిన కుల గణన సర్వేకు కాంగ్రెస్ శ్రేణులు పూర్తిగా అధికార యంత్రాంగానికి సహకరించాలని కేఎల్ఆర్ కోరారు. ఈనెల 6 నుంచి ప్రారంభం కానున్న కుల గణన సర్వే 30 నాటికి పూర్తి చేసి దేశానికి ఆదర్శంగా నిలుస్తామని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ అభివృద్ధి ఫలాలు పేద వర్గాలకు అందేలా రాజ్యాంగం ప్రసాదించిన సమాన హక్కులు బడుగు బలహీన వర్గాలకు అందేలా కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. కేఎల్ఆర్ భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ చెప్పినట్టు అన్ని వర్గాలకు సమ న్యాయం జరగాలంటే కుల గణన సర్వే అవసరమని లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో చేపట్టబోయే ఈ సర్వేపై విపక్షాలు అనవసర రాద్ధాంతం చేయకుండామేధావులు, సామాజిక వేత్తలు, కుల సంఘాల పెద్దలు సహకరించి అమూల్యమైన సలహాలు ఇవ్వాలని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కోరారు.

## సర్వేకు సర్వం సిద్ధం



**విశ్వంభర, కేశంపేట :** సామాజిక, ఆర్థిక, విద్యా రాజకీయ, కుల గణన శిక్షణలో భాగంగా మండల కేంద్రంలో మూడు రోజుల నుంచి ఎనీమరేటర్లకు, సూపర్వైజర్లకు, శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా శిక్షణ అనంతరం సర్వే కోసం వారికి ఎడ్యుకేషన్, ఎకనామిక్, ఎంప్లాయిమెంట్, పొలిటికల్ అండ్ కులాల సర్వేకు సంబంధించిన మెటీరియల్ ఏనుమిరేటర్స్ కు మండల అభివృద్ధి అధికారి రవిచంద్ర కుమార్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి శాఖ అధికారి మాట్లాడుతూ.. సర్వేను ఖచ్చితంగా, జాగ్రత్తగా నిర్వహించాలని కోరారు.

## అమరవీరుల ఆశయ సాధనకై ఉద్యమిద్దాం




**విశ్వంభర, మహబూబాబాద్ :** మహబూబా బాద్ జిల్లా తహసీల్దార్ కార్యాలయం సెంటర్లోని అమరులు కామ్రేడ్ శ్రీరంగ దాసులు స్మారక స్తూపం దగ్గర సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు కామ్రేడ్ షరీఫుద్దీన్ అధ్యక్షతన సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కామ్రేడ్ ఎస్కే బాబన్న జెండా ఆవిష్కరణ చేశారు. అలాగే మహబూబాబాద్ బస్టాండ్ సెంటర్లో గల అమరుడు కామ్రేడ్ మాధవన స్తూపం దగ్గర సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కే భాస్కర్ రెడ్డి అధ్యక్షతన సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె మదర్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ యొక్క కార్యక్రమాలను ఉద్దేశించి ఎస్.కె మదర్ ఎస్ కే బాబన్న ప్రసంగిస్తూ.. గోదావరి లోయ పరివాహక ప్రాంతంలో భూమికోసం, భుక్తి కోసం ఈ దేశ విముక్తి కోసం కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి, పొట్ల రాం నరసయ్య నీలం రామచంద్రయ్య మన జిల్లా ఉద్యమంలో కామ్రేడ్ దొరన్న కామ్రేడ్ మాధవ్ అన్న, కామ్రేడ్ సురేష్ అన్న, మురళి, ఎల్లన్న, పుల్లన్న, గణేష్ తదితరులు అమరులయ్యారు. వారి ఆశ సాధన కోసం మనం ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. విప్లవద్యమంలో నవంబర్ మాసంలోనే అనేకమంది వీరులు అమరులయ్యారు. కనుక ప్రతి సంవత్సరం ఒకటి నుంచి తొమ్మిది వరకు సంస్మరణ సభలను నిర్వహించుకుంటున్నాం వారి ఆశయం దున్నే వాడికే భూమి కావాలి పీడత రాజ్యం రావాలంటే నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారానే సాధ్యమవుతుందని వారు అన్నారు. వారి ఆశయం కోసం సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు బానోత్ దేవేందర్, అరుణోదయ, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, మీడియా ఇన్చార్జిగా బీబీఆర్ వేణు



**విశ్వంభర, ఎల్బీనగర్ :** తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధిగా, మీడియా ఇన్చార్జిగా బీబీఆర్ వేణు నియామకమయ్యారు. ఈ మేరకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధ మల్ల ఆనంద్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ.. జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి , కేంద్ర హొంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ , ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆశీస్సులతో తన నియామకానికి సహకరించిన రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షుడు బొక్క నరసింహ రెడ్డి, ఆర్కే పురం డివిజన్ కార్పొరేటర్ రాధ దీరజ్ రెడ్డి, గీత సెల్ కో కన్వీనర్ రాగుల కిరణ్ కుమార్ గౌడ్, ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ పార్టీ ఏ పిలిపినిచ్చిన బాధ్యతతో పనిచేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ పటిష్టతకు తన వంతు నిర్విరామంగా పనిచేస్తానని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు నడుం బిగించాల్సిన అవసరం ఉందన్నారు. కులగనను ప్రభుత్వం చిత్త శుద్ధితో చేయాలని సూచించారు. మూసి ప్రక్షాళనపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా, పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు.

## టీడీపీ సభ్యత్వ నమోదు

### టీటీడి డైరెక్టర్ నన్నూరి నర్సిరెడ్డికి తెలుగు యువత ఆధ్వర్యంలో సిరిపురం గ్రామస్తుల శుభాకాంక్షలు



**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని సిరిపురంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమాలను రామన్నపేట మండల సభ్యత్వ పరిశీలకులు పోచబోయిన మల్లేశం, కురుమ మహేందర్‌ల సమక్షంలో రామన్నపేట మండల తెలుగు యువత అధ్యక్షుడు మీర్జా ఫజల్ బేగ్, తెలంగాణ టీఎన్ఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి నకిరేకంటి గణేష్, పట్టణ అధ్యక్షుడు దండగుల రాములు, చేనేత విభాగం రాష్ట్ర నాయకుడు గోషిక చక్రపాణి, రామన్నపేట బీసీసెల్ మండల అధ్యక్షుడు, మాజీ ఉపసర్పంచ్ సిరిపురం పున్న వెంకటేశం ముఖ్య అతిథులుగా పాల్గొని సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించి, సిరిపురం గ్రామస్తులు నన్నూరి నర్సిరెడ్డికి తిరుమల తిరుపతి దేవస్థానం డైరెక్టర్ గా నియమితులైన శుభ సందర్భంలో వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిపురం గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు గోషిక మల్లేశం, మాజీ వార్డు సభ్యులు సాయిని శేఖర్, కొంపల్లి వీరేశం, బొడ్డుపల్లి శంకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నేపాలీ టిబెటన్ స్వెటర్ మార్కెట్ ఎగ్జిబిషన్ ప్రారంభం



**విశ్వంభర, హనుమకొండ:** హనుమకొండలోని అశోక్ హొటల్ ఎదురుగా పాత మునిసిపాలిటీ గ్రౌండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నేపాలి టిబెటన్ స్వెటర్ మార్కెట్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ప్రతి యేటా శీతకాలం ప్రారంభ దశ నుంచి మార్చి వరకు హన్మకొండ నగర ప్రజలకు నేపాల్ టిబెటన్‌లు నాణ్యమైన అన్ని రకాల చిన్న నుంచి పెద్దలకు ఉపయోగ పడే ఉలెన్‌తో చేసిన వివిద రకాల దుస్తులను అతి తక్కవ ధరలకు అందించడం పట్ల ఎమ్మెల్యే వారిని అభినందించారు. టిబెటిన్ యజమానుల అసోసియేషన్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఎన్ఆర్ఐ పింగిలి భగవాన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి ఘనస్వాగతం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య లండన్ పర్యటన ముగించుకొని గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కి చేరుకున్నారు. దీంతో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యని ఆలేరు నియోజకవర్గ, రాష్ట్రంలోని పలు ప్రాంతల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. లండన్ పార్లమెంట్, థేమ్స్ నదిని, భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ నివాసమున్న గృహాన్ని సందర్శించారు. వ్యక్తి గత పర్యటన ముగించుకుని కుటుంబ సభ్యులతో హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్యకి కాంగ్రెస్ పార్టీ క్యాడర్, అభిమానులు ఘనస్వాగతం పలికారు.

## కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

### ఆపదలో ఉన్న వారికి కొండంత భరోసా: కొప్పుల హరిదీప్ రెడ్డి



**విశ్వంభర, ఆత్మకూరు (ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన బొంగు దుర్గాప్రసాద్‌కి ఇటీవల అపెండెక్స్ ఆపరేషన్ చేయించుకొని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కేహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డి 5000 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాయిని నర్సింహా రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గ్రామాధ్యక్షుడు సామ నరేందర్ రెడ్డి, నిమ్మారెడ్డి నరేందర్ రెడ్డి, సోలిపురం నర్సిరెడ్డి, మంగ శ్రీనివాస్, వంగపల్లి అర్జున్, జన్నపాల శేఖర్, దండు మల్లేష్, దండు నవీన్, దండు శశి తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, తల కొండపల్లి :** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో గ్రామపంచాయతీ సఫాయి కార్మికుడు బ్యాగరీ(చింతకుంట) నరసింహ అనారోగ్యంతో గురువారం మరణించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డోకురి ప్రభాకర్ రెడ్డి మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ 3 వేల రూపాయలు గ్రామ మాజీ ఉపసర్పంచ్ అజీజ్ 2 వేల రూపాయలు, మాజీ ఎంపీటీసీ మల్లె కేడి అంబాజీ 1 వెయ్యి, ఎండి అబ్బాస్ 1 వెయ్యి రూపాయలు కలిపి మొత్తం 7 వేల ఆర్థిక సహాయం స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ఎంపీటీసీ మల్లి కేడి అంబాజీ, మాజీ ఉప సర్పంచ్ అజీజ్ ,మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీల అధ్యక్షులు ఎండి ఆరిఫ్,నాయకులు ఎల్ మల్లేష్, ఎల్ దేవేందర్, పులిజాల విష్ణు, చింతకాయల లక్ష్మణ్, యాదగిరి, ఏం రమేష్, పులిజాల నర్సిమ్మ, రమేష్,రాజు, తదితరులు పాల్గొన్నారు

## క్రీడకారులకు బహుమతుల ప్రదానం




**విశ్వంభర, వెల్దండ :** దీపావళి పండుగ సందర్భంగా వెల్దండ మండల కేంద్రంలో సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ స్పాన్సర్‌గా వాలీబాల్ ప్రీమియర్ లీగ్‌ని నిర్వహించారు. పోటీలు శుక్రవారం ముగించడంతో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, నగదును మాజీ సర్పంచ్ భూపతిరెడ్డితో కలిసి అందజేశారు. ఈ ప్రీమియర్ వాలీబాల్ లీగ్ పోటీల్లో మొదటి బహుమతి గౌడుగు చంద్రశేఖర్ టీం, రెండో బహుమతి గంగాపురం మల్లేష్ టీం, మూడో బహుమతి చందు మాస్టర్ టీం గెలవగా, బెస్ట్ షూటర్‌గా మట్ట ఆనంద్ గౌడ్, గడ్డం నరేష్, బెస్ట్ లిఫ్టర్గా బాబి, బెస్ట్ లిఫ్టర్గా నూతన కంటి కుమార్ గెలిచి బహుమతులను వెంకటయ్య గౌడ్ ద్వారా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, క్రీడాకారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వే కోసం గణన ప్రారంభం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోవు సామజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) కోసం కుటుంబాల గణన ప్రారంభించారు. ఒక్కో ఎన్యూమరేటరుకు 150 కుటుంబాల చొప్పున కేటాయించడానికి, కుటుంబాల లెక్కింపు కావలసి ఉన్నందున, అన్ని గ్రామాల్లో పంచాయతీ సెక్రెటరీలకూ ఈ కుటుంబాలను లెక్కించే పని అప్పగించారు. కొత్తగూడెం గ్రామంలో కుటుంబాల లెక్కింపు కోసం గ్రామస్తుల దగ్గర ఆ గ్రామపు పంచాయతీ సెక్రెటరీ వివరాలు సేకరిస్తున్నారు.

## సెలూన్‌ని ప్రారంభించిన చిలుక ఉపేందర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ పరిధిలో రామకృష్ణ పురంలో ప్రిన్స్ యూనిసెక్ సెలూన్ ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువత ఉద్యోగం వైపు పరుగులు పెట్టకుండా, తన సొంత కాళ్లపై నిలబడే విధంగా వ్యాపారాన్ని ప్రారంభించుకోవడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో సెలూన్ యజమాని రవి కుమార్, సాయి, రాజు, విప్లవ్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత



**విశ్వంభర, కొందుర్గు :** కొందుర్గు మండలం శ్రీరంగాపురం గ్రామానికి చెందిన బుయ్యని పద్మ అనారోగ్యంతో కొంతకాలంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ సహాయం కోరుతూ ఎన్ పి ఆర్ డి రాష్ట్ర సభ్యుడు ఆశన్నగారి భుజంగారెడ్డి ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఖమ్మం వరంగల్ నల్గొండ ఎమ్మెల్సీ అలుగు బెల్లి నర్సిరెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 16,500 చెక్కును అందజేశారు. ఈ చెక్కును వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర సభ్యులు ఆశన్నగారి భుజంగారెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి శుక్రవారం చెక్కును అందించారు. ప్రభుత్వ సహాయం అందించినందుకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

- ఎంపీడీవో కుసుమ మాధురి



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు మండలంలోని చెన్నంపల్లి, మేడిగడ్డ, పోలేపల్లి, గ్రామాల్లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ఎన్యుమరేటర్లతో కలిసి ఆమనగల్లు ఎంపీడీవో కుసుమ మాధురి ప్రారంభించారు. సర్వేను చట్ట ప్రకారంగా చేయవలసిన ప్రక్రియని, ప్రణాళిక బద్ధంగా, సమర్థవంతంగా ఇంటింటి సర్వే నిర్వహించాలని ఎన్యుమరేటర్లకు ఆమె సూచించారు. బాధ్యతాయుతంగా సర్వే నిర్వహించి సకాలంలో పూర్తి చేయాలని ఆమె తెలిపారు. ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా సక్రమంగా ప్రజలకు అందించడానికి ఈ సర్వే ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి తో పాటు ఆయా గ్రామాల ఎనిమరేటర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## ఆటో, బైక్ ఢీకొని వ్యక్తి మృతి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** ఎదురుగా వస్తున్న ఆటో బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్ద శంకరంపేట పట్టణ సమీపంలోని తిరుమలాపూర్ 161 వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పేట ఏఎస్ఐ విటల్ తెలిపిన వివరాలు ప్రకారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామానికి చెందిన తలారి పీరయ్య (36) అల్లాదుర్గంలో అతని పని ముగించుకొని పెద్ద శంకరంపేటకు తిరిగి వస్తుండగా పెద్ద శంకరంపేట నుంచి అల్లాదుర్గం వైపు వెళ్తున్న ఆటోను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి.. వెంటనే 108లో జోగుపేట ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య తలారి సంతోష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు..

## జిల్లా వ్యాప్తంగా నెల రోజులపాటు పోలీసు యాక్ట్ అమలు: జిల్లా ఎస్పీ రూపేష్



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు (నవంబర్ 1వ తేదీ నుంచి 30 వరకు) 30, 30(ఎ) పోలీసు యాక్ట్–1861 అమలులో ఉంటుందని ఎస్పీ రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు.

## మేడిగడ్డ తండాలో చొప్ప లారీ దగ్ధం



**విశ్వంభర, ఆమనగల్లు:** అమనగల్లు మండలంలోని శంకర్ కొండ తండా గ్రామపంచాయతీ నుంచి వస్తున్న చొప్ప లారీ మేడిగడ్డ తండా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న శ్రీఅంజనేయం ఆలయంలో వద్ద సర్వీస్ వైర్ తగిలి చొప్ప లారీ దగ్ధం అయినా సంఘటన ఘటన చోటుచేసుకుంది. దగ్ధమైన లారీ దగ్గరికి అమనగల్లు మండల ఏ ఎస్సై బాల్ రెడ్డి, కల్వకుర్తి ఫైర్ స్టేషన్ ఎస్సై చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది చేరుకొని మంటలు ఆర్పారు. లారీ యజమాని మేడిగడ్డ తాండ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ గోపి నాయక్ తన సొంత అవసరాల కోసం చొప్పను తరలిస్తుండగా సంఘటన జరిగిందని కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బాల్‌రెడ్డి తెలిపారు.

# రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం

- సన్న వడ్లకు రూ.500 బోనస్
- రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది ఎమ్మెల్యే నాగరాజు



**విశ్వంభర, వరంగల్ :** రైతులు క్షేమంగా ఉండాలి... రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు 500రూపాయల బోనస్ ప్రకటించిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి నాగరాజు తెలిపారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 64వ డివిజన్ పరిధిలోని టేకులగూడెం గ్రామంలో దర్గా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నాగరాజు తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో కలిసి ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సన్న వడ్లకు మార్కెట్ ధరతోపాటు 500 రూపాయల బోనస్ అందిస్తున్నట్లు దీని కోసం 25వేల కోట్ల నిధులను సమాకూర్చినట్లు తెలిపారు. ఎలాంటి నిబంధనలు లేకుండా 500బోనస్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రెండు రకాల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి దొడ్డు రకం, సన్న రకం వడ్లను వేరు వేరుగా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం అమ్మిన రైతులకు రెండు, మూడు రోజులలో డబ్బులు జమ చేసేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే తెల్ల రేషన్ కార్డుదారులకు రేషన్ షాప్ ల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోందన్నారు. అలాగే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం, గురుకులాలకు సన్న బియ్యం అందించనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9నెలలలోనే 18వేల కోట్ల రుణాలు మాఫీ చేసినట్లు, మరో 3,4 నెలలలో మరో 12వేల కోట్ల రుణాలు మాఫీ చేయనున్నట్లు తెలిపారు. 43లక్షల మంది రైతులకు 31వేల కోట్ల రుణాలను మాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. అర్హులైన రైతులందరికి రుణ జరుగుతుందని, ఎవరూ అధైర్యపడవద్దని అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గం లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళల ద్వారా నిర్వహించాలానే ఐ.కే.పీలు పాక్స్ వార్ల అధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను కేటాయించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే నా దృష్టికి తీసుకురావాలని అన్నారు.

**హాలో రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్ననా డయల్ యువర్ ఎమ్మెల్యే 8096107107 కి కాల్ చేసి మీ సమస్యలను పరిష్కరించు కోవాలని ఎమ్మెల్యే సూచించారు.**

ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహ రెడ్డి, పాక్స్ చైర్మన్ వనం రెడ్డి, సొసైటీ డైరెక్టర్స్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాజీపేట మండల అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్, మండల మహిళా అధ్యక్షురాలు నీలం రజినీ, మండల కిసాన్ అధ్యక్షుడు నీలం వేణు, డివిజన్ అధ్యక్షుడు కుర్ల మోహన్, గ్రామ పార్టీ అధ్యక్షుడు శివరాజ్ డివిజన్, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఎమ్మార్వో, రైతులు హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

# సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

### హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



**విశ్వంభర, హనుమకొండ:** రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే( సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)ను పకడ్బందీగా నిర్వహించాలని హనుమకొండ కలెక్టర్ పీ ప్రావీణ్య ఎన్యుమరేటర్లను ఆదేశించారు.

శుక్రవారం హనుమకొండ జిల్లా కాజీపేట మండల పరిధిలోని చైతన్యపురి కాలనీ, హసన్ పర్తి మండలం జయగిరి గ్రామంలో కొనసాగుతున్న సామాజిక ఆర్థిక విద్యా ఉపాధి రాజకీయ కుల సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే కొనసాగుతున్న విధానాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే గురించిన వివరాలను అధికారులతోపాటు ఎన్యుమరేటర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సర్వే ఏ విధంగా చేపడుతున్నారని అధికారులను ఎన్యు మరేటర్లను అడిగి తెలుసుకున్నారు. సర్వే అనంతరం ఇంటికి అతికిస్తున్న స్టిక్కర్ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రతి ఇంటిని సర్వే చేయాలని అధికారులను ఎన్యుమారేటర్లను ఆదేశించారు. మాస్టర్ మ్యాపు ప్రకారం ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతి ఇంటికి సంబంధించిన అన్ని వివరాలను ఎన్యుమరేటర్లు నమోదు చేయాలన్నారు. ఎన్యుమరేషన్ బ్లాక్ లలో ఎన్నెన్ని ఇండ్లు ఉన్నాయో సరిగా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సర్వేలో అన్ని వివరాలను కూడా జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, తహసీల్దార్ బావ్ సింగ్, హసన్ పర్తి తహసీల్దార్ చల్లా ప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్, ఇతర అధికారులతో పాటు ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై సంపూర్ణ అవగాహన

### మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నవంబరు 6 నుంచి 18 వరకు నిర్వహించనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (సామాజిక, ఆర్థిక, రాజకీయ,కుల సర్వే)పై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు.

శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దారులు, ఎంపీడీవోలకు కలెక్టర్ సామాజిక, ఆర్థిక, సర్వే మార్గదర్శకాలపై మండలాల ప్రత్యేక టెలీ కాన్ఫరెన్స్ ద్వారా తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. ఎన్యుమరేషన్ బ్లాకులు సూపర్వైజర్స్ కరెక్ట్ గా నియమించుకోవాలని, 10% రిజర్వ్ స్టాఫ్ అందుబాటులో ఉంచుకోవాలని ఎన్యూమరేషన్ బ్లాకులో ప్రతి కుటుంబాన్ని క్రమ పద్ధతిలో జాబితా తయారు చేయాల్సి ఉంటుందని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 1.68 లక్షల కుటుంబాలున్నాయని, 1600 మంది ఎన్యూమరేటర్లు తో సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వే ప్రక్రియలో సూపర్వైజర్స్ పది శాతం రాండంగా డేటా ఖచ్చితంగా తనిఖీ చేయాలని తెలిపారు. అనంతరం మండల అభివృద్ధి అధికారులతో టెలికాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రంలోని షెడ్యూల్ కులాలు షెడ్యూల్డ్ తెగలు వెనుకబడిన తరగతులు, ఇతర బలహీన వర్గాల అభివృద్ధి కొరకై వివిధ సామాజిక ఆర్థిక విద్య ఉపాధి మరియు రాజకీయ అవకాశాలను మెరుగుపరచడానికి తగిన ప్రణాళికలు తయారు చేయడం కోసం ఈ సర్వే ప్రభుత్వం చేపడుతున్నట్లు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి ఆదేశించారు.ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదరపు కలెక్టర్ నగేష్ , మెదక్ ఆర్డీవో రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, సంబంధిత తాసిల్దారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

### వికారాబాద్‌లో సంచలనం సృష్టించిన

# మణప్పురం కేసు నిందితుడి అరెస్ట్

### ఎస్పీ కే నారాయణ రెడ్డి



**విశ్వంభర, వికారాబాద్:** ఇటీవల వికారాబాద్ పట్టణంలో మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్‌లో భారీ దొంగతనం జరిగి సంచలనం సృష్టించిన కేసులోని నిందితుడిని కర్ణాటక రాష్ట్రం ఔరద్ తాలూకా లోని నారాయణపూర్ గ్రామంలో అరెస్ట్ చేసినట్టు జిల్లా ఎస్పీ కే నారాయణ రెడ్డి శుక్రవారం వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు వెల్లడించారు. 19న వికారాబాద్ పోలీస్ స్టేషన్ కు మణప్పురం రీజినల్ మేనేజర్ రవీంద్ర కుమార్ సుమారు 2944.226 గ్రాముల బంగారం(సుమారు వాటి విలువ 2,10,80,290 రూపాయలు) చోరీ జరిగినట్లు ఫిర్యాదు చేశారు. వికారాబాద్ బ్రాంచ్ మేనేజర్ విశాల్ తన కంపెనీకి నమ్మకద్రోహం చేసి, మోసపూరితంగా బంగారు నగల దొంగతనం చేశాడని, అతనికి వికారాబాద్ మణప్పురం ఉద్యోగులు జూనియర్ అసిస్టెంట్ లు శివప్రసాద్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఆడిటర్ రాజకుమార్ లు సహకరించారు అని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసులో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వికారాబాద్ డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ బలవంతయ్య ఆధ్వర్యంలలో ప్రత్యేక బృందలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించి నమ్మదగిన సమాచారం మేరకు శుక్రవారం ఉదయం ఏ1 నిందితుడు విశాల్‌ను తన స్వగ్రామం నారాయణపూర్ గ్రామంలో అరెస్టు చేసి వికారాబాద్ డీఎస్పీ ఎదుట హాజరుపరిచారు. నేరస్థునికి సహకరించిన వారిపైన , ఆడిట్ నిర్వహించిన వారిపైన , విజిలెన్స్ టీమ్, క్రికెట్ బెట్టింగ్ నిర్వహకులపైనా దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఎస్పీ తెలిపారు. వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ బలవంతయ్య, వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ భీమ్ కుమార్, ధరూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ రఘురాములు ఇతర అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## వీధి కుక్కల బెడదను పరిష్కరించాలి



**విశ్వంభర, పరిగి:** పరిగి మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డు ఎన్టీఆర్ కాలనీలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది అర్ధరాత్రి సమయాల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ పిల్లలను, కాలనీ వాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు సల్మాన్ విధికుక్కలను నియంత్రించి ఈ సమస్యను పరిష్కరించాలని శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటయ్యకు ఫిర్యాదు చేశారు.

## కందికొండ జాతర ఏర్పాట్లు పూర్తి చేయండి

### అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్



**విశ్వంభర, మహబూబాబాద్:** శుక్రవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో కురవి మండలం, కందికొండ గ్రామంలోని లక్ష్మీ నరసింహ స్వామి, (వెంకటేశ్వర స్వామి) జాతర ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్తీక మాసం సందర్భంగా కురవి మండలం కందికొండ గ్రామంలో జరుగు జాతరను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు సౌకర్యవంతంగా జాతర నిర్వహించేందుకు పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, తదితర అన్ని విభాగాల సిబ్బంది పనిచేయాలని సూచించారు. ఆయన వెంట కురవి తహసీల్దార్ సునీల్ రెడ్డి, అన్ని విభాగాల సిబ్బంది ఉన్నారు. అనంతరం మరిపెడ మున్సిపల్ పరిధిలోని నాలుగు , ఆరవ వార్డులలో జరుగుతున్న హౌస్ వెరిఫికేషన్ సర్వేను మున్సిపల్ కమిషనర్ నరేష్ రెడ్డి, సంబంధిత సిబ్బందితో కలిసి అదనపు కలెక్టర్ పరిశీలించారు.

## అమావాస్య సందర్భంగా అన్నదానం



**విశ్వంభర, జెడిమెట్ల:** అమావాస్య సందర్భంగా జెడిమెట్ల మూడు గుళ్ల దుర్గా మాత దేవాలయం వద్ద శ్రీ వాసవి సేవాదళ్ సుచిత్ర, కొంపల్లి ఆధ్వర్యంలో మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా ఆర్య వైశ్య మహా సభ అధ్యక్షుడు బెలిదే రమేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి బచ్చు నగేష్ గుప్తా, కోశాధికారి పసుపునూరి కేదారేశ్వర్ గుప్తా లు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ అన్నదానం మహాదానం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు చైర్మెన్ అనిల్ కుమార్, సంబిపూర్ కృష్ణా , వాసవి సేవాదళ్ సంఘ సభ్యులు వెంకటేశం, తోట భిక్షపతి, పళ్ళ నాగరాజు, నాగరాజు, శివకుమార్ రమేష్, నరేందర్, కిష్టయ్య, మురళి, శ్రీనివాస్, నాగేశ్వర్ రావు, నాగేందర్, రమేష్, నాగ భూశనము, మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా చెన్నూరి విజయలక్ష్మి



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లాకు చెందిన ప్రజా నేత చెన్నూరి విజయలక్ష్మి ఎన్నో ఏళ్లుగా చేస్తున్న సేవలకు గానూ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా నియమించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చెన్నూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్యవేదికలో తనకు అవకాశం కల్పించి రాష్ట్ర చేనేత మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎన్నిక చేసిన తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జీ. తారకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ తనపై నమ్మకం ఉంచి ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్రానికి, మహబూబాబాద్ జిల్లా పద్మశాలి బిడ్డలకు సహాయ సహకారాలు అందిస్తూ తన వంతు కృషి చేస్తానన్నారు.

## ఘనంగా దీపావళి వేడుకలు



**విశ్వంభర, పెద్ద శంకరంపేట్ :** పెద్ద శంకరంపేటతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గురువారం దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వర్తక వాణిజ్య దుకాణాల లో.. గృహాలలో ధనలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దుకాణాలను అరటి కొమ్మలతో విద్యుత్ దీపాలతో వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. చిన్న పెద్ద బాణాసంచా కాలుస్తూ దీపావళి పండుగను వైభవంగా జరుపుకున్నారు.

## మెస్ చార్జీలు పెంచడంపై గుజ్జ సత్యం హర్షం



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలోని హాస్టళ్ళ, గురుకుల పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలను పెంచినందుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం హర్షం వ్యక్తం చేసారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఈ పెంపుదల గురుకులాలు, హాస్టళ్ళలో చదువుకొనే 8 లక్షల 50వేల మంది విద్యార్థులకు ఈ పెంపుదల ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. కాలేజీ హాస్టళ్ళకు రూ.1500 నుంచి రూ.2100, గురుకుల పోస్టళ్ళలో 3వ తరగతి నుండి 7వ తరగతి వరకు రూ.950 నుండి రూ.1330, 8వ తరగతి నుంచి 10వ తరగతికి రూ.1100 నుంచి రూ.1540 పెంచారు. అదే విధంగా కాస్మోటిక్ చార్జీలు పెంపుదల పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేసారు. మంచి మెనూ తయారు చేసి పౌష్టిక ఆహారం పెట్టాలన్నారు. రాష్ట్రంలో 295 బీసీ కాలేజీ హాస్టళ్లకు, 321 బీసీ గురుకుల పాఠశాలలకు ఒకదానికి కూడా సొంత భవనాలు లేవు అని వెంటనే సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చౌటుపల్లి సురేష్ మురళి కృష్ణ , పందరినాథ్, సూర్యనారాయణ జానయ్య, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.



**కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డిని కామారెడ్డిలోని ఎమ్మెల్యే హెడ్ క్వార్టర్స్ లో మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపిన చేవెళ్ల బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్ రెడ్డి, త్రినేత్ర, ఆనంద్ గౌడ్, జై సింహ రెడ్డి, శ్రీతం రెడ్డి, సందీప్ తదితరులు. – విశ్వంభర, చేవెళ్ల**

## వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ వై వెంకటరమణ



**విశ్వంభర, వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా ఇటీవల బదిలీలలో నియమించబడిన డాక్టర్ వై వెంకట రమణ శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీఎంహెచ్ఓ కార్యాలయ సిబ్బంది, ప్రోగ్రాం అధికారులు నూతనంగా నియమింపబడిన డీఎంహెచ్ఓకి పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ లింగ్యా నాయక్‌ని, అడిషనల్ కలెక్టర్ సుధీర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ జీవరాజ్, డాక్టర్ రవీంద్ర యాదవ్, వీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## డిండిలో ఘనంగా గ్యార్వి ఉత్సవం



**విశ్వంభర, డిండి :-** డిండి మండల కేంద్రంలో శుక్రవారం ముస్లింలు ఘనంగా గ్యార్విని నిర్వహించారు. షాదీఖానా నుంచి మేళ తాళాలతో గంధాన్ని మహబూబ్ సుభాని దర్గా వద్దకు అంగరంగ వైభోవంగా తీసుకువచ్చారు. మధ్యాహ్నం దర్గా వద్ద అన్నదానం నిర్వహించారు. దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రసాదాలు అందించారు. దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ ఉమర్, నాయకులు వద్య రమేష్ నాయక్, దొంతినేని వెంకటేశ్వర్ రావు, గుర్రం రాములు, పున్న దినేష్, ఆమనగంటి రాధిక కృష్ణ, మేకల కాశన్న, బాదమోని శ్రీనివాస్ గౌడ్, గిరమోని శ్రీనివాస్, గుర్రం సురేష్, కలీం, పీర్ మహమ్మద్, ఖయ్యూమ్, రషీద్, అన్వర్, అబ్దుల్లా, అయ్యూబ్, అజ్మల్, ఫిర్దోస్, రహీం, కరీం, సోను, ఇస్మాయిల్, అక్బర్, బాబా, సోహెల్, జహంగీర్, సలీం, జవ్వాద్, నిరంజన్, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డికి ఘనసన్మానం



**విశ్వంభర, కల్వకుర్తి:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా నియమితులైన నాగర్ కర్నూల్ జిల్లా మంగూర్ మండలవాసి తెలంగాణ ఉద్యమనేత కేవీఎన్ రెడ్డిని గెస్టు లెక్చరర్స్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సదానందం గౌడు కొండారెడ్డిపల్లి గ్రామంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఉద్యమ నేత, పాలమూరు జిల్లా జలసాధన సమితి నాయకులు, వ్యవసాయాన్ని ప్రాణప్రదంగా భావించే రైతు బిడ్డ వంగూరు మండల జడ్పిటిసి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులైన కేవీఎన్ రెడ్డిని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా నియమించడం సంతోషదాయకమని సదానంద గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గెస్టు లెక్చరర్స్ సంఘం జిల్లా నాయకులు భీమేశ్వర్, బాల్ రాజ్, శ్రీనివాస్ , లక్ష్మణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దీపావళి వేడుకలు



**విశ్వంభర, కూకట్‌పల్లి :** మాతృదేవోభవ సత్సంగ్ ఆధ్వర్యంలో అబిడ్స్ లోని సూర్య కాంప్లెక్స్ లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ.. సృష్టికి మూలం తల్లి అని, తల్లి ప్రత్యక్ష దైవం అని నేటి యువతను చేసిన పరిచి జాగృతం చేసే మాతృదేవోభవ సంస్థకు చేయూతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయలక్ష్మి, వాణి, రూపా దేవి, చిత్ర, సరిత, శ్రీనివాస్, నవీన్, ప్రభాకర్, నేతాజీ పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో రెండు బర్రెలు మృత్యువాత



**విశ్వంభర, ఘట్కేసర్ :** బీబీనగర్ మండలం మక్తనంతారం చెందిన రైతు బింగి శ్రీశైలం తండ్రి బాలయ్య వయసు 50 సంవత్సరాలు శుక్రవారం తన పశువులు ఎదులాబాద్ రెవెన్యూ సర్వే నెం. 223 భూమి వద్ద గడ్డిమేపు తుండగా రెండు బర్రెలు ట్రాన్స్ఫార్మర్ నుంచి బోర్ వెల్ వరకు ఉన్న వైరు తెగి కింద పడటంతో, ఆ బర్రెలు కరెంటు వైర్లకు తగలడంతో, ఆ రెండు బర్లు అక్కడికక్కడే విద్యుత్ ఘాతంతో మృత్యువాత చెందినట్లు బాలయ్య వాపోయాడు. దీంతో 2 లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని తెలిపాడు. విషయంలో ఆ పశువుల యజమాని పోలీస్ స్టేషన్ లో నిర్లక్ష్యంగా కరెంటు వైర్లని వదిలేసిన విద్యుత్ సిబ్బందిపై ఫిర్యాదు ఇవ్వగా, కేసు నమోదు చేశారు.

## బోడుప్పల్లో 6.68 కోట్ల నిధులతో
# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు



**విశ్వంభర, బోడుప్పల్:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై బోడుప్పల్ కార్పొరేషన్లోని పలు డివిజన్ లలో 6.68 కోట్ల నిధులతో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల అభివృధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. వీరితోపాటు పీర్జాదిగూడ మున్సిపల్ మేయర్ అమర్ సింగ్, బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త శ్రవంతి కిషోర్ గౌడ్,కార్పొరేటర్లు, కోఆప్షన్ మెంబర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం బొల్లిగూడ లో ఏర్పాటు చేసిన వేధిక లో మంత్రి మాట్లాడుతూ.. కుల గణనతో బలహీన వర్గాలకు న్యాయం చేసి అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేసే బాధ్యత తీసుకుంటాం అని తెలిపారు. అదేవిధంగా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో సుమారు పదివేల కుటుంబాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన వక్ఫ్ భూమి సమస్యకు, అదే విధంగా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో దళిత కుటుంబాలకు చెందిన భూములను అభివృద్ధి చేసి న్యాయపరమైన అంశాలపై చర్చించి వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి "జాతీయ ఐక్యత దినోత్సవం"ను పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయం సంగారెడ్డిలో జాతీయ ఏక్తా దివాస్ కార్యక్రమాన్ని గురువారం అడిషనల్ ఎస్పీ ఏ సంజీవ రావ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఫోటోకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సిబ్బందితో ఏక్తా దివాస్ ప్రతిజ్ఞ చేయించిన అనంతరం అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని అక్టోబర్ 31ని రాష్ట్రీయ ఏక్తా దివాస్ గా పిలుస్తాం అన్నారు. వల్లభాయ్ పటేల్‌తో మన తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక అనుబంధం వుందని, 1947 ఆగస్టు 15న మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కానీ తెలంగాణ రాష్ట్రం నిజాం నిరంకుశ పాలనలో ఉండేది. సర్దార్ వల్లభాయ్ పటేల్ పోరాటపటిమతో 1948 సెప్టెంబర్ 17న తెలంగాణ సంస్థానం భారత దేశంలో విలీనం కావడం జరిగిందని తెలిపారు. వందలాది సంస్థానాలను ఒక్కటి చేసిన మహనీయుడికి ఘననివాళులు అర్పించారు. జాతీసమైక్యతకు పునరంకితమై మాతృదేశానికి మన వంతు సేవ చేయడమే స్వాతంత్ర్య సమరయోధులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ(సీఐ)రమేష్, ఆర్.ఐ.లు రాజశేఖర్, డానియోల్, ఎస్.బి. ఎస్ఐ యాదవ రెడ్డి, డీసీఆర్బీ ఎస్ఐ బక్కయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై 5న కలెక్టరేట్ ముట్టడి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లాలో భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 5న సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగే కలెక్టరేట్ ముట్టడికి భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరిగె సోములు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం, రామన్నపేట పట్టణ కమిటీ సమావేశానికి హాజరై, మాట్లాడుతూ.. పెండింగులో ఉన్న క్లైయిములను పూర్తి చేయాలని, నూతనంగా లేబర్ కార్డు తీసుకునే వారికి సాంకేతిక లోపంతో గత రెండు నెలలుగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, నెలలు గడుస్తున్నా.. పెండింగులో ఉన్న క్లైయిములు పూర్తి కావడం లేదని, కార్మిక శాఖ అధికారుల నిర్లక్ష్యంతో అనేక మంది కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కల్లూరి నాగేష్, పట్టణ అధ్యక్షులు రాసాల రమేష్, గొల్లూరి నాగరాజు, గౌరిగే మల్లేష్, తరిగొప్పుల వెంకట్ రెడ్డి, గౌరిగి ఆది మల్లయ్య, నూకల సైదులు, బుద్దా ప్రసాద్, బకీరు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి ఔధార్యం



**విశ్వంభర, నార్కెట్పల్లి :** నార్కెట్ పల్లి పట్టణానికి చెందిన యాస మధుసూదన్ రెడ్డి గత పది సంత్సరాల క్రిందట స్థానిక కంపెనీలో కాంట్రాక్టు లేబర్‌గా పనిచేస్తుంటే ఐరన్ రాడ్ గుండెకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన మధుసూదన్ రెడ్డి కూతురు యాస తితిక్ష గౌతమి చదువులో ఫస్ట్ ర్యాంక్ సాధించి డాక్టర్ కోర్స్ ను పూర్తి చేయించేందుకు, రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్పందించి ఆమె ఖర్చుల నిమిత్తం ఒక లక్ష యాభై వేల రూపాయలు(1,50,000/-) ఆమె కుటుంబానికి అందించారు. ముందు ముందు కూడా వారి కుటుంబానికి అండదండగా ఉంటానని మనోధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గుమ్ముల మోహన్ రెడ్డి, నార్కెట్పల్లి మండల పార్టీ అధ్యక్షులు బత్తుల ఉషయ్య, ఎల్లారెడ్డి గూడెం ఉపసర్పంచ్ వడ్డే భూపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యానాలా రాంరెడ్డి , వేముల నర్సింహా గౌడ్ పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి యాస తితిక్ష గౌతమి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## 2.5లీటర్ల హాషీష్ ఆయిల్ సీజ్



**విశ్వంభర, మేడ్చల్ :** మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం బాలనగర్ డీసీపీ కార్యాలయం పరిధిలో విలేకరుల సమావేశం నిర్వహించారు, బాలానగర్ పరిదిలోని శోభన్ థియేటర్ వద్ద ఎస్ఓటీ, బాలనగర్ పోలీసుల సంయుక్తంగా తనీఖీలు నిర్వహిస్తుండగా ఓ పల్సర్ బైక్ పై తరలిస్తున్న 2.5లీటర్ల హాషీష్ ఆయిల్ పట్టుకున్నారు. వివరాలకు వెళ్తే డీసీపీ సురేష్ కుమార్ మాట్లాడుతూ.. హాషీష్ ఆయిల్ తరలిస్తున్న 3ముగ్గురు వ్యక్తులు విజయ్ కుమార్, సుమన్, కిరణ్ తోపాటు 3మొబైల్స్, 2.59లీటర్ల హాషీష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులందరూ పాత నేరస్తులుగా గుర్తించారు. సీజ్ చేసిన వాటి విలువ 13లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిందితులను రిమాండ్‌కి తరలించారు. తల్లిదండ్రులు తమల పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండి వారిని ఎప్పటికప్పుడు పర్యవ్యక్షించాలన్నారు. చెడు మార్గంలో పోకుండా చూడాల్సిన బాధ్యత తల్లితండ్రులదే అన్నారు. ఈ ఆపరేషన్ లో బాలానగర్, ఎస్ఓటీ, సిబ్బంది, సీఐ నరసింహారాజు, ఎస్ఐ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మనోహరబాద్ మండల కేంద్రంలో మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా మైనంపల్లి రోహిత్ రావును మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెల్పిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ మండలం అధ్యక్షులు మల్లేష్, వెల్దుర్తి మండలం అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, సుధీర్ కుమార్ గౌడ్, యాదగిరి, నాయకులు కార్యకర్తలు తదితరులు.
– విశ్వంభర, మెదక్

## కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభం



**అమరావతి:** ఏపీలో నిలిచిపోయిన కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్టు రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇన్‌ఛార్జి ఛైర్మన్ ఆకే రవికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది డిసెంబరు చివరి వారంలో ఫిజికల్ టెస్ట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి 2022లో నోటిఫికేషన్ జారీ చేసింది. అభ్యర్థులకు గతేడాది జనవరిలో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించారు. 4,59,182 మంది ప్రిమిలినరీ పరీక్షకు హాజరు కాగా ..95,208 మంది అభ్యర్థులు ఈ పరీక్షలో అర్హత సాధించారు. 91,507 మంది అభ్యర్థులు మాత్రమే ఫిజికల్ టెస్ట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఫిజికల్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులకు మరోసారి అవకాశం ఇస్తున్నట్లు పోలీసు రిక్రూట్ మెంట్ బోర్డు ఛైర్మన్ తెలిపారు. ఈనెల 11న సాయంత్రం 3గంటల నుంచి 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు slrb.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు. ప్రిలిమినరీ పరీక్ష అనంతరం కానిస్టేబుల్ భర్తీ ప్రక్రియ పలు కారణాల వల్ల నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం.. నిలిచిన భర్తీ ప్రక్రియను తాజాగా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది.

## కార్తీక మాసం సందర్భంగా నవంబర్ 2 నుండి డిసెంబర్ 1 వరకు వివిధ విశేష కార్యక్రమములు



**విశ్వంభర, భద్రాచలం:** అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమలకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు ఆలయ ఈ ఓ రమాదేవి తెలిపారు. సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1 వరకు వివిధ విశేష కార్యక్రమములు నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రామాలయం ఈ ఓ పేర్కొన్నారు. 400 సంవత్సరాల చరిత్ర కలిగిన శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా అర్చనలు, అభిషేకాలు, దీపంకలరణ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించతలపెట్టిన నేపథ్యంలో మహిళలు అత్యధికంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకోవాలని అలయ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు తానీషా కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం ఈ ఓ రమాదేవి కార్యక్రమ వివరాలు వెల్లడించారు.

## ఘనంగా టీయూటీఎఫ్ మహాసభలు





**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో టీయూటీఎఫ్ (తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) మహాసభలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కడెం సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిశీలకులుగా రాష్ట్ర సహాధ్యక్షుడు లచ్చుమల్ల వెంకన్న వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీయూటీఎఫ్ సంఘ అభివృద్దికి, ఉపాధ్యాయుల శ్రేయస్సుకు మనమందరం నిబద్దులమై పని చేద్దామన్నారు. 317 జీఓ బాధితులకు న్యాయం చేయాలని, గత కాంగ్రెస్ ప్రభుత్వం మాదిరిగా నెలసరి ప్రమోషన్స్ చేపట్టాలని, పెండింగ్ డీఏలు త్వరగా ఇవ్వాలని, పీఆర్సీ ప్రకటించి తక్షణం అమలు చేయాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. టీయూటీఎఫ్ యాదాద్రి జిల్లా కమిటీ సభ్యులు వరుసగా, టీయూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కడెం దాసు, అధ్యక్షుడిగా లచ్చుమల్ల వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా కడెం సోమయ్య, సహాధ్యక్షుడిగా పంతంగి సత్తయ్య, సంయుక్త కార్యదర్శులుగా మేకల సూరిబాబు, వల్లమల్ల భాస్కర్, కోశాధికారిగా పాల్వంచ హరికిషన్, జిల్లా కార్యదర్శులుగా కుంచం నర్సింహులు, సంగెం రవి, మహిళా ఉపాధ్యక్షురాలిగా బొల్లెద్దుల అనురాధలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఆమనగల్లులో అంబరాన్నంటిన దీపావళి వేడుకలు



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమంగల్ మండల కేంద్రంలో దీపావళి వేడుకలు అంబరాన్నంటాయి. ఈ క్రమంలో పట్టణం దీపాల వెలుగులతో నిండిపోయింది. చిన్నారులు, పెద్దలు, బంధువులు అంతా టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. నోములు నోముకొని చల్లగా చూడమంటూ పట్టణంలోని ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండగ సందర్భంగా గ్రామంలోని ప్రముఖ ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. దుకాణాలు, దేవాలయాల్లో మహాలక్ష్మి పూజలు ఘనంగా నిర్వహించారు. పిల్లలు పెద్దలు మహిళలు కొత్త బట్టలతో ఆనందోహల మధ్య పండుగను జరుపుకున్నారు. బాణాసంచా దుకాణాలు కస్టమర్లతో రద్దీగా మారాయి.

## వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డా. బీ సాంబశివరావు



**విశ్వంభర, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ హైదరాబాదు ఆర్డర్స్ ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ బీ సాంబశివరావు 31-10-2024 రోజున బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ కే వెంకటరమణ కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా వెళ్లారు. వరంగల్ జిల్లాలో డిప్యూటీ డీఎంహెచ్ఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న డా. ఎన్ గోపాల్ రావు, ములుగు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా వెళ్లారు. డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ.. జిల్లాను అందరి సమన్వయ సహకారంతో మంచి సేవలు అందించి ముందు వరుసలో ఉంచడానికి ప్రయత్నం చేద్దామని తెలిపారు. బదిలీపై వెళ్తున్న డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ.. అందరి సహకారంతో ఇక్కడ నా టెన్యూర్ను విజయవంతంగా నిర్వహించానని అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కే వెంకటరమణ, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ గోపాలరావు, డాక్టర్ పద్మశ్రీ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవంలో ఎంపీ రఘువీర్ దంపతులు



**విశ్వంభర, మిర్యాలగూడ :** దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలో గల ప్రసిద్ధి చెందిన లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సారథ్యంలో స్వాతి నక్షత్రం సందర్భంగా 726 సంవత్సరముల తర్వాత నిర్వహించిన లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవంలో సతీ సమేతంగా నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి దంపతులు, ఐఏఎస్ శరత్ కుమార్ దంపతులు పాల్గొన్నారు. వేలాది మంది భక్తుల నడుమ అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాయకులు, అశేష జనం, భక్తులు, వేద పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళులు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** మాజీ ప్రధాని, ఉక్కు మహిళ దివంగత ఇందిరాగాంధీ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న ఇందిరాగాంధీ విగ్రహనికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాస లక్ష్మా రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పూల మాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్దులు గౌడ్, ప్రధాన కార్యదర్శి కందడి అనంత రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేశం



ఆత్మకూరు(ఎం) ప్రధాన రహదారిపై ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు

గౌడ్, పిఎసిఎస్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి,కొరటికల్ మాజీ ఎంపిటిసి కట్టేకోల హన్మంతు గౌడ్, నాయకులు ఎద్దు వెంకటేశ్వర్లు, తండ శ్రీశైలం గౌడ్,నాగం లక్ష్మా రెడ్డి, మామిడి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**మోటకొండూర్ మండల కేంద్రంలో..**

ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భన్ని పురస్కరించుకొని గురువారం మోటకొండూర్ మండల కేంద్రంలో గ్రామశాఖ అధ్యక్షులు ఆనంతుల నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోటకొండూరు మండల కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి మహేందర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరబోయిన మల్లేష్ యాదవ్, జిల్లా జాయింట్ సెక్రటరీ భాస్కరుని రఘునాథరాజ్, మాజీ సర్పంచ్ బుగ్గ శ్రీశైలం, ముఖ్య అతిథులుగా హాజరై నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గరీబీ హటావో నినాదాన్నిచ్చి భారతదేశంలో పేదరికన్ని పారద్రోలుతూ 20 సూత్రాలు ప్రవేశపెడుతూ భారత ప్రజలకు గొప్ప సేవలు అందించిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ గౌరవ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, అరేగూడెం గ్రామశాఖ అధ్యక్షుడు కొల్లూరి ఆంజనేయులు, ఉపసర్పంచ్ రేగు శ్రీనివాస్, వార్డు సభ్యులు కంబోజు నాగరాజు, మాజీ గ్రామశాఖ అధ్యక్షులు రేగు చంద్రశేఖర్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

**ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మదార్ గౌడ్ ఆధ్వర్యంలో..**



మోటకొండూరు మండల కేంద్రంలో ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మదార్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం భారతరత్న మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ 40 వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జెడ్పిటిసి గంగాపురం మల్లేష్ , ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తండా పాండురంగం విచ్చేసి ఇందిరా గాంధీకి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు కొల్లూరి యాదగిరి, జిల్లా నాయకుడు భూమండ్ల శ్రీనివాస్, కురుమ సంఘం అధ్యక్షులు బాల్ద సిద్ధులు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుగ్గ కొమురయ్య, మాజీ వార్డు సభ్యులు కాంబోజు నాగరాజు, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగు శేఖర్, మండల ప్రధాన కార్యదర్శి వంగాల మల్లేష్ గౌడ్, ఆలేరు యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బుగ్గ మహేష్, యువజన కాంగ్రెస్ నాయకులు జూకంటి మధు, పంతంగి ఉదయ్, గాజరాజు సురేష్, వట్టిపల్లి మధు, అద్దమడుగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్‌లో రిమోట్ బాంబు పేలి ఏడుగురు మృతి



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లోని బలోచిస్తాన్ ప్రావిన్సులో రిమోట్ కంట్రోల్‌తో బాంబును పేల్చిన ఘటనలో ఏడుగురు మృతి చెందారు. దాంట్లో అయిదుగురు స్కూల్ పిల్లలు, ఓ పోలీసు ఉన్నారు. ఈ ఘటనలో 17 మంది గాయపడ్డారు. పోలీసు వ్యాన్‌ను టార్గెట్ చేస్తూ రిమోట్ కంట్రోల్ బ్లాస్టకు పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం 8.35 నిమిషాలకు ఈ ఘటన జరిగింది. మస్తాంగ్ జిల్లాలోని సివిల్ హాస్పిటల్ చౌక్ వద్ద ఉన్న ఓ గర్ల్స్ హై స్కూల్ సమీపంలో పేలుడు సంభవించింది. పార్కింగ్ చేసి ఉన్న మోటర్‌బైక్‌లో పేలుడు పదార్థాన్ని దాచిపెట్టి.. రిమోట్ కంట్రోల్ ద్వారా ఉగ్రవాదులు ఆ బాంబును పేల్చినట్లు అధికారులు తెలిపారు. పోలీసు మొబైల్ వ్యాన్.. పార్కింగ్ బైక్ వద్దకు రాగానే ఐఈడీని పేల్చారు. ఆ పేలుడులో స్కూల్ వ్యాన్ కూడా చిక్కుకున్నది. శక్తివంతమైన పేలుడు ధాటికి స్కూల్ పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. 8 నుంచి 13 ఏళ్ల మధ్య వయసున్న విద్యార్థినులు గాయపడ్డారు. వారిని సమీప ఆస్పత్రికి తీసుకెళ్లారు. తీవ్రంగా గాయపడ్డవారిని క్వెట్టా హాస్పిటల్‌కు తీసుకెళ్లారు.

# బడ్జెట్ ఆధారంగానే హామీలివ్వాలి

- మహారాష్ట్ర ఎన్నికలలో ఎలాంటి గ్యారంటీలు ప్రకటించడం లేదు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక ప్రకటన చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు, ఏడు అంటూ ఎలాంటి గ్యారంటీలూ ప్రకటించడం లేదని స్పష్టం చేశారు. బడ్జెట్ ఆధారంగా హామీలు ప్రకటించాలని.. లేదంటే రాష్ట్రం దివాలా పరిస్థితికి చేరుతుందని వ్యాఖ్యానించారు.

**విలేకరులతో ఖర్గే మాట్లాడుతూ..** 'త్వరలో జరగబోయే మహారాష్ట్ర ఎన్నికల్లో 5, 6, 10, 20 ఇలా ఏ ఒక్క హామీలను ప్రకటించడం లేదు. బడ్జెట్ ఆధారంగా హామీలు ప్రకటించాలి. లేదంటే రాష్ట్రం దివాలా పరిస్థితికి చేరుతుంది. ప్రణాళికా రహిత విధానం ఆర్థిక ఇబ్బందులకు దారి తీస్తుంది. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే.. భవిష్యత్తు తరాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. రోడ్లు వేసేందుకు కూడా డబ్బు లేకపోతే.. ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారు. ప్రభుత్వం విఫలమైతే భవిష్యత్తు తరానికి చెడ్డపేరు తప్ప మరొకటి మిగలదు' అంటూ ఎన్నికల హామీలపై ఖర్గే వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు పలు హామీలను ఇస్తున్న విషయం తెలిసిందే. కర్ణాటకలో ఐదు గ్యారంటీలతో, తెలంగాణలో ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చింది. అయితే, గ్యారెంటీల పేరుతో ఆకర్షించి ఓట్లు వేయించుకున్న ఆ పార్టీ ఇప్పుడు ఉచిత పథకాలను అమలు చేయలేక చేతులెత్తేస్తున్నది. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన నెల రోజులకే ఆడంబరంగా ప్రారంభించిన ఉచిత బస్సు పథకానికి ఏడాదిన్నరకే మంగళం పాడేందుకు సిద్ధమైంది. ఈ పథకాన్ని నిలిపేసేందుకు ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టినట్లు సమాచారం. తెలంగాణలో సైతం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో హస్తం పార్టీ విఫలమవుతోందని విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ పరిణామాల దృష్ట్యా రాబోయే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈ హామీలపై కాంగ్రెస్ పార్టీ వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

# నాగార్జునసాగర్‌లో స్టార్ హొటల్ నిర్మిస్తాం : మంత్రి జూపల్లి



**విశ్వంభర, హైదరాబాద్:** నాగార్జునసాగర్ బుద్ధవనం పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో స్టార్ హొటల్ నిర్మాణంతో పాటు, వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం అయన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ వద్ద ఉన్న బుద్ధవనం పరిసర ప్రాంతాలను శ్రీ రామచంద్ర మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కమలేష్ డి.పాటిల్ (దాజి)తో కలిసి పరిశీలించారు. ముందుగా విజయ విహార్‌లో బుద్ధవనం లే-అవుట్, విజయ విహార్ లేఔట్లను పరిశీలించారు.మొత్తం 270 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న బుద్ధవనంలో ఉన్న విశేషాలను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, బుద్ధవనం కన్సల్టెంట్ శివనాగిరెడ్డి మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నాగార్జునసాగర్, బుద్ధవనానికి ఆసియా ఖండంలోని పలు దేశాల నుంచి బౌద్ధులు వస్తారన్నారు. ప్రత్యేకించి శ్రీలంక, ఇతర ఆసియా ఖండాల నుంచి ఎక్కువ మంది వస్తారని, వారికి అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించాల్సి ఉందని తెలిపారు. ఇందుకోసం నిర్మాణాలు చేపడుతామన్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములపై సర్వే నిర్వహించి వివరాలు సమర్పించాలని ఈ సందర్భంగా మంత్రి మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌ను ఆదేశించారు.

# మూసీ బాధితుల సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలి

## అధికార, ప్రతిపక్ష నేతలకు ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డా. సుధాకర్ పిలుపు

**విశ్వంభర, బషీర్‌బాగ్ :** తీవ్ర భయాందోళనలో ఉన్న మూసీ బాధితుల సమస్యల పరిష్కరంలో భాగస్వాములు కావాలని అధికార, ప్రతిపక్ష నేతలకు ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ (టిజెఎస్) ఏం కోదండరాం, బీ వినోద్ కుమార్ (బీఆర్ఎస్), రావుల చంద్రశేఖర్ రెడ్డి (టీడీపీ) కాంగ్రెస్ తోపాటు సీపీఐ, సీపీఎం, బీజేపీ, ఎంఐఎం నేతలను కలసి మూసి బాధితుల సమస్యల శాశ్వత పరిష్కరానికి నవంబర్ 4న ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమాజిగూడ, ప్రెస్ క్లబ్ లో జరిగే అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం పాల్గొని తమ సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు.

# మాది మంచి ప్రభుత్వమే.. కానీ మెతక ప్రభుత్వం కాదు

## ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**విశ్వంభర, ఏలూరు:** 'దీపం 2.0' కేవలం వంటింట్లో వెలుగు కోసం మాత్రమే కాదు.. ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగు తీసుకురావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఏలూరు జిల్లా జగన్నాథపురంలో ఏర్పాటు చేసిన సభలో పవన్ మాట్లాడారు. "ప్రజలు మాపై భరోసాతో ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా చేసి మాపై ఎంతో బాధ్యత పెట్టారు. వైకాపా చేసిన దోపిడీ కారణంగా అనేక ఇబ్బందులు తలెత్తాయి. వైసీపీని ప్రజలు తరిమికొట్టినా, కేవలం 11 సీట్లకే పరిమితమైనా వారి నోళ్లు ఆగడం లేదు. కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. సామాజిక మాధ్యమాల ద్వారా ఏది పడితే అది మాట్లాడుతాం అంటే మాత్రం చూస్తూ ఊరుకోం. మాది మంచి ప్రభుత్వమే కానీ మెతక ప్రభుత్వం కాదని వైసీపీ నేతలు గుర్తు పెట్టుకోవాలి. సోషల్ మీడియాలో ఆడబిడ్డలను ఇబ్బంది పెట్టే విధంగా పోస్టులు పెడుతున్నారు. ప్రభుత్వం ప్రతి విషయాన్ని గమనిస్తోంది. ఆడబిడ్డల భద్రత విషయంలో ఏమాత్రం తేడా వచ్చినా తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటాం.

**షర్మిలకు రక్షణ కల్పిస్తాం..**

జగన్ సోదరి షర్మిల.. 'నా ప్రాణాలకు రక్షణ కావాలి. అదనంగా సెక్యూరిటీ కల్పించాలి అని అడిగారు. అమ్మా.. మీ అన్న కల్పించలేకపోయాడేమో కానీ.. మీ ప్రాణాలకు కూటమి ప్రభుత్వం రక్షణగా ఉంటుంది. ఒక బాధ్యతగల నాయకురాలిగా మీరు ఎన్ని విమర్శలైనా చేయొచ్చు. మీరు అప్పీల్ చేసుకోండి.. సీఎం దృష్టికి తీసుకెళ్లి మీకు రక్షణ కల్పించే బాధ్యత మేం తీసుకుంటాం అన్నారు పవన్ కళ్యాణ్.

# అడుగడుగునా ఆహార కల్తీ.. అపరిశుభ్రతతో అనారోగ్య వ్యాప్తి

- వీధి బండ్ల నుంచి హొటళ్ల దాకా ఇదే పరిస్థితి
- కల్తీ మోమోస్ తయారు చేసిన.. బిహార్ ముఠా అరెస్ట్..!

**విశ్వంభర , తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్ లో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎన్ని తనిఖీలు చేసినా.. జనాల్ని ఎంత చైతన్యపరిచినా.. అదే తీరు. ఫైస్టార్ హొటల్స్ నుంచి బస్తీల్లో ఫుడ్ స్టాల్స్ వరకు అదే నిర్లక్ష్యం. కల్తీ ఫుడ్ తో జనం ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. తాజాగా హైదరాబాద్ లో ఓ ఘటన చోటు చేసుకుంది. వారం వారం జరిగే మార్కెట్ లో ఓ మోమోస్ కౌంటర్ ఏర్పాటు చేశారు. దీంతో కొందరు.. సరదాగా మోమోస్ తిన్నారు. ఇంకేముంది మోమోస్ తిన్న పాపానికి ఆస్పత్రి పాలయ్యారు. హైదరాబాద్ బంజారాహిల్స్ నంది నగర్‌లో చోటు చేసుకుంది ఈ ఘటన. స్ట్రీట్ ఫుడ్ తిని పలువురు అస్వస్థతకు గురయ్యారు. మోమోస్ తిని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. ఇక అదే స్టాల్ లో మోమోస్ తిన్న మరికొందరు అస్వస్థతతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వెంటనే అప్రమత్తమైన బాధితులు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మోమోస్ వివాదంలో బంజారాహిల్స్ పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు. మోమోస్ తిని ఇటీవల మహిళ మృతి చెందింది. కల్తీ మోమోస్ తినడం వలనే చనిపోయిందని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. చింతల్ బస్తీలో మోమోస్ తయారు చేసి బిహార్‌కు చెందిన ఆరుగురు యువకులు సిటీలోని వీక్లీ మార్కెట్స్‌కి సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. ఆ ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మోమోస్ తిని ఓ మహిళన చనిపోగా.. 50 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు అలర్ట్ అయ్యారు. ఈఘటనతో ప్రభుత్వం మోమోస్ అమ్మకాలను నిషేధించింది.

ఇప్పటికే కల్తీ ఆహార పదార్థాలు, పానీయాల దందాను అరికట్టడానికి ఫుడ్ సేఫ్టీ అధికారులు నడుం బిగించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోని హొటళ్లు, రెస్టారెంట్లు, ఆహార పదార్థాల తయారీ సంస్థలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు వరుస దాడులు జరుపుతున్నారు. ఈ దాడుల్లో అధికారులు అవాక్కయ్యే ఘటనలు వెలుగు చూస్తున్నాయి. కుళ్లిపోయిన నిలువ ఉంచిన మాంసం, కాలం చెల్లిన పాలు, పెరుగు, ఐస్ క్రీం ఒక్కటేమిటి.. అసలు ప్రజారోగ్యం గురించి పట్టింపే లేని హొటల్ యాజమాన్యాల నిజ స్వరూపం బయట పడుతోంది. అయితే హొటళ్ల నిజస్వరూపం చూసి జనం ఇప్పటికే వణుకుతున్నారు. దీంతో వీధి బండ్లపైనా కూడా ఇదే తరహా ఘటనలు జరుగుతుండటం జనాల్లో వణుకుపుట్టిస్తోంది. పెద్ద పెద్ద హొటల్స్, రెస్టారెంట్స్ మొదలు స్ట్రీట్ ఫుడ్ వరకు అన్నీకల్తీమయమే. బయటికి అందంగా ..శుభ్రంగా ఉండే హొటల్లో.. కిచెన్ పరిసరాలు మాత్రం అపరిశుభ్రంగా ఉంటున్నాయని కస్టమర్లు చెబుతున్నారు. ఇదేదో ఆరోపణలు కాదు.. స్వయంగా అధికారులు ఇస్తున్న నోటీసులే దీనికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి. ఇక వీధిలో నడిపే కొన్ని ఫుడ్ స్టాల్స్ అపరిశుభ్రత గురించి అయితే మాట్లాడుకోవాల్సిన అవసరం లేదు. కాబట్టి హ్యాపీగా ఏ వీకెండ్‌లోనో.. ఫ్యామిలీతో రెస్టారెంట్స్‌కి వెళ్లి ఎంజాయ్ చేద్దాం.. అనుకునే వారు కాస్త చూసుకుని తినాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# స్పెయిన్‌లో భారీ వరదలు

## నదులను తలపిస్తున్న ప్రధాన నగరాలు

## 158కి పెరిగిన మృతుల సంఖ్య



**మాడ్రిడ్:** యూరప్ దేశం స్పెయిన్ ప్రకృతి ప్రకోపానికి గురైంది. ఇంతకుముందెన్నడూ లేనంత స్థాయిలో భారీ వర్షాలు, వరదలు ఆ దేశ తూర్పు, దక్షిణ ప్రాంతాన్ని ముంచెత్తాయి. గ్రామాలు, పట్టణాలు మొత్తం నీట మునిగాయి. ప్రధాన నగరాలు సైతం నదులను తలపిస్తున్నాయి. కార్లు, పెద్ద పెద్ద కంటైనర్లు వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. ఈ వరదల కారణంగా గురువారం వరకూ మరణించిన వారి సంఖ్య 158కి పెరిగింది. కేవలం వాలెన్సియాలోనే 155 మంది మరణించినట్లు గుర్తించారు. వరదల్లో డజన్ల కొద్దీ గల్లంతయ్యారు. ముఖ్యంగా వాలెన్సియా ప్రాంతం ఈ వరదలకు తీవ్ర ప్రభావితమైంది. ఇక్కడ అంచనాలకు మించి వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ కొన్ని ప్రాంతాల్లో ఏడాదికి కురవాల్సిన వర్షం ఎనిమిది గంటల్లో కురిసినట్లు పేర్కొన్నారు. భారీ వృక్షాలు, విద్యుత్ లైన్లు, ఇళ్లలోని సామగ్రి కొట్టుకుపోగా.. దుకాణాలు కూడా బురదలో కూరుకుపోయాయి. రహదారులు సైతం గుర్తుపట్టకుండా మారిపోయాయి. ప్రస్తుతం వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# ఉక్రెయిన్ సరిహద్దుల్లో కిమ్ సైన్యం

- బోర్డర్ లో 8 వేల మంది సైనికులు
- రష్యాకు మద్దతుగానే వచ్చారని అమెరికా అంచనా
- ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని హెచ్చరిక



**వాషింగ్టన్:** ఉక్రెయిన్ సరిహద్దు ప్రాంతాల్లో దాదాపు 8 వేల మంది ఉత్తర కొరియా సైనికులు ఉన్నట్లు అమెరికా తెలిపింది. వారంతా రానున్న రోజుల్లో రష్యాకు మద్దతుగా యుద్ధంలో పాల్గొంటారని ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఉత్తర కొరియా బలగాలు ఒకటి, రెండుసార్లు ఆలోచించి బరిలోకి దిగాలంటూ అమెరికా సూచించింది. రష్యాలో దాదాపు 10 వేల మంది ఉత్తర కొరియా సైనికులు ఉన్నట్లు తాము అంచనా వేస్తున్నట్లు అమెరికా డిఫెన్స్ సెక్రటరీ లాయిడ్ ఆస్టిన్ తెలిపారు. 'వారిలో 8వేల మంది సైనికులను ఉక్రెయిన్ సరిహద్దుల్లోని కుర్స్క్? సరిహద్దుల్లో మోహరించారు. అయితే వాళ్లకు ఉక్రెయిన్?పై యుద్ధం కోసమేనా లేదా అనేది మేము చూడలేదు. కానీ రానున్న రోజుల్లో రష్యాకు మద్దతుగా యుద్ధంలో పాల్గొంటానికే అని మేం భావిస్తున్నాం' అని పేర్కొన్నారు.

**ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాలి**

మరోవైపు ఉత్తర కొరియా బలగాలకు అమెరికా తీవ్ర హెచ్చరికలు చేసింది. రష్యాకు మద్దతుగా ఉత్తర కొరియా దళాలు ఉక్రెయిన్‌లోకి ప్రవేశించినట్లయితే వారి బాడీలు బ్యాగ్‌లలో తిరిగివెళ్తాయని తీవ్రంగా హెచ్చరించింది.అందుకే బరిలోకి దిగే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని తెలిపింది. అటు మాస్కోకు ఉత్తర కొరియా బలగాలు పంపడంపై ఐరాసలో మాటల యుద్ధం నడిచింది. పాశ్చాత్య దేశాలు కీవ్‌కు సాయం అందిస్తున్నప్పుడు మాస్కోకు ఉత్తర కొరియా వంటి మిత్రదేశాలు సహాయం అందించకూడదా అని ఐక్యరాజ్యసమితిలో రష్యా రాయబారి వాసిలీ నెబెంజియా ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన కీవ్ ఐరాస రాయబారి సెర్గీ కిస్లిట్యా ఉక్రెయిన్‌కు సహాయం అందించే దేశాలు భద్రతామండలి ఆంక్షలను ఉల్లంఘించలేదన్నారు.

**బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించిన ఉత్తర కొరియా!**

ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించినట్లు ఉత్తర కొరియా ధ్రువీకరించింది. ఈమేరకు ఆ దేశ అధికారిక మీడియా సంస్థ వెల్లడించింది. ఈ పరీక్షలు ఉత్తర కొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్ ఆదేశాల మేరకే జరిగినట్లు తెలిపింది. మునపటి ప్రయోగాల రికార్డును ఈ క్షిపణులు బద్దలు కొట్టాయి. క్షిపణుల ప్రయోగాన్ని కిమ్ స్వయంగా వీక్షించారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే శత్రువుల ఎత్తుగడలకు ప్రతిస్పందించడానికి ఈ ప్రయోగం సరైన సైనిక చర్యగా కిమ్ పేర్కొన్నారు. ఉత్తర కొరియా తూర్పు తీరం సముద్రంలోకి ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించినట్లు అమెరికా, జపాన్, దక్షిణ కొరియా ధ్రువీకరించాయి. ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులకు కారణమైన ఉత్తరకొరియా చర్యను తీవ్రంగా ఖండించాయి.

# ఢిల్లీలో దారుణంగా మారిన గాలి

- దీపావళి తర్వాత మారిన వాతావరణం
- 700 దాటిన ఏక్యూఐ

**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో గత కొన్ని రోజులుగా పొగ మేఘాలు కమ్ముకోవడంతో ప్రజలు విషపూరితమైన గాలి పీల్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అదే సమయంలో ఇప్పుడు దీపావళి తర్వాత పరిస్థితి మరింత దిగజారింది. దీపావళి సందర్భంగా పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చడం వల్ల నగరంలో ఎక్కడ చూసినా పొగలు కమ్ముకుంటున్నాయని, ఢిల్లీ గ్యాస్ ఛాంబర్‌గా మారిందని చెప్పక తప్పదు. బాణసంచా కారణంగా ఢిల్లీ గాలి నాణ్యత చాలా పేలవమైన స్థితికి చేరుకుంది. ఉదయం 5:30 గంటలకు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 700 కంటే ఎక్కువ నమోదైంది. దీపావళి తర్వాత ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో పొగమంచు కమ్ముకుంది. అంతేకాకుండా రోడ్లపై పలు చోట్ల పటాకుల అవశేషాలు కూడా దర్శనమిస్తున్నాయి.

**ఎక్కడ ఏక్యూఐ ఎంత ఉంది?**

**ఆనంద్ విహార్ - 714**
**సిరిఫోర్ట్ - 480**
**గురుగ్రామ్ - 185**
**డిఫెన్స్ కాలనీ - 631**
**నోయిడా - 332**
**షహదర - 183**
**నజాఫ్‌ఘర్ - 282**
**పట్పర్ గంజ్ - 513**

ఆనంద్ విహార్‌తో సహా ఢిల్లీలోని ప్రధాన ప్రాంతాలలో ఏక్యూఐ తీవ్ర స్థాయికి చేరుకుంది. ఢిల్లీ ప్రజలకు విషపూరితమైన గాలిని పీల్చుకోవడం తప్ప మరో మార్గం లేదు. గతేడాది దీపావళి రోజున ఆకాశం నిర్మలంగా ఉంది. ఏక్యూఐ 218గా నమోదైంది. అందుకు భిన్నంగా ఈ ఏడాది దీపావళి రోజున నగరంలో కాలుష్యం మళ్లీ తారాస్థాయికి చేరుకుంది. దీపావళికి ముందు కూడా ఢిల్లీలో ఏక్యూఐ 400 కంటే ఎక్కువగా ఉంది, కానీ దీపావళి తర్వాత పరిస్థితి మరింత తీవ్రంగా మారింది.

అంతేకాకుండా రాజధానిలో మొట్టలు దగ్ధం కావడం, వాహనాల నుంచి పొగలు రావడంతో పరిస్థితి దారుణంగా మారింది. ఈ పరిస్థితులను నివారించడానికి, ఢిల్లీ ప్రభుత్వం ఇప్పటికే పటాకులను నిషేధించింది. దానిని అమలు చేయడానికి 377 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేసింది. అవగాహన కల్పించే పని కూడా చేసింది. ఆ తర్వాత కూడా ఢిల్లీ గాలిలో ఎలాంటి ప్రభావం కనిపించలేదు. తూర్పు, పశ్చిమ ఢిల్లీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆంక్షలు ఉల్లంఘించినట్లు వార్తలు వచ్చాయి. ఈ విషపూరితమైన గాలిని పీల్చడం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు మరియు ఇప్పటికే శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులు ఎక్కువ సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఢిల్లీలో దీపావళి సందర్భంగా 2022లో 312, 2021లో 382, ??2020లో 414, 2019లో 337, 2018లో 281, 2017లో 319, 2016లో 431 ఏక్యూఐలు నమోదయ్యాయి.



# సచివాలయ బందోబస్తు బాధ్యతలు చేపట్టిన ఎస్పీఎఫ్

**విశ్వంభర, హైదరాబాద్:** సచివాలయం బందోబస్తు బాధ్యతలను తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) శుక్రవారం స్వీకరించింది. మొత్తం 214 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది రక్షణ బాధ్యతలను చేపట్టారు. సచివాలయ భద్రత పర్యవేక్షణ అధికారిగా దేవిదాస్ నియమితులయ్యారు. ఆయన ఆధ్వర్యంలో ఇవాళ సచివాలయ ఆవరణలో పూజలు నిర్వహించి బందోబస్తు బాధ్యతలను చేపట్టారు. గతంలో సచివాలయానికి ఎస్పీఎఫ్ బలగాలే బందోబస్తు నిర్వహించేవి. కొత్త సచివాలయం నిర్మించిన తర్వాత ఆ బాధ్యతను స్పెషల్ పోలీసులకు (టీజీఎస్పీ) అప్పగించారు. అయితే ఇటీవల ఏక్ పోలీస్ విధానం అమలు కోసం టీజీఎస్పీ కానిస్టేబుళ్లు, వారి కుటుంబాలు ధర్నాలు చేస్తుండటంతో ప్రభుత్వం ఉలిక్కిపడింది. ముఖ్యమంత్రి నివాసం, కార్యాలయం, సచివాలయం వద్ద విధుల్లో ఉన్న టీజీఎస్పీ కానిస్టేబుళ్లు ధర్నా చేస్తే అటు పరువు పోవడంతోపాటు ఇటు భద్రతకు ముప్పు కలుగుతుందని ప్రభుత్వం భావించింది. వెంటనే టీజీఎస్పీని పక్కకు తప్పించింది. మొదట సీఎం నివాసం, ఇంటివద్ద రక్షణను ఎస్పీఎఫ్‌కు అప్పగించింది. తాజాగా సచివాలయాన్ని సైతం ఎస్పీఎఫ్ పరిధిలోకి తీసుకెళ్లింది.

### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో

# రూ.7 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

**విశ్వంభర, హైదరాబాద్:** శంషాబాద్ విమానాశ్రయంలో రూ.7 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. 7.096 కిలోల హైడ్రోఫోలిక్ వీడ్‌ను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి బ్యాంకాక్ నుంచి హైదరాబాద్ వచ్చిన ఇద్దరిని అరెస్టు చేశారు. వారిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

### రహదారులపై వరదతో ట్రాఫిక్ తిప్పలు

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొండాపూర్, మియాపూర్, లింగంపల్లి, కేపీహెచ్‌బీ, మూసాపేట, నిజాంపేట, మాదాపూర్, మేడ్చల్, కండ్లకోయ, కృష్ణాపూర్, దుండిగల్, గండి మైసమ్మ, మల్లంపేట్ తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. లింగంపల్లి రైల్వే అండర్‌పాస్ కింద వరదనీరు భారీగా చేరడంతో ట్రాఫిక్ పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వైపు వస్తున్న వాహనాలను నల్లగండ్ల ఫ్లైఓవర్ వైపు మళ్లించారు. రహదారులపై వర్షపునీరు ప్రవహించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

# ఇద్దరు ఎస్సైలు, ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

### గంజాయి స్మగ్లర్లతో సంబంధాలే కారణం

**విశ్వంభర, హైదరాబాద్:** గంజాయి స్మగ్లర్లతో సంబంధాలు ఉన్న పోలీసులపై వేటు పడింది. ఇద్దరు ఎస్సైలు, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. ఎస్సైలు అంబారియా, మారుతి నాయక్, కానిస్టేబుళ్లు మధు, వినయ్‌ను సస్పెండ్ చేస్తూ ఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది మే 31వ తేదీన సంగారెడ్డి మనూర్ పీఎస్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఈ నలుగురు గంజాయి స్మగ్లర్లకు సహకరించారని విచారణలో తేలింది. గంజాయి అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో సనత్పూర్‌లో ఓ వాహనాన్ని అడ్డుకున్నారు. అందులోని 120 కిలోల గంజాయిని తమ వాహనంలోకి ఎక్కించి, నేరస్తుడిని వదిలేశారని తెలిసింది. అలాగే ఇదే సిబ్బంది ఏడు నెలల క్రితం గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాను నిజామాబాద్‌లోని వర్ని దగ్గర అడ్డుకుని అక్కడి నుంచి వారిని నారాయణఖేడ్ తీసుకెళ్లారు. 400 ప్యాకెట్ల గంజాయిని తీసుకుని నేరస్తుడిని వదిలేశారని విచారణలో తెలిసింది. ఈ క్రమంలోనే ఆ నలుగుర్ని ఐజీ సస్పెండ్ చేశారు.

అక్రమాలకు పాల్పడిన పోలీసులపై ఎన్డీపీఎస్ కేసు నమోదుకు న్యాయసలహా తీసుకుంటున్నామని ఈ సందర్భంగా ఐజీ తెలిపారు. మత్తు పదార్థల కట్టడిలో అంకిత భావంతో పనిచేయాలని 9 జిల్లాల ఎస్పీలకు ఐజీ సత్యనారాయణ ఆదేశాలు ఇచ్చారు. గ్యాంబ్లింగ్, రేషన్ బియ్యం, ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు దృష్టి సారించాలని సూచించారు.

### కేటీఆర్ పాదయాత్ర చేస్తానంటే

# బండికి ఉలికిపాటు ఎందుకు?

### బీఆర్ఎస్ సోషల్‌మీడియా కన్వీనర్ వై.సతీశ్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో ఆర్ఎస్ బ్రదర్స్ (రేవంత్‌రెడ్డి బండి సంజయ్) గుట్టు మరోసారి బయటపడిందని బీఆర్ఎస్ సోషల్‌మీడియా కన్వీనర్ వై.సతీశ్‌రెడ్డి అన్నారు. దిల్లీలో మోడీతో కాంగ్రెస్ పార్టీ యుద్ధం చేస్తోంటే.. తెలంగాణలో మాత్రం ఆ రెండు పార్టీలు చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నాయని విమర్శించారు. ఒకరికి ఒకరు తోడూ నీడగా, ఒకరిపై ఈగ వాలకుండా మరొకరు జాగ్రత్తలు తీసుకుంటున్నారని అన్నారు.

రాష్ట్రంలో ప్రజాసమస్యలపై కేటీఆర్ పాదయాత్ర చేస్తానంటే.. ఇక్కడ అధికారంలో ఉన్న కాంగ్రెస్ కంటే ముందే బండి సంజయ్ ఎందుకు ఉలిక్కిపడుతున్నారని వై.సతీశ్‌రెడ్డి ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వ నిర్వాకం బయటపడి, ఆయనకు ఇబ్బంది వస్తుందని సంజయ్ బాధపడుతున్నట్లే కనిపిస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి.. కేటీఆర్ పాదయాత్రపై వాళ్లు మొదట స్పందించాలి. కానీ అందరికంటే ముందే బండి సంజయ్ ఎందుకు స్పందిస్తున్నారని నిలదీశారు. రేవంత్ సర్కారుకు చిన్న ఇబ్బంది వచ్చినా.. బండి సంజయ్ ఓర్చుకోవడం లేదన్నారు. అంటే ఇది ఆర్ఎస్ బ్రదర్స్ మధ్య ఉన్న అవినాభావ సంబంధమని ఎద్దేవా చేశారు

కేటీఆర్‌తో పాటు రేవంత్ రెడ్డి, బండి సంజయ్ ఇద్దరూ రాష్ట్రమంతటా పాదయాత్ర చేయాలని వై.సతీశ్‌రెడ్డి సూచించారు. అప్పుడే ప్రజల స్పందన ఏంటో మీకు తెలుస్తుందని అన్నారు. 420 హామీలిచ్చిన కాంగ్రెస్ పై, వాటి గురించి, ప్రజల సమస్యల గురించి కనీసం మాట్లాడని బీజేపీ గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుస్తుందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఆర్ ఎస్ బ్రదర్స్ ఇద్దరూ కలిసి మోకాళ్ల యాత్ర చేసినా ఇప్పుడు ఇద్దరికి డిపాజిట్లు కూడా రావని విమర్శించారు. ఆర్ఎస్ బ్రదర్స్ గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో కూడా తెలుస్తుందని అన్నారు. అంతేగానీ.. ఇలా రేవంత్, సంజయ్ చెట్టాపట్టాలేసుకుని దాగుడుమూతలు ఆడుతూ, ప్రజల కళ్లకు గంతలు కడదామని చూస్తే.. నమ్మడానికి ప్రజలు ఏం అమాయకులు కాదని అన్నారు.

## కారులో మంటలు.. ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు

**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలోని చర్లపల్లి వెంకట్ రెడ్డి నగర్‌లో కారులో మంటలు చెలరేగి ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వారిని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు. దీపావళి టపాసులు పేలుస్తుండగా ప్రమాదవశాత్తూ కారుకు నిప్పంటుకుని ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ప్రమాద ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

# ఆ విషయం ఇప్పుడే అర్థమైందా?

### గ్యారంటీల విషయంలో ఖర్గేపై మండిపడ్డ కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:** బడ్జెట్ చూసుకుని గ్యారెంటీలు ప్రకటించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్లు వేశారు. గాలిమాటల గ్యారెంటీలిస్తే.. మొదటికే మోసం వస్తుందని ఇప్పుడు అర్థమైందా అని విమర్శించారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలు ప్రకటించినప్పుడు ఆ రాష్ట్ర బడ్జెట్ గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. బడ్జెట్ చూసుకోకుండా హామీలిస్తే.. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం తప్పదని ఇప్పుడు బోధపడిందా అని ఖర్గేను ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలతో వల వేసినప్పుడు తెలంగాణ బడ్జెట్ గురించి తెలియదా అని నిలదీశారు. తెలంగాణలో కాంగ్రెస్ ఈ తప్పు చేస్తున్నప్పుడు.. ఈ విషయాలు ఎందుకు గుర్తుకురాలేదని ప్రశ్నించారు. ఏవీ చూసుకోకుండా.. కేవలం అధికారమే లక్ష్యంగా.. కాంగ్రెస్ ఆడిన గ్యారెంటీల గారడీతో.. తెలంగాణ రాష్ట్రం.. ఏడాదిలోనే ఆగమైందని విమర్శించారు.

తెలంగాణ ప్రజలను నమ్మించి.. నయవంచన చేసినందుకు కాంగ్రెస్ పార్టీ నాలుగు కోట్ల ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పదేళ్లపాటు ప్రగతిపథంలో పరుగులు పెడుతున్న తెలంగాణను అడ్డగోలు హామీలతో మభ్యపెట్టినందుకు తప్పు ఒప్పుకోవాలన్నారు. అనాలోచితంగా ఇచ్చే కాంగ్రెస్ గ్యారెంటీలతో.. భవిష్యత్ తరాలకు కూడా నష్టం జరుగుతుందని ఇప్పటికైనా గుర్తించినందుకు సంతోషమని అన్నారు. కానీ.. కాంగ్రెస్ గ్యారెంటీలను నమ్మిన పాపానికి.. ఏడాదికాలంగా తెలంగాణకు జరిగిన నష్టం పూడ్చలేనిదని వ్యాఖ్యానించారు. గ్యారెంటీల మాటున కాంగ్రెస్ చేసిన మోసం క్షమించలేనిదని స్పష్టం చేశారు.

# భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేస్తా

(మొదటి పేజీ తరువాయి)

ఈ అంశంలో కేటీఆర్ అభిప్రాయాన్ని కోరారు. దేశంలోని అనేక పార్టీల నేతలు, ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడంతోపాటు, పార్టీలను బలోపేతం చేసేందుకు పార్టీ అధ్యక్షులు పాదయాత్రలు చేస్తున్నారు, మీరెప్పుడు చేస్తారని అడిగారు. దీనికి స్పందించిన కేటీఆర్ ఖచ్చితంగా తన పాదయాత్ర ఉంటుందని వెల్లడించారు. దాదాపు గంటన్నపాటు సాగిన ఈ సంభాషణలో కేటీఆర్ అనేక అంశాలపై తన అభిప్రాయాలను ప్రజలతో పంచుకున్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు శాపం**

తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన ఒక శాపంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే ఉద్దేశాలు ఏమాత్రం లేవు... అందుకే అబద్ధాల మీద, అసత్యాల మీద సమయం గడుపుతూ ప్రజలను మోసం చేస్తున్నారు. గత పది నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ చేసిన ఒక్క మంచి కూడా గుర్తుకు రావడం లేదన్నారు. అబద్ధపు హామీల మీద ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ నుంచి ఇంతకంటే గొప్ప పరిపాలన ఆశించలేమన్నారు, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రాజకీయ వేధింపులను ప్రారంభించింది అన్నారు. అయితే వీటికి భయపడేది లేదని కేటీఆర్ అన్నారు. సన్నవడ్లకు కూడా బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ హామీ బోగస్ గా మారిందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లు వేసి మద్దతు ధర లేక రైతుబంధు లేక నష్టపోతున్న రైతన్నల తరపున పోరాడుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలన ఫ్రం దిల్లీ, టూ దిల్లీ, ఫర్ దిల్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు.

**కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న పతనం నుంచి తెలంగాణ కోలుకోవడం అసాధ్యం**

నాలుగు సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారం పోవడం ఖాయమని అయితే కొత్త ప్రభుత్వానికి ఈ ప్రభుత్వం చేసిన నష్టం నుంచి తేరుకొని ముందుకు తీసుకుపోవడం అతిపెద్ద సవాలుగా మారుతుందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక ప్రగతి పూర్తిగా పతనం అయిందన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం వెనక్కి పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆదాయ వనరుల నుంచి మొదలుకొని వ్యవసాయ రంగం, అన్ని రంగాలు తిరోగమనంలో ఉన్నాయన్నారు. నిరుద్యోగిత పెరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి అనేక కంపెనీలు వదిలి వెళ్ళిపోతున్నాయన్నారు. ఈ అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయో ఎవరికీ తెలియడం లేదన్నారు. కాంగ్రెస్ పాలన వలన జరుగుతున్న నష్టాన్ని పూడ్చుకోవడం అప్పుడప్పుడే సాధ్యం కాదు అన్నారు

**ప్రజల పక్షాన కొట్లాడడమే ప్రస్తుత బాధ్యత**

ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష బాధ్యతలు నిర్వహించడం పైన ప్రధానంగా దృష్టి సారించామని తెలిపిన కేటీఆర్, ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుతో పాటు తీసుకున్న నిర్ణయాలలో పారదర్శకత పైన ప్రజల తరపున కొట్లాడుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల అప్పుడే బలమైన ప్రజా వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీని రాజ్యాంగబద్ధంగా మార్చే అవకాశం ఉన్నదా అని ఒకరు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మరో నాలుగు సంవత్సరాలు వేచి ఉండాల్సిందే అన్నారు. అయితే ప్రజలు ఐదు సంవత్సరాల కోసం కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు కాబట్టి దాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి అయిదు సంవత్సరాలు పూర్తికాలిక పదవిలో ఉంటారా లేదా ఓటుకు నోటు వల్ల బీజేపీలోకి వెళ్తాడా అని ఒకరు అడిగిన ప్రశ్నకు సమాధానంగా రాజకీయాల్లో ఏదైనా జరుగుతుందని ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ చరిత్ర చూస్తే ఎప్పుడూ ఎలాంటి పరిణామమైనా జరగవచ్చు అన్నారు.

**రాజకీయాల్లోకి కుటుంబాలను లాగడం నీచం**

తాము అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో ఏనాడూ ఇతరుల కుటుంబ సభ్యులను రాజకీయ అంశాల్లోకి లాగలేదన్నారు. దాదాపు రెండు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో కుటుంబ సభ్యులను అవహేళన చేసి మాట్లాడినప్పుడు, రాజకీయాలు వదిలేయాలన్నంత భావోద్వేగానికి గురైన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. కేవలం రాజకీయాల కోసం ఇతరుల కుటుంబ సభ్యులను ఎందుకు లాగుతారో అర్థంకాదని, ఈ విషయం తనకు అత్యంత బాధ కలిగిస్తుందన్నారు.

నీచమైన రాజకీయాల కోసం తన కుటుంబాన్ని లాగుతున్న ముఖ్యమంత్రి పైన, ఆయన వందిమాగదుల పైన ప్రజల మద్దతుతో పోరాటం చేస్తాను. రేవంత్ అధికారంలోకి వచ్చిన తర్వాతా ఈ నీచమైన రాజకీయ సంస్కృతి అత్యంత హీనమైన దశలో రాష్ట్రం ఉన్నది . అయితే ఈ నీచమైన దశకూడా త్వరలో ముగిసిపోతుందన్న నమ్మకం వ్యక్తం చేశారు.

**మూసీ, హైడ్రా పైన...**

చెరువుల సంరక్షణ పేరుతో ప్రభుత్వం పేపర్ మీద గొప్పలు చెబుతున్నప్పటికీ అసలైన ఎజెండా అవినీతి మాత్రమే. మూసీ బ్యూటిఫికేషన్ కి మేం వ్యతిరేకం కాదు కానీ మూసీ లూటిఫికేషన్ కి వ్యతిరేకం. మూసీ ప్రక్షాళన దేశంలోనే అతిపెద్ద అవినీతి స్కాం అవుతుందన్నారు. హైడ్రా కేవలం కొందరిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని పనిచేస్తోంది. ఇప్పటిదాకా ఒక్క పెద్ద బిల్డర్ ని కూడా హైడ్రా ముట్టుకోలేదు, కేవలం పేదలను, మధ్యతరగతి ప్రజలను మాత్రమే నిర్దయగా దోచుకున్నదన్నారు.

**మా సోషల్ మీడియా వారియర్లు గొప్పగా పనిచేస్తున్నారు**

ఎన్నికల్లో ఓటమి తర్వాత సామాజిక మాధ్యమాల్లో పార్టీ మద్దతుదారులు ప్రపంచవ్యాప్తంగా బాగా యాక్టివ్ గా మారారన్నారు. ఈ అంశంలో పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు అనేక అంశాలను చర్చించాము. పార్టీ తరపున ఏం ఆశించకుండానే అద్భుతంగా పనిచేస్తున్నారని, వారి మద్దతును పార్టీకీ సోషల్ మీడియా వారియర్లు అందిస్తున్నారన్నారు. ఇంత బలమైన సోషల్ మీడియా బృందాన్ని కలిగినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. త్వరలోనే ఒక విస్తృత సమావేశాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. తెలంగాణకు వ్యతిరేకంగా, కాంగ్రెస్కి మద్దతుగా వ్యవహరిస్తున్న ప్రధాన స్రవంతి మీడియాకి ప్రత్యామ్నాయం సోషల్ మీడియా మాత్రమే అన్నారు.

**కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు**

తెలంగాణ రాష్ట్రం ఉన్నన్ని రోజులు.. తెలంగాణ పదం ఉన్నన్ని రోజులు కేసీఆర్ పేరు నిలిచే ఉంటుందన్నారు. కేసీఆర్ సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉన్నారని, ఆయన పార్టీని, తమ నాయకులందరికీ ఎప్పటికప్పుడు ఆయా అంశాల పైన మార్గదర్శనం చేస్తున్నారని తెలిపారు. బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా కొత్తగా ఎన్నికైన ఈ ప్రభుత్వానికి హామీలు అమలు చేసేందుకు సరిపడా సమయం ఇచ్చారన్నారు. నూతన సంవత్సరం తర్వాత ఆయన నుంచి మరిన్ని కార్యక్రమాలను చూస్తామన్నారు

**పోలీసు వేధింపులపైన హెచ్చరిక**

ప్రస్తుతం తమ విధులు మరిచి, చట్ట విరుద్ధంగా భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు నాయకులపైన రెచ్చిపోతున్న పోలీస్ అధికారులను గుర్తుపెట్టుకుంటామన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్రంలో రాజకీయ వేధింపుల విషయంలో ప్రభుత్వ అధినేతలను ప్రసన్నం చేసుకునే పనుల్లో కొంతమంది పోలీసు అధికారులు బిజీగా ఉండడం వలన శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించి పోయాయని కేటీఆర్ అన్నారు. రాష్ట్రానికి పూర్తిస్థాయి హోంమంత్రి అవసరం ఉందన్నారు. తాము 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించమని తెలిపారు. మతపరమైన హింస వాంఛనీయం కాదన్నారు. హైదరాబాద్ లాంటి మెట్రోపాలిటన్ నగరంలో నెల రోజులపాటు ఎలాంటి కారణం లేకుండా 144 సెక్షన్ విధించడం షాక్ కు గురి చేసింది అన్నారు. ఏదో అత్యంత కీలకమైన అంశం సరిగా లేకుంటేనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటుందని కేటీఆర్ అన్నారు.

**పలు ఇతర అంశాలపై కేటీఆర్ స్పందన**

* తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ బిజెపి కలిసి పని చేస్తున్నాయి. అనేక అంశాలు రెండు పార్టీల నాయకులు కుమ్మక్కై పనిచేస్తున్న విషయం ప్రజలందరికీ అర్థమవుతోంది.
* ఇచ్చిన హామీలను తప్పుతున్న కాంగ్రెస్ లాంటి పార్టీల పైన చర్యలు తీసుకునేందుకు ప్రజలను పదేపదే మోసం చేయడాన్ని అరికట్టేందుకు బలమైన ఎన్నికల సంస్కరణలు అవసరం.
* మహారాష్ట్ర ఎన్నికల్లోను జాతీయ పార్టీలను ప్రజలు నమ్మవద్దు..అక్కడి స్థానిక పార్టీలకు ఓటు వేయాలి.
* తమిళనాడు విజయ్ దళపతి ప్రారంభించిన రాజకీయ పార్టీకి శుభాకాంక్షలు.
* రాజకీయపరమైన అంశాల పట్ల విభేదాలే తప్ప తెలుగుదేశం, వైఎస్ఆర్‌సీపీ అగ్ర నాయకులందరితో వ్యక్తిగతంగా మంచి అనుబంధం ఉంది.
* ప్రజలే సాధారణ వ్యక్తులను నేతలుగా తయారు చేస్తారని నా నమ్మకం . బిఆర్ఎస్ పార్టీ బలంగా తిరిగి అధికారంలోకి వస్తుంది. బిఆర్ఎస్ పార్టీ కుటుంబం, తన స్నేహితులు, కుటుంబ సభ్యుల వల్లనే నాకు నిత్యం స్ఫూర్తి లభిస్తుంది.
* ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నందువల్ల మాకు నిబద్ధత కలిగిన, బలమైన నూతన నాయకత్వాన్ని తయారు చేసుకునే అవకాశం వచ్చింది. నిజం కన్నా పర్సెప్షన్, పీపుల్ మేనేజ్మెంట్ చాలా ముఖ్యమని గత ఎన్నికల ఓటమి మాకు నేర్పింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అబద్ధపు హామీలు ప్రజల్లో అవాస్తవికమైన ఆశల్ని రేకెత్తించాయి. రెండుసార్లు వరుసగా గెలవడంతో యాంటీ ఇన్ కంబెన్సీ కూడా మా ఓటమికి కొంత కారణమైంది.
* పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పకుండా వస్తాయి.
* ఒకే దేశం ఒకే ఎన్నిక అనే అంశం బీజేపీ చేస్తున్న మరొక జుమ్లా అయి ఉంటుంది. అయితే వారు తీసుకువచ్చే చట్టం ఎలాంటిదో చూడాల్సిన అవసరం ఉంది. నావ్యక్తిగత అభిప్రాయం ప్రకారం ఇది అసాధ్యం.
* గ్రూప్ వన్ అభ్యర్థులకు నా పూర్తి మద్దతు ఉంటుంది. పార్టీ తరపున వారికి అండగా ఉంటాం. యువతకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపైన రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తాం.

# చినాబ్ వంతెనపై పాక్ కన్ను

- వివరాలు సేకరిస్తున్న పొరుగుదేశం
- చైనా కోరిక మేరకు రంగంలోకి



**శ్రీనగర్:** జమ్మూకశ్మీర్ లోని చినాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెనపై పొరుగుదేశం పాకిస్థాన్ కన్నేసినట్లుగా ఇంటలిజెన్స్ వర్గాలు పేర్కొన్నట్లు పలు మీడియా సంస్థలు వెల్లడిస్తున్నాయి. జమ్మూకశ్మీర్‌లోని రైసీ, రామబాణ్ జిల్లాల మధ్య నిర్మిస్తున్న ఈ వంతెనకు సంబంధించిన వివరాలు సేకరించమని చైనా పాకిస్థాన్‌ను కోరడంతో ఆ దేశ ఇంటెలిజెన్స్ వర్గాలు ఈ బ్రిడ్జి గురించిన కీలకమైన విషయాలు తెలుసుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఆ వివరాలు ఎందుకు తెలుసుకుంటున్నారనే విషయంపై స్పష్టత లేదు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన చినాబ్ రైల్వేవంతెన నిర్మాణం దాదాపు పూర్తయిన విషయం తెలిసిందే. దీని నిర్మాణం పూర్తిచేయడానికి ప్రభుత్వానికి 20 ఏళ్లు పట్టింది. ఇటీవల ఈ వంతెనపై తొలి రైలు ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. కశ్మీర్‌ను భారత్‌లోని మిగతా ప్రాంతాలతో అనుసంధానించేందుకు చేపట్టిన ఈ నిర్మాణాన్ని ఉధంపుర్‌శ్రీనగర్ బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించారు. ఇప్పటివరకూ చైనాలోని బెయిపాన్ నదిపై నిర్మించిన 275 మీటర్ల పొడవైన షుబాయ్ రైల్వే వంతెన పేరుతో ఉన్న ప్రపంచ రికార్డును ఇది అధిగమించింది. పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 30 మీటర్లు ఎక్కువగా ఉండటం విశేషం. నదీగర్భం నుంచి 359 మీటర్ల ఎత్తున ఉన్న ఈ రైల్వే వంతెన పొడవు 1,315 మీటర్లు.

# స్వతంత్రతను పక్కన పెట్టిన ఈసీ

- ఈ విషయంలో అద్భుతమైన ప్రతిభ
- కాంగ్రెస్ తీవ్ర విమర్శలు



**దిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. తన స్వతంత్రతను పూర్తిగా పక్కనపెట్టడమే లక్ష్యమైతే.. ఆ విషయంలో ఎన్నికల సంఘం అద్భుతమైన పనితీరు చూపుతోందని మండిపడింది. ఈ మేరకు లేఖ రాసింది. ఇటీవల జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందులు చేస్తూ ఫలితాలు వెలువడ్డాయి. బీజేపీ అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. ఎన్నికల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఫిర్యాదు చేయగా.. ఈసీ తోసిపుచ్చింది. ''తమకు అనుకూల ఫలితాలు రానప్పుడు కాంగ్రెస్ నిరాధార ఆరోపణలు చేస్తుంటుంది'' అని విమర్శించింది. ఆ ఆరోపణలు బాధ్యతారాహిత్యమైనవని తోసిపుచ్చింది. హర్యానా ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోలేదని, ఇలాంటి పనికిమాలిన ఫిర్యాదులు చేసే ధోరణిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఎన్నికల సంఘం తనకు తాను క్లీన్‌చిట్ ఇచ్చుకోవడం తమనేమీ ఆశ్చర్యపర్చలేదని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. అయితే సమాధానం ఇచ్చిన తీరు, వాడిన భాష, పార్టీపై చేసిన ఆరోపణలు తాము తిరిగి లేఖ రాసేందుకు కారణమయ్యాయని వ్యాఖ్యానించింది. ఈసీ ఇదే తరహా భాషను ఉపయోగిస్తూ ఉంటే.. అలాంటి వ్యాఖ్యలను తొలగించేందుకు న్యాయపరమైన ఆశ్రయం పొందడం మినహా తమకు మరో మార్గం లేదంటూ ఆ లేఖలో తీవ్రంగా స్పందించింది.

### తెలుగు రాష్ట్రాల పోలీసులకు

# 'గృహమంత్రి దక్షతా పదక్' అవార్డులు

**దిల్లీ:** ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ఈ ఏడాదికి గానూ 'కేంద్రీయ గృహమంత్రి దక్షతా పదక్ అవార్డులను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. ప్రత్యేక ఆపరేషన్లు, దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్ తదితర విభాగాల్లో అసాధారణ ప్రతిభ కనపరిచిన పోలీసు సిబ్బందికి ఈ అవార్డులను అందజేయనుంది. దేశవ్యాప్తంగా 463 మంది పోలీసు సిబ్బందికి ఈ అవార్డులను ప్రకటించారు. ఇందులో తెలుగు రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా అస్సాం, బిహార్, అరుణాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలు, దిల్లీ, జమ్మూకశ్మీర్, చండీగఢ్ తదితర కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన పోలీసులు, సీఆర్పీఎఫ్, సీబీఐ, ఎన్ఐఏ, ఎన్సీపీ, ఐటీబీపీ వంటి కేంద్ర సాయుధ బలగాల సిబ్బందికి ఈ అవార్డులను ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు ఎస్పీలు, తెలంగాణ నుంచి ఒక ఎస్పీతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు పోలీసు కానిస్టేబుళ్లకు ఈ పురస్కారాలు దక్కాయి.

# చెన్నూరులో విషాదం..

### గోదావరి నదిలో ఇద్దరు యువకులు గల్లంతు

**విశ్వంభర, మంచిర్యాల :** మంచిర్యాల జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. గోదావరిలో స్నానానికి వెళ్లి ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. ఈ విషాదకర సంఘటన చెన్నూరులోని సుందరశాల వద్ద చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### కురుమూర్తి జాతరకు

# హైదరాబాద్ నుంచి స్పెషల్ బస్సులు

**విశ్వంభర, హైదరాబాద్:** మహబూబ్‌నగర్ జిల్లా అమ్మాపూర్‌లో జరిగే కురుమూర్తి స్వామి జాతరకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడిపించాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. హైదరాబాద్ నుంచి ఈ స్పెషల్ బస్సులు నడవనున్నాయి. కురుమూర్తి జాతరలో ప్రధాన ఘట్టమైన ఉద్దాల ఉత్సవం ఈ నెల 8వ తేదీన ఉంది. దీంతో ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయా రోజుల్లో హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులను టీజీఎస్ఆర్టీసీ అందుబాటులో ఉంచుతుంది. ఎంజీబీఎస్ – ఆరాంఘర్ – మహబూబ్‌నగర్ మీదుగా ఈ బస్సులు జాతరకు వెళ్తాయి. కురుమూర్తి జాతరకు వెళ్లే ప్రత్యేక బస్సుల్లో టీజీఎస్ఆర్టీసీ ముందస్తు రిజర్వేషన్లను కల్పిస్తోంది. టికెట్ల బుకింగ్ కోసం www.tgsrtcbus.in వెబ్‌సైట్ సంప్రదించగలరు. ఈ ప్రత్యేక బస్సులను ఉపయోగించుకుని కురుమూర్తి స్వామిని దర్శించుకోవాలని టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం కోరుతోంది.

## తెలంగాణలో మరో రెండురోజులు వానలే

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో రాగల రెండు, మూడురోజులు వానలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నైరుతి బంగాళాఖాతం, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరంలో ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తు నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు కొనసాగుతుందని పేర్కొంది. మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహమూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే అవకాశాలున్నాయని పేర్కొంది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. ఈ నెల 4 వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అంచనా వేసింది. ఆ తర్వాత రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడుతుందని వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24 గంటల్లో మంచిర్యాల, ములుగు, జయశంకర్, మెదక్, సంగారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డితో పాటు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదైంది.

# గవర్నర్ ప్రతిభా పురస్కారాలు

### నేటి నుంచే దరఖాస్తుల స్వీకరణ

**విశ్వంభర, హైదరాబాద్:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు రంగాలకు చెందిన వారికి ఏటా పురస్కారాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నిర్ణయించారు. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో గత ఐదేళ్లుగా ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి గవర్నర్ ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నట్టు గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. సంస్థలు, వ్యక్తులకు వేర్వేరు కేటగిరీల్లో అవార్డులు ఉంటాయన్నారు. శనివారం నుంచి ఈనెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో governor.telangana.gov.in ద్వారా లేదా రాజ్ భవన్ చిరునామాకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని బుర్రా వెంకటేశం తెలిపారు. అవార్డు కింద రూ.2 లక్షలు, జ్ఞాపిక ఇవ్వనున్నట్లు చెప్పారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి పద్మనాభయ్య నేతృత్వంలోని న్యాయనిర్ణేతల కమిటీ ఈ దరఖాస్తులను పరిశీలించి అవార్డులకు ఎంపిక చేస్తుందని తెలిపారు.



భారతదేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలను సాక్షాత్తు శివజ్యోతి ప్రతిరూపాలుగా మహా మహిమాన్వితాలుగా హైందవులు విశ్వసిస్తుంటారు. సామాన్యుడు సైతం తనను ఆరాధించడం సులువుగా ఉండేందుకు శివుడు లింగరూపం ధరించాడు. జ్యోతిర్లింగం అంటే లింగ రూపంలో శివుడిని ఆరాధించే చోటు. దేశవ్యాప్తంగా 12 చోట్ల జ్యోతిర్లింగాలు నెలకొని ఉన్నాయి. గుజరాత్‌లోని అరేబియా సముద్రతీరంలో సోమనాథ క్షేత్రం ఉంది. ఇక మన ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాతీరంలో శ్రీశైలం మల్లికార్జునుడున్నాడు. ఉజ్జయినిలో మహాకాళేశ్వరుడు కొలువయ్యాడు.ఈ ప్రాంతం మధ్యప్రదేశ్‌కు వాయవ్యంగా దాదాపు రాజస్థాన్‌కు అనుకుని ఉంటుంది. నర్మదాతీరంలో ఓంకార క్షేత్రంలో ఓంకారేశ్వరుడు వెలిశాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు 77 కిలోమీటర్ల దూరం.కేదారేశ్వరుడు ఉత్తరాఖండ్‌లోని బదరీనాథ్ సమీపంలో వెలిశాడు. మహారాష్ట్రలోని పుణె సమీపంలో వెలసిన జ్యోతిర్లింగం భీమశంకరుడు. నాసిక్ నుంచి 30 కిలోమీటర్ల దూరంలో త్రయంబకేశ్వరుడు కొలువయ్యాడు. కాశీలోని జ్యోతిర్లింగం విశ్వనాథుడు. జార్ఖండ్‌లోని దేవ్‌గఢ్ ప్రాంతంలో వైద్యనాథ జ్యోతిర్లింగం ఉంది. నాగేశ్వర జ్యోతిర్లింగం గుజరాత్‌లోని ద్వారక సమీపంలో ఉంది. తమిళనాడులోని రామేశ్వరంలో రామేశ్వరుడు ఉన్నాడు. మహారాష్ట్రలోని దౌలతాబాద్ దగ్గర ఘృష్ణేశ్వరుడి పేరుతో పరమేశ్వరుడు ప్రకాశిస్తున్నాడు. ప్రతి హిందువుకు ఈ జ్యోతిర్లింగాలకు దర్శించుకోవాలనే కోరిక చాలా మందిలో ఉంటుంది. అందుకోసం 12 జ్యోతిర్లింగాల విశేషాలతో క్లుప్తంగా విశ్వంభర దినపత్రిక ప్రత్యేక వ్యాసం..

-పోతుగంటి వెంకటరమణ



# శివజ్యోతి ప్రతిరూపాలు.. ద్వాదశ జ్యోతిర్లింగాలు



## సోమనాథ్ ఆలయం

దేశంలోని మొత్తం 12 జ్యోతిర్లింగాలలో ఇది మొదటిది. గుజరాత్ రాష్ట్రంలోని సౌరాష్ట్ర జిల్లాలో సోమనాథేశ్వర క్షేత్రం ఉంది. ఈ క్షేత్రాన్ని దర్శించిన శ్రీకృష్ణ పరమాత్ముడు తన లీలతో వెలిగించిన దీపం నేటికీ ప్రజ్వరిల్లుతుండటం ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడ ఉన్న చంద్రకుండంలో స్నానం చేసి సోమ నాథేశ్వరుడిని దర్శిస్తే సర్వ పాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. చంద్రుడే స్వయంగా ఈ సోమనాథేశ్వరుడిని ప్రతిష్ఠించినట్లు పురాణ గాథలు చెబుతున్నాయి. చరిత్రను బట్టి చూస్తే ఎన్నోసార్లు ఈ ఆలయం కూల్చవేసి, మళ్లీ పునర్మించినట్లు తెలుస్తోంది.

## శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవాలయం

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైల కొండల్లో మల్లికార్జునుడు కొలువుదీరి ఉన్నాడు. పరమేశ్వరుడు భార్య గౌరీదేవితో కలిసి స్వయంభువుగా శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జునుడుగా వెలిశాడు. శ్రీశైల మహాక్షేత్రం... కర్నూలు జిల్లా దోర్నాల్ రైల్వేస్టేషన్ నుంచి 52 కిలోమీటర్లు, హైదరాబాద్‌కు 230 కిలోమీటర్ల దూరంలో ఉంది.



## శ్రీ త్రయంబకేశ్వరుడు

మహారాష్ట్రలోని నాసిక్‌కు 30 కిలోమీటర్ల దూరంలో శ్రీ త్రయంబుకేశ్వరాలయం ఉంది. బ్రహ్మవిష్ణువుల ప్రార్థనలతో స్వయంభువుగా వెలసి బ్రహ్మతో త్రయంబకేశ్వరుడిగా కీర్తనలందుకొన్న త్రయంబకేశ్వర క్షేత్రం గురించి 2 కథనాలు ప్రచారంలో ఉన్నాయి.





## శ్రీరామేశ్వరుడు

తమిళనాడు రాష్ట్రంలో శ్రీ రామేశ్వరాలయం ఉంది. ఇక్కడి నిర్మాణ శైలికి చాలా పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. రావణునిపై గెలిచిన తర్వాత రాముడి గెలుపుకు గుర్తుగా ఈ కట్టడం నిర్మాణానికి సంబంధం ఉందని స్థానికులు చెబుతుంటారు. రామేశ్వరంలోని బావుల్లో నీటితో స్నానం చేస్తే సమస్త బాధలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. ఇక్కడ మొత్తం 64 తీర్థాలు(నీటి ఆవాసాలు) ఉన్నాయి.

## మహాకాళేశ్వర జ్యోతిర్లింగం

మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉజ్జయినీ పట్టణంలో శ్రీ మహా కాళేశ్వరాలయం ఉంది. ఈ దేవాలయం రుద్రసాగరం సమీపాన ఉంది. క్షిప్ర నదీ తీరంలో మంత్రశక్తి వల్ల ఉద్భవించిన ఏకైక స్వయంభూ జ్యోతిర్లింగం. తాంత్రిక మంత్రాలతో నడుపుతున్న జ్యోతిర్లింగాలయం ఇది. ఆలయ ముఖద్వారం దక్షిణాభిముఖంగా, గర్భగుడి శ్రీచక్రయంత్రం తిరగవేసి ఉండడం ఇక్కడి ప్రత్యేకత. ఐదు అంతస్తుల్లో ఉన్న ఆలయంలో మహా కాళేశ్వరుడికి పాతఃకాలం భస్మాభిషేకం చేస్తారు. ఇక్కడ కాలభైరవునికి మద్యం నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ దేవాలయంలోని మహాకాళేశ్వరుని విగ్రహాన్ని "దక్షిణామూర్తి" అని కూడా అంటారు. ఉజ్జయినిలో శివలింగాలు మూడుఅంతస్థులుగా ఉంటాయి. అన్నింటి కంటే కింద మహా కాళ లింగం. మధ్యలో ఉండేది ఓంకార లింగం, ఆ పైన ఉండేది నాగేంద్ర స్వరూపమైన లింగం.





## శ్రీ ఓంకారేశ్వరుడు

మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖాండ్వా జిల్లాలో ఈ పుణ్యక్షేత్రం ఉంది. వింధ్య పర్వత సానువుల్లో నర్మదానది తీరంలో ఓంకారేశ్వరుడు వెలిశాడు. సంస్కృత ఓం ఆకారంలో వెలసిన ఈ క్షేత్రంలోని ఓంకారేశ్వర లింగం అమరేశ్వర లింగం పక్కపక్కనే ఉండడం విశేషం. ఇక్కడ ఉన్న రెండు కొండల మధ్య నర్మదా నది,ఈ దివ్య క్షేత్రాలను ఆకాశం నుంచి చూస్తే ''ఓం ''ఆకారం గా కని పిస్తుందిట. అందుకే దీనికి ఓంకారేశ్వర క్షేత్రం అని పేరు.



## శ్రీ భీమేశ్వరుడు

మహారాష్ట్రలో సహ్యాద్రి కొండల్లో పుణేకు 110 కిలోమీటర్ల దూరంలో కృష్ణానది ఉపనది భీమనది ఉద్భవ ప్రాంతంలో భీమశంకర జ్యోతిర్లింగంగా వెలసింది. కుంభకర్ణుని కుమారుడు రాక్షస భీముని నాశనం చేసే ఈశ్వరుడి రూపంలో ఈ లింగం ఉంటుంది.భీమశ్వర ఆలయాన్ని 13వ శతాబ్దంలో నాగరా పద్ధతిలో పీష్వాల దీవాన్ అయిన నానా ఫడ్నవీస్ నిర్మించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తున్నది. ముంబై, పుణె, ఔరంగాబాద్, అహ్మద్ నగర్ ప్రాంతాల నుంచి వివిధ రకాల రవాణా సౌకర్యాలు ఈ స్థలానికి ఉన్నాయి. ముంబై, పుణె నుంచి బస్సు సౌకర్యం ఉంది.

## శ్రీ ఘృష్ణేశ్వరుడు

మహారాష్ట్ర ఔరంగబాద్ పట్టణానికి 30 కిలోమీటర్ల దూరంలో శ్రీ విఘ్నేశ్వరాలయం ఉంది. అజంతా ఎల్లోరా గ్రామంలో ఘృష్ణేశ్వర ఆలయం ఉంది. అజంతా ఎల్లోరా గుహలు, ప్రపంచ ప్రసిద్ధి పొందిన దర్శనీయ పర్యాటక స్థలాలు, దేవగిరి కొండపై ఘృష్ణేశ్వరుని ఆలయం వెలిసింది.



## శ్రీ నాగనాథేశ్వరుడు

అరణ్యవాసంలో భాగంగా దారుకా వనంలో ఉన్నప్పుడు పాండవులే స్వయంగా ఆలయం నిర్మించినట్లు పురాణ గాథ. దీనికి సంబంధించి కొద్దిగా వివాదం ఉంది. రెండు,మూడు చోట్ల ఉన్న ఆలయాన్ని నాగనాథ జ్యోతిర్లింగంగా పిలుస్తూ ఉన్నారు. అయితే ఎక్కువగా ప్రాచుర్యంలో ఉన్న నాగనాథేశ్వర దేవాలయం మాత్రం గోమతి ద్వారక, బైత్ ద్వారక ద్వీపం మధ్య గుజరాత్ రాష్ట్రంలోని సౌరాష్ట్రలో ఉన్నదాన్నే చెబుతారు.





## శ్రీ వైద్యనాథేశ్వరుడు

జార్ఖండ్ రాష్ట్రంలో సంతాల్ పరగణ ప్రాంతంలో ధియోగర్ జిల్లాలో శ్రీవైద్యనాథేశ్వరాలయం ఉంది. పాట్నా నుంచి 220 కిలోమీటర్ల దూరంలో ఉంది. మహారాష్ట్రలో కట్నీపూర్ దగ్గర పెద్ద శివాలయాన్ని కూడా శ్రీవైద్యనాథ జ్యోతిర్లింగంగా పూజిస్తున్నారు. ఈ రెండింటి నేపథ్యమూ రామాయాణాంతర్గత రావణాసురిడి కథతో ముడిపడి ఉంది. ఈ లింగాన్ని పూజిస్తే వారికి వ్యాధులు నయం అవుతుండడం వల్ల శ్రీవైద్యనాథేశ్వరుడిగా పిలుస్తారని ప్రతీతి.

## శ్రీ కేదారేశ్వరుడు

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో కేదారేశ్వలయం ఉంది. ఏప్రిల్ నుంచి నవంబరు నెల వరకే ఈ ఆలయం తెరుస్తారు. విష్ణుమూర్తి నరనారాయణులుగా కొన్ని వేల సంవత్సరాలు శివుని ధ్యానించి తపస్సు చేసి లోక కల్యాణానికి ఈ లింగాన్ని ప్రతిష్ఠించినట్లు పురాణ కథ. బొందితో స్వర్గానికి వెళ్లేందుకు పాండవులు ఈ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారని ప్రతీతి. అంతరాలయంలో నేటికీ పాండవులు, ద్రౌపది విగ్రహాలు ఉన్నాయి. ఆదిశంకరాచార్యుల సమాధి, శివపార్వతుల తపోభూమి, ఆదిదంపతుల కళ్యాణసమయంలో హోమగుండం, నేటికీ దర్శించవచ్చు. హరిద్వార్ నుంచి గౌరీకుండ్ వరకు బస్సు మార్గం ఉంది.





## శ్రీవిశ్వనాథేశ్వరుడు

శ్రీ విశ్వనాథేశ్వరుడి జ్యోతిర్లింగం కాశీక్షేత్రంలో ఉంది. గంగానది తీరంలో బౌద్ధ, జైన మతాలవారు, హైందవులు అనేకమంది తీర్థయాత్రికులు కాశీ విశ్వేశ్వరుని దర్శించుకుంటారు. అవిముక్త జ్యోతిర్లింగంగా నిలిచే విశ్వేశ్వరాలయం బంగారు శిఖరాలను కలిగి ఉంది. విశ్వనాథ దేవాలయం సన్నిధిలో విశాలాక్షి శక్తిపీఠం ఉంది. కాశీలో ఎన్నో ఆలయాలు, గంగానదీ తీరంలో మరెన్నో స్నానఘట్టాలు ఉన్నాయి. ఈ క్షేత్రంలో స్నాన, దాన, హోమం చేసిన వారికి ఈశ్వర వరప్రసాదంతో మరుజన్మ ఉండదని ప్రతీతి.

## మూరత్ ట్రేడింగ్ ప్రారంభం.. లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి:** దీపావళి సందర్భంగా ఏటా నిర్వహించే మూరత్ ట్రేడింగ్ ప్రారంభమైంది. గంటపాటు ఈ ట్రేడింగ్ జరగనుంది. సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా లాభంతో 79,750వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ 100 పాయింట్లకు పైగా లాభంతో మొదలైంది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, ఎన్టీపీసీ, ఇండస్ ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా రాణిస్తున్నాయి. సన్‌ఫార్మా ఒక్కటే స్వల్ప నష్టాల్లో కొనసాగుతోంది.

**గంట పాటు ట్రేడింగ్ :** ఉగాది నుంచి తెలుగు సంవత్సరాది.. జనవరి 1 నుంచి క్యాలెండర్ ఇయర్.. ఏప్రిల్ 1 నుంచి ఆర్థిక సంవత్సరం ఎలా ప్రారంభమవుతుందో.. మార్కెట్లకు దీపావళితో కొత్త ఏడాది ప్రారంభమవుతుంది. ఈ దీపావళి నుంచి సంవత్ 2081 ఆరంభం కానుంది. గురువారమే దేశమంతా దీపావళి జరుపుకోగా.. శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలు మూరత్ ట్రేడింగ్ నిర్వహిస్తున్నాయి.

### ఎందుకీ మూరత్ ట్రేడింగ్?

దీపావళి రోజున ఏదైనా పని ప్రారంభిస్తే విజయం వరిస్తుందన్నది భారతీయుల విశ్వాసం. అదే తరహాలో స్టాక్ మార్కెట్‌లో ఈ పర్వదినం రోజు ట్రేడింగ్ చేస్తే.. వచ్చే దీపావళి వరకు లాభాల పంట పండుతుందని చాలా మంది భావిస్తారు. ఆ నమ్మకంతోనే చాలా మంది మూరత్ ట్రేడింగ్‌లో పాల్గొనేందుకు మక్కువ చూపుతుంటారు. చాలా మంది ఈ ట్రేడింగ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఇప్పటికే పెట్టుబడులు పెడుతున్న వారికీ, కొత్తగా మార్కెట్లోకి రావాలనుకునే వారికీ ఇది ఎంతో ప్రత్యేకం. మంచి కంపెనీలను ఎంచుకొని, దీర్ఘకాలంపాటు అందులో కొనసాగినప్పుడు ఆశించిన లాభాలను పొందేందుకు అవకాశం ఉంటుంది.

## నిలకడగా టాటా మోటార్స్ అమ్మకాలు

**ముంబయి:** టాటా మోటార్స్ లిమిటెడ్..దేశీయ, అంతర్జాతీయ మొత్తం అమ్మకాలకు సంబంధించి స్వల్ప క్షీణతను నివేదించింది. గత సంవత్సరం అక్టోబర్‌లో 82,954 యూనిట్ల అమ్మకాలతో పోలిస్తే, గత నెల అక్టోబర్‌లో అమ్మకాలు స్వల్పంగా తగ్గి 82,682 యూనిట్లుగా నమోదయ్యాయి. వీటిలో మొత్తం వాణిజ్య వాహనాల(%జఎ%) అమ్మకాలు 34,259 యూనిట్లు కాగా, ప్రయాణికుల వాహన అమ్మకాలు 48,423 యూనిట్లుగా నమోదయ్యాయి. 2024 అక్టోబర్‌లో ట్రక్కులు, బస్సుల(మధ్యస్థ, భారీ వాణిజ్య వాహనాలు)తో సహా దేశీయ విక్రయాలు 15,574 యూనిట్లుగా నమోదయ్యాయి. విదేశీ విక్రయాలు కూడా కలిపి ఇది 16,274.

## భారత్ నుంచి యాపిల్‌కు రికార్డు స్థాయిలో ఆదాయం..

### త్వరలోనే మరో నాలుగు స్టోర్లు



**ముంబయి:** భారత్‌లో యాపిల్ ఐఫోన్ల విక్రయాలు జోరందుకున్నాయి. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఐఫోన్ విక్రయాల ద్వారా యాపిల్‌కు భారత్ నుంచి వస్తోన్న ఆదాయం ఆల్ టైమ్ గరిష్ఠాలకు చేరింది. ఐప్యాడ్ విక్రయాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని యాపిల్ సీనియర్ అధికారులు తెలిపారు. దీంతో కంపెనీ మొత్తం నికర అమ్మకాల్లో 6 శాతం వృద్ధి నమోదై 94.93 బిలియన్ డాలర్లకు (7.98లక్షల కోట్లు) చేరిందని యాపిల్ తెలిపింది. గతేడాది ఇదే సమయంలో నికర అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం 89.49 బిలియన్ డాలర్లుగా (7.524 లక్షల కోట్లు) ఉంది.

సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసిక ఫలితాలను యాపిల్ తాజాగా ప్రకటించింది. "అమెరికా, యూరప్, ఆసియా పసిఫిక్‌తో పాటు యూఎస్, బ్రెజిల్, మెక్సికో, ఫ్రాన్స్, బ్రిటన్, కొరియా, మలేషియా, థాయ్‌లాండ్‌తో సహా పలు దేశాల్లో సెప్టెంబర్ త్రైమాసికంలో రికార్డు స్థాయిలో ఆదాయాలు ఆర్జించాం. భారత్ నుంచి వచ్చే ఆదాయంలో సరికొత్త రికార్డును నెలకొల్పాం" అని యాపిల్ సీఈఓ టిమ్ కుక్ త్రైమాసిక ఫలితాల సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుత త్రైమాసికంలో రెండు స్టోర్‌లను ప్రారంభించిందని తెలిపిన ఆయన త్వరలోనే మరో నాలుగు కొత్త స్టోర్‌లను తీసుకురానున్నట్లు ప్రకటించారు.

కౌంటర్ పాయింట్ రీసెర్చ్ సంస్థ నివేదిక ప్రకారం.. భారత్‌లో సెప్టెంబర్ త్రైమాసికంలో యాపిల్ ఐఫోన్ విక్రయాల ద్వారా వచ్చే విలువ పరంగా మార్కెట్ వాటాలో 21.6శాతంగా ఉన్నాయి. అంటే శాంసంగ్ కంటే కాస్త వెనకబడి ఉంది. యాపిల్ మొత్తం ఉత్పత్తుల విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంలో 4.12శాతం వృద్ధి చెందింది. అదే సమయంలో ఐఫోన్ అమ్మకాలు 5.5శాతం పెరగ్గా, ఐప్యాడ్ అమ్మకాలు 8శాతం పెరిగాయి. ఇక వార్షికంగా చూస్తే ఉత్పత్తి విక్రయాల విలువ 2శాతం పడిపోయింది. 189.28 బిలియన్ డాలర్ల నుంచి 185.23 బిలియన్ డాలర్లకు చేరింది. అనేక ప్రాంతాల్లో యాపిల్ అమ్మకాల్లో వృద్ధి నమోదైనప్పటికీ, చైనాలో మాత్రం విక్రయాలు మందగించాయి. ఇక వార్షిక ప్రాతిపదికన చూస్తే విక్రయాలు 8శాతం తగ్గుముఖం పట్టాయి. ఐప్యాడ్ విక్రయాలు 6శాతం పడిపోయాయి.

## రూ.1.87 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు..!

### ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండో గరిష్టం..

**ముంబయి:** అక్టోబర్ నెలలో స్థూల జీఎస్టీ వసూళ్లు రికార్డు నెలకొల్పాయి . దేశీయ విక్రయాలు పుంజుకోవడంతో గత నెలలో జీఎస్టీ వసూళ్లు తొమ్మిది శాతం వృద్ధి చెంది రూ.1.87 లక్షల కోట్లకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇది రెండో గరిష్టం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రారంభ నెల ఏప్రిల్‌లో రూ.2.10 లక్షల కోట్లు వసూలు కావడమే గరిష్టం.

ఇక గత నెల జీఎస్టీ వసూళ్లలో సెంట్రల్ జీఎస్టీ రూ.33,821 కోట్లు, రాష్ట్ర జీఎస్టీ రూ.41,864 కోట్లు, ఇంటిగ్రేటెడ్ ఐజీఎస్టీ రూ.99,111 కోట్లు, సెస్ రూ.12,550 కోట్లు వసూళ్లయ్యాయి. గత నెలలో జీఎస్టీ వసూళు 8.9 శాతం పెరిగి రూ.1,87,346 కోట్లకు చేరుకున్నాయి. గతేడాది అక్టోబర్ నెలలో రూ.17.2 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు నమోదయ్యాయి.దేశీయ లావాదేవీల ద్వారా జీఎస్టీ వసూళ్లు 10.6 శాతం వృద్ధితో రూ.1.42 లక్షల కోట్లు, విదేశాల నుంచి వస్తువుల దిగుమతి ద్వారా రూ.45,096 కోట్లు వసూలయ్యాయి. 2023-24తో పోలిస్తే గత నెలలో రీఫండ్స్ 18.2 శాతం పెరిగి రూ.19,306 కోట్లకు చేరాయి. రీఫండ్స్ సర్దుబాట్లతో నికర జీఎస్టీ వసూళ్లు 8 శాతం వృద్ధితో రూ.1.68 లక్షల కోట్లకు చేరాయి.

## గూగుల్‌కు పోటీగా చాట్‌జీపీటీ సెర్చ్‌ఇంజిన్..




**ముంబయి:** ఓపెన్ ఏఐ మరో సంచలనం! మరో కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. ఇన్నాళ్లు ప్రశ్నలకు సమాధానాలు మాత్రమే ఇస్తూ వస్తున్న చాట్‌జీపీటీలో సెర్చ్ ఇంజిన్ సామర్థ్యాలను జోడించింది. సెర్చ్ ఇంజిన్ విషయంలో గూగుల్ గుత్తాధిపత్యం కొనసాగుతున్న వేళ ఈ ఫీచర్‌ను తీసుకురావడం గమనార్హం. ఈ కొత్త ఫీచర్ ద్వారా యూజర్లు ఇకపై తక్షణమే, వెబ్‌లింక్స్‌తో కూడిన రియల్‌టైమ్ సమాచారాన్ని అందుకోవచ్చని ఓపెన్ ఏఐ తెలిపింది. ఇంతకుముందులా సెర్చ్ ఇంజిన్‌పై ఆధారపడాల్సిన అవసరం ఉండబోదని పేర్కొంది. చాట్‌జీపీటీ హోమ్‌పేజీలో కొత్తగా సెర్చ్‌ఆప్షన్ కనిపించనుంది. అక్కడినుంచి క్రికెట్ స్కోరు, వార్తలు, స్టాక్స్ వంటి సమాచారాన్ని పొందొచ్చని కంపెనీ తెలిపింది. కొత్త సదుపాయం చాట్‌జీపీటీ.కామ్ వెబ్‌సైట్‌తో పాటు మొబైల్ యాప్‌లోనూ లభ్యమవుతుందని ఓపెన్‌ఏఐ తెలిపింది. ప్రస్తుతానికి చాట్‌జీపీటీ ప్లస్, టీమ్ యూజర్లు, సెర్చ్‌జీపీటీ వెయిట్ లిస్ట్ యూజర్లకు నేటినుంచే ఈ సదుపాయం అందుబాటులోకి తెస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఎంటర్‌ప్రైజెస్, ఎడ్యుకేషనల్ యూజర్లు కొన్ని వారాల్లో ఈ సదుపాయాన్ని అందుకోనున్నారు. చాట్‌జీపీటీని ఉచితంగా వినియోగించే వారికి కూడా మరికొన్ని నెలల్లో ఈ సదుపాయాన్ని తీసుకురానున్నట్లు ఓపెన్ ఏఐ తెలిపింది. చాట్‌జీపీటీలో ఇన్నాళ్లు ఏదైనా అడిగితే డేటాబేస్‌లో ఉండే సమాచారాన్ని మాత్రమే అందించేది. ఇకపై ఏవైనా ప్రశ్నలు అడిగితే వెబ్‌లో అందుబాటులో ఉన్న సమాచారాన్ని అందిస్తుంది. ఫాలో-అప్ ప్రశ్నలకూ సమాధానం ఇస్తుంది. వాతావరణం, స్టాక్స్, స్పోర్ట్స్, న్యూస్, మ్యాప్స్ కోసం ఓపెన్‌ఏఐ సంస్థ.. ఫైనాన్షియల్ టైమ్స్, టైమ్ మ్యాగజైన్, బిజినెస్ ఇన్‌సైడర్ వంటి సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. వాస్తవానికి తొలుత ఈ సెర్చ్ ఇంజిన్‌ను వేరే ప్రొడక్ట్‌గా తీసుకొస్తారంటూ వార్తలు వచ్చాయి. సెర్చ్ జీపీటీ పేరిట ఫొటోటైప్‌ను ఎంపిక చేసిన యూజర్లకు అందించింది. తాజాగా చాట్‌జీపీటీలోనే దీన్ని జోడించడం గమనార్హం.

## యూపీఐ లావాదేవీల సరికొత్త రికార్డు

### అక్టోబర్‌లో రూ.1658కోట్లకు చేరిన ట్రాన్సాక్షన్ల సంఖ్య



**ముంబయి:** పండగ సీజన్‌లో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలు ఊపందుకున్నాయి. సంఖ్యా పరంగానే కాకుండా.. విలువ పరంగానూ దూసుకు పోతున్నాయి. అక్టోబర్‌లో ఈ ట్రాన్సాక్షన్ల సంఖ్య రూ.1,658 కోట్లకు చేరినట్లు ఎన్‌పీసీఐ తెలిపింది. ఈ లావాదేవీల విలువ రూ.23.5 లక్షల కోట్లకు చేరినట్లు వెల్లడించింది. గతంలో ఎన్నడూ లేనంతగా యూపీఐ లావాదేవీలు వృద్ధి చెందినట్లు పేర్కొంది. వార్షిక ప్రాతిపదికన యూపీఐ లావాదేవీల్లో సంఖ్యా పరంగా 45 శాతం వృద్ధి నమోదుకాగా.. విలువ పరంగా 34 శాతం రాణించాయి. సెప్టెంబర్ నెలలో యూపీఐ లావాదేవీల సంఖ్య 1,500 కోట్లుగా నమోదైంది. అక్టోబర్‌లో ఆ సంఖ్యను అధిగమించింది. సగటు రోజువారీ లావాదేవీలు సెప్టెంబర్‌లో 5 కోట్లు ఉండగా.. అక్టోబర్‌లో ఆ సంఖ్య 5.35 కోట్లకు చేరింది. ఇక ఫాస్టాగ్, ఆటోమేటెడ్ టోల్ పేమెంట్ సిస్టమ్ ద్వారా జరిగే లావాదేవీల సంఖ్య 8శాతం పెరిగి 34 కోట్లకు చేరాయి. అదే సమయంలో ఐఎంపీఎస్, బ్యాంక్ ఆధారంగా జరిపే ఐఎంపీఎస్ ట్రాన్సాక్షన్లు 5శాతం తగ్గి 46 కోట్లుగా నమోదయ్యాయి. డిజిటల్ లావాదేవీలవైపు ఎక్కువ మంది మక్కువ చూపుతున్నారు. దీంతో అనేక బ్యాంకులు ఈ సేవలు అందించేందుకు సిద్ధమవుతున్నాయి. గతేడాదిలో యూపీఐ సేవలు అందిస్తున్న బ్యాంకుల సంఖ్య 492గా ఉండగా.. ఈ ఏడాది ఆ సంఖ్య 622కు పెరిగింది.

## న్యూఢిల్లీ టూ న్యూయార్క్..ఎయిర్ ఇండియా ఎయిర్‌బస్ విమానం.. వారానికి 5 సర్వీసులు..!




**ముంబయి:** ప్రముఖ సుదూరపు రూట్ల (అల్ట్రా లాంగౌల్ రూట్లు)లో ఎయిర్ బసు ఏ350 విమాన సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా శుక్రవారం తెలిపింది. న్యూఢిల్లీ-న్యూయార్క్ మార్గంలో ఎయిర్ బస్ ఏ350 విమాన సర్వీసు ప్రారంభించింది. ఈ నెల 15 నుంచి డిసెంబర్ 31 వరకూ అమెరికాలోని వివిధ కేంద్రాలకు 60 విమాన సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేసినట్లు టాటా సన్స్ అనుబంధ ఎయిర్ ఇండియా ప్రకటించిన నేపథ్యంలో న్యూఢిల్లీ- న్యూయార్క్ మధ్య ఎయిర్ బస్ ఏ350 విమాన సర్వీసు ప్రారంభించడం గమనార్హం. తన వైడ్ బాడీ విమానాల కొరతతోపాటు మెయింటెనెన్స్ , సప్లయ్ చెయిన్ వంటి సమస్యల కారణంగా అమెరికాలోని వివిధ కేంద్రాలకు 60 విమాన సర్వీసులు తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపింది.న్యూఢిల్లీ-న్యూయార్క్ మార్గంలో ఎయిర్ బస్ ఏ350 సర్వీసు ప్రారంభంతో వచ్చే నెల రెండో తేదీ నుంచి వారంలో ఐదు సార్లు ఢిల్లీ-న్యూయార్క్ లిబర్టీ అంతర్జాతీయ విమానాశ్రయం మధ్య ఏ350-900 విమాన సర్వీసు నడుపుతున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఎయిర్ ఇండియా వద్ద ఆరు ఎయిర్ బస్ ఏ350-900 విమానాలు ఉన్నాయి.అల్ట్రా లాంగౌల్ రూట్లు అంటే 16 గంటలు, అంత కంటే ఎక్కువ టైం నిరంతరాయంగా సాగే విమాన సర్వీసులు అని అర్థం. వీటిలో అత్యధికం ఉత్తర అమెరికా నగరాలకు నడుపుతుంది ఎయిర్ ఇండియా. గతేడాది డిసెంబర్ లో తొలి ఎయిర్ బస్ ఏ350-900 విమాన సర్వీసును ఎయిర్ ఇండియా ప్రారంభించింది. గత సెప్టెంబర్ నెలలో న్యూఢిల్లీ-లండన్ హీత్రూ మార్గంలో మధ్యమ శ్రేణి అల్ట్రా లాంగౌల్ విమాన సర్వీసు ప్రారంభించిన ఎయిర్ ఇండియా.. ఈ విమాన సర్వీసుతో వచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా న్యూయార్క్ నగరానికి కొత్త సర్వీసు ప్రారంభించాలని ఆసక్తితో ఉన్నట్లు ఎయిర్ ఇండియా ఎండీ కం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ క్యాంప్ బెల్ విల్సన్ తెలిపారు.

## భారత సవాళ్లను ఎదుర్కొంటాం: లబుషేన్



**సిడ్నీ:** క్రికెట్‌లో భారత్ - ఆస్ట్రేలియా టెస్టు సిరీస్‌కు ప్రత్యేక స్థానం ఉంది. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ కోసం ఇరుజట్లూ తీవ్ర స్థాయిలో పోరాడుతున్నాయి. ఆసీస్ గడ్డపై గత రెండు దఫాలుగా టీమ్‌ఇండియా విజేతగా నిలిచింది. హ్యాట్రిక్ కొట్టాలనే లక్ష్యంతో ఉన్న భారత్‌ను అడ్డుకొని తీరతామని ఇప్పటికే ఆస్ట్రేలియా ఆటగాళ్లు బలంగా చెబుతున్నారు. ఈక్రమంలో ఆసీస్ బ్యాటర్ మార్నస్ లబుషేన్ ఓ ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశాడు. ఎలాంటి బౌలర్‌నైనా ఈసారి కచ్చితంగా అడ్డుకొని విజయం సాధిస్తామని వ్యాఖ్యానించాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకోవడానికి ఇరుజట్లకూ ఇదే కీలక సిరీస్ అని తెలుసనని పేర్కొన్నాడు. "ఆరు నెలల తర్వాత మేం టెస్టు క్రికెట్ ఆడబోతున్నాం. ఆ లోటును దేశవాళీ క్రికెట్‌లో పూరించాం. చాలామంది క్రికెటర్లు డొమిస్టిక్‌లోనూ ఆడి ఫిట్‌నెస్, ఫామ్ అందిపుచ్చుకున్నారు. ఇప్పుడు మేం వరుసగా టెస్టు మ్యాచ్‌లను ఆడబోతున్నాం. మా బౌలర్లు కూడా సిద్ధంగా ఉన్నారు. వన్‌డౌన్, సెకండ్‌డౌన్ ఎవరు వస్తారనేది ఇంకా నిర్ణయించలేదు. స్టీవ్ స్మిత్, నేను ఎక్కడైనా ఆడేందుకు సిద్ధంగా ఉంటాం. సిరీస్ ప్రారంభం నాటికి దీనిపై ఓ స్పష్టత వస్తుందని అనుకుంటున్నా. భారత్‌తో టెస్టు సిరీస్ అంటే ఒత్తిడి ఉండటం సహజమే. ప్రతిసారీ ఇరుజట్లూ విజయం కోసం చివరివరకూ పోరాడతాయి. ఇప్పుడున్న జట్టులో అనుభవం, నైపుణ్యం కలిగిన క్రికెటర్లు ఉన్నారు. కామెరూన్ గ్రీన్ లేకపోవడం నన్ను నిరుత్సాహానికి గురిచేస్తోంది. పేస్ ఆల్‌రౌండర్‌గా జట్టులో కీలక పాత్ర పోషిస్తాడని భావించాం. కానీ, గాయం కారణంగా సిరీస్‌కు దూరంగా ఉంటాడు. భారత బౌలింగ్ విభాగంలో ప్రతిఒక్కరూ డేంజరే. జస్‌ప్రీత్ బుమ్రా సంచలన బౌలర్. అతడిని ఎదుర్కోవడానికి కఠినంగా శ్రమించాల్సిఉంది. బుమ్రా బంతిని అంచనా వేయడం చాలా కష్టం. అశ్విన్ నుంచి కూడా మాకు ప్రతిఘటన ఎదురుకానుంది. అయితే, టాప్ క్లాస్ బౌలర్లను అడ్డుకోవడానికి పక్కా ప్రణాళికతో బరిలోకి దిగుతాం. బుమ్రా లేదా అశ్విన్ ఇంకే బౌలర్ అయినా సరే ఎదుర్కోవడానికి మన నైపుణ్యాలకు పదునుపెట్టాల్సిందే. ఆత్మవిశ్వాసంతో ఆడితేనే సానుకూల ఫలితాలను అందుకోగలం. భారత జట్టులో రిషభ్ పంత్ దూకుడుగా ఆడే బ్యాటర్. మా బౌలర్లకు అతడినుంచి గట్టి సవాల్ తప్పదు. కెప్టెన్ రోహిత్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రపంచస్థాయి ఆటగాళ్లు. గతంలోనూ వారితో ఆడిన అనుభవం మా ప్లేయర్లకు ఉంది. తప్పకుండా వారిపై ఒత్తిడి తీసుకొస్తామని భావిస్తున్నా. వీరేకాకుండా యశస్వి, గిల్ ప్రతిభావంతులే ఈ క్షణంలోనైనా మ్యాచ్‌ను లాగేయగలరు" అని లబుషేన్ వ్యాఖ్యానించాడు.

## మరోసారి నిరాశ పరిచిన రోహిత్, కోహ్లీ ..

### తొలిరోజు స్కోరు 86/4



**ముంబయి:** న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా జరుగుతున్న చివరి మ్యాచ్‌లోనూ భారత్ ఇబ్బంది పడుతోంది. తొలి రెండు మ్యాచుల్లో పరాజయం పాలైన టీమ్‌ఇండియా.. చివరి మ్యాచ్‌లోనూ బ్యాటింగ్‌లో అదే పేలవమైన ఆటతీరును కొనసాగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థిని 235 పరుగులకే కుప్పకూల్చిన భారత్ జట్టు.. మొదటి రోజు ఆటముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 86 పరుగులు సాధించింది. ఇంకా 149 పరుగులు వెనకబడి ఉంది. కెప్టెన్ రోహిత్ శర్మ (18), విరాట్ కోహ్లీ (4) మరోసారి నిరాశ పరిచారు. జైస్వాల్ (30) పెద్దగా రాణించలేదు. మహ్మద్ సిరాజ్ (0) ఎల్బీగా వెనుదిరిగాడు. శుభ్‌మన్ గిల్ (31), రిషభ్ పంత్ (1) క్రీజులో ఉన్నారు. న్యూజిలాండ్ బౌలర్లలో అజాజ్ పటేల్ రెండు వికెట్లు తీయగా, హెన్రీ ఒక వికెట్ పడగొట్టాడు.

**తిప్పేసిన భారత్ స్పిన్నర్లు..**

తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌ను భారత్ స్పిన్నర్లు కట్టడి చేశారు. కీలక సమయాల్లో వికెట్లు పడగొడుతూ ప్రత్యర్థి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశారు. ఓపెనర్లు లాథమ్ (28), కాన్వే (4) తక్కువ పరుగులకే ఔటవ్వడంతో బ్యాటర్లపై ఒత్తిడి పెరిగింది. తొలి డౌన్‌లో వచ్చిన విల్ యంగ్ (71), మిడిలార్డర్‌లో వచ్చిన మిచెల్ (81) క్రీజులో నిలదొక్కుకొని ఆడారు. ఫిలిప్స్ (17) మినహా మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. రవీంద్ర జడేజా (5), వాషింగ్టన్ సుందర్ (4) పోటాపోటీగా వికెట్లు పడగొట్టారు. లాథమ్, మిచెల్, అజాజ్ పటేల్, రచిన్ రవీంద్ర వికెట్లను వాషింగ్టన్ సుందర్ చేజిక్కించుకోగా.. యంగ్, బ్లండెల్, ఫిలిప్స్, హెన్రీ, సోధి వికెట్లను జడేజా తన ఖాతాలో వేసుకున్నాడు.

## న్యూజిలాండ్‌తో మూడో టెస్టులో రవీంద్ర జడేజా రికార్డు



**ముంబయి:** న్యూజి లాండ్‌తో జరుగు తున్న మూడో టెస్టు మ్యాచ్ తొలి రోజు ఐదు వికెట్లు తీసి అదరగొట్టిన భారత్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా మరో రికార్డు నెలకొల్పాడు. భారత టెస్టు క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన ఐదో ఆటగాడిగా నిలిచాడు. అంతేకాకుండా ఒకే ఇన్నింగ్స్‌లో జడేజా ఐదు వికెట్లు తీయడం ఇది 14వ సారి.తాజా ఐదు వికెట్లతో కలిసి ఇప్పటి వరకు జడేజా 314 వికెట్లు పడగొట్టాడు. ఈ జాబితాలో ఇషాంత్ శర్మ (311), జహీర్ ఖాన్ (311)లను దాటేసి ఐదో స్థానానికి దూసుకెళ్లాడు. భారత టెస్టు క్రికెట్లో అత్యధిక వికెట్ల రికార్డు అనిల్ కుంబ్లే (619) పేరిట ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో రవిచంద్రన్ అశ్విన్ (533), కపిల్ దేవ్ (434), హర్భజన్ సింగ్ (417) ఉన్నారు.ఇక మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా స్పిన్నర్లు విజృంభించడంతో న్యూజిలాండ్ 235 పరుగులకు ఆలౌట్ అయ్యింది. తొమ్మిది వికెట్లు స్పిన్నర్లే తీశారు.

## ఇంగ్లండ్ స్టార్లకు సెంట్రల్ కాంట్రాక్ట్.. 29 మందిలో ఉన్నది వీళ్లే..!




**లండన్:** ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్టులు ప్రకటిం చింది. తద్వారా జాతీయ జట్టుకు ఆడుతున్న ఆటగాళ్లకు రెండేండ్ల, వార్షిక ప్రతిపాదికన ఈసీబీ జీతాలు చెల్లించనుంది. టీ20, వన్డే సారథి జోస్ బట్లర్ తో పాటు టెస్టు జట్టు నాయకుడు బెన్ స్టోక్స్ రెండేండ్ల కాలానికి బోర్డుతో అగ్రిమెంట్ చేసుకున్నారు. మొత్తంగా 29 మందితో ఇంగ్లండ్ బోర్డ్ కాంట్రాక్ట్ కుదుర్చుకుంది.ఏడుగురికి రెండేండ్ల పాటు సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కింది. 19 మంది క్రికెటర్లు వార్షిక కాంట్రాక్ట్ సొంతం చేసుకోగా.. మరో ముగ్గురు యువ ఆటగాళ్లు ఇంగ్లండ్ డెవలప్‌మెంట్ పేరిట కాంట్రాక్ట్ సాధించారు. ఇంతకుముందు స్టోక్స్ ఏడాది కాంట్రాక్ట్ మాత్రమే తీసుకున్నాడు. మరోవైపు బట్లర్ రెండు సంవత్సరాల పాటు సెంట్రల్ కాంట్రాక్ట్ మీద సంతకం చేశాడు. ఇప్పుడు ఈ ఇద్దరితో ఈసీబీ రెండేండ్ల పాటు ఒప్పందం చేసుకుంది. ఇక వికెట్ కీపర్ జేమీ స్మిత్ సైతం రెండేండ్ల పాటు జాతీయా జట్టుకు ఆడేందుకు సిద్ధమయ్యాడు.ఆల్‌రౌండర్ విల్ జాక్స్, ఓపెనర్ ఫిల్ సాల్ట్, స్పిన్నర్ షోయబ్ బషీర్, పేసర్ ఓలీ స్టోన్‌లకు కూడా 2 ఏండ్ల సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కింది. యువ క్రికెటర్లు జాకబ్ బెథెల్, జాన్ టర్నర్, జోష్ హల్‌లు ఇంగ్లండ్ డెవలప్‌మెంట్ కాంట్రాక్ట్ జాబితాలో చోటు సంపాదించారు.

## కోచ్‌గా మెస్సీ.. ఆనవాయితీకొనసాగిస్తాడా..?



**విశ్వంభర (క్రీడా విభాగం):** ఏ ఆటలో అయినా వీడ్కోలు అనంతరం చాలామంది ఆటగాళ్లు కోచ్‌గా అవతారం ఎత్తుతారు. జాతీయ జట్టుకు లేదా ఇతర దేశాల జట్లుకు కోచ్‌గా సేవలందిస్తూ తమ అనుభవాన్ని యువకులతో పంచుకుంటారు. ఆయా జట్ల విజయాలను చూసి తామే గెలిచినంతగా సంబురపడిపోతారు. క్రికెట్, టెన్నిస్, ఫుట్‌బాల్ .. ఇలా ప్రతి ఆటలో దిగ్గజ ఆటగాళ్ల సెకండ్ ఇన్నింగ్స్ దాదాపు ఇలానే ఉంటుంది. ఫుట్‌బాల్ లెజెండ్ లియోనల్ మెస్సీ సైతం రిటైర్మెంట్ తర్వాత కోచ్ అవతారం ఎత్తడం పక్కా అంటున్నారు కొందరు. అయితే.. మెస్సీ మాత్రం అందరిలా తాను కోచ్ అవ్వను అంటూ పెద్ద షాకిచ్చాడు.ప్రస్తుతం ప్రపంచ ఫుట్‌బాల్‌లో మేరునగధీరుడిగా పేరొందిన మెస్సీ ఇటలీకి చెందిన స్పోర్ట్స్ జర్నలిస్ట్ ఫాబ్రిజియో రొమనోతో మాట్లాడాడు. మాటల మధ్యలో ఫాబ్రిజియో వీడ్కోలు అనంతరం మీరు కోచ్ అవుతారా? అని మెస్సీని అడిగాడు. అందుకు స్టార్ ఫుట్‌బాలర్ ఆసక్తికర సమాధానం చెప్పాడు.'రిటైర్మెంట్ తర్వాత కోచ్ అవ్వడం నాకు ఇష్టం లేదు. వీడ్కోలు పలికాక ఏం చేయాలనే విషయం గురించి నాకు ఇప్పటికైతే ఐడియా లేదు. అయితే.. భవిష్యత్ గురించి ఆందోళన చెందకుండా.. రోజువారీ జీవితాన్ని ఆస్వాదిస్తాను. అందుకని ఫుట్‌బాల్ ఆడడం, సాధన చేయడం, జట్టు సభ్యులతో నవ్వుతూ ఉండడం.. ప్రస్తుతానికి ఇవే నా ప్రాధమ్యాలు' అని మెస్సీ వెల్లడించాడు.

# ఆకట్టుకుంటున్న 'జితేందర్ రెడ్డి' చిత్ర ట్రైలర్

రాకేష్ వర్రే టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం జితేందర్ రెడ్డి. ఉయ్యాలా జంపాల, మజ్ను సినిమాలు తీసిన విరించి వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం నవంబర్ 8 న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ ఇటీవలే విడుదలై అందరినీ ఆకట్టుకుంది. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకునే అంశాలతో ఉండగా, ప్రధాన పాత్రలు పోషించిన రాకేష్ పర్ఫార్మెన్స్ హైలైట్ గా నిలిచింది. నిజ జీవిత ఇన్సిడెంట్స్ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం లో అన్ని సన్నివేశాలను చక్కగా చిత్రీకరించారు. కాలేజీ రోజుల నుంచే ప్రజా సమస్యల కోసం పోరాడుతూ దేశం కోసం ధర్మం కోసం నక్సలైట్ల తో జితేందర్ రెడ్డి చేసిన పోరాటాన్ని ఈ సినిమా లో చూపించారు. అంతే కాకుండా, ఆ తర్వాత అతను రాజకీయాల్లోకి రావడం, అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న సీనియర్ తో మాట్లాడటం ట్రైలర్ లో చూపించారు. యాక్షన్ డ్రామా గా రాబోతున్న ఈ చిత్రం లో డైలాగ్స్ ప్రధాన ఆకర్షణగా ఉన్నాయి. చక్కని కెమెరా వర్క్ కు నేపథ్య సంగీతం కూడా తోడవడం కలిసొచ్చే అంశం. టెక్నికల్ గా ఈ సినిమా అన్ని విభాగాల్లో హైలైట్ గా నిలిచింది. రాకేష్ ఇప్పటి వరకు పోషించిన అన్ని పాత్రల్లోకి ఇది చాలా డిఫరెంట్ అని తెలుస్తుంది. ఈ చిత్రం కోసం తన ఫిజికల్ ట్రాన్స్ఫరమేషన్ కూడా మెచ్చుకొనే విధంగా ఉంది. 1980 కాలంలో జగిత్యాల



చుట్టు పక్కల జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన సినిమా 'జితేందర్ రెడ్డి'. ముదుగంటి క్రియేషన్స్ పై ముదుగంటి రవీందర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు.జితేందర్ రెడ్డి సినిమాకి సంబంధించిన ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఈ పాటికే విడుదలైన సినిమా టీజర్, గ్లిమ్ప్స్, మూడు పాటలు ప్రేక్షకులని అమితంగా ఆకట్టుకున్నాయి. నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కడం ఆసక్తికర అంశం. యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో వైశాలి రాజ్, రియా సుమన్, ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవి ప్రకాష్.. పలువురు ముఖ్య పాత్రలు పోషించారు.

# దక్షిణదివారికి హిందీ భాష కష్టాలు



2019లో విడుదలైన 'ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా లగా'తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు నటి రెజీనా . ప్రస్తుతం ఆమె దక్షిణాదితోపాటు హిందీలోనూ పలు చిత్రాలు చేస్తున్నారు. తాజాగా ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె బాలీవుడ్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ పరిశ్రమలోకి అడుగుపెట్టిన సమయంలో నటీనటులకు ఎదురయ్యే సవాళ్ల గురించి మాట్లాడారు. ''దక్షిణాది నుంచి ఈ పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఎంతోమంది భాషాపరమైన సమస్యలు ఎదుర్కొన్న వారే. భాష విషయంలో స్పష్టంగా లేకపోతే.. తమ ప్రాజెక్టుల్లోకి తీసుకోవడానికి ఆసక్తి చూపించరు. దక్షిణాదిలో అలా ఉండదు. హిందీ సినిమాల్లో నటించాలని నిర్ణయించుకున్నప్పుడు.. ముంబయిలోనే ఉండాలని, మీటింగ్స్‌లో పాల్గొనాలని తెలిపారు. పెద్దగా నచ్చకపోయినప్పటికీ అదే ఇక్కడ ముఖ్యమని అర్థమైంది. నాకోసం ఒక టీమ్ ఉంటుంది. అవకాశాల విషయంలో వాళ్లు నాకు సాయం చేస్తారు. నేను కేవలం ఆడిషన్లలో పాల్గొంటా'' అని చెప్పారు. ఇతర చిత్ర పరిశ్రమలతో పోలిస్తే బాలీవుడ్‌లో పోటీ ఎక్కువగా ఉంటుందన్నారు. విభిన్న కథలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు రెజీనా. ఈ ఏడాది ఆమె నటించిన 'ఉత్సవం' విడుదలై మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ప్రస్తుతం ఆమె కోలీవుడ్‌లో తెరకెక్కుతోన్న 'విదాముయార్చి', 'ఫ్లాష్‌బ్యాక్'ల్లో నటిస్తున్నారు. 'జాట్', 'సెక్షన్ 108' హిందీ ప్రాజెక్టుల కోసం పనిచేస్తున్నారు. 'జాట్'కు గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తోన్న విషయం తెలిసిందే. ఇది చిత్రీకరణ దశలో ఉంది.




# సంక్రాంతికి వస్తున్నాం

విక్టరీ వెంకటేష్, బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అద్భుతమైన హ్యాట్రిక్ కొలాబరేషన్ తర్వాత మోస్ట్ ఎవైటెడ్ చిత్రం చాలా క్యురియాసిటీని క్రియేట్ చేస్తోంది. ఈ డైనమిక్ కాంబినేషన్ ఇప్పటికే రెండు పెద్ద హిట్‌లను అందించింది. బ్లాక్‌బస్టర్‌లను అందించడంలో అనిల్ రావిపూడిది స్పెషల్ రికార్డ్. అప్ కమింగ్ మూవీ ఫుల్ ఫ్లెడ్జ్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని హామీ ఇవ్వడంతో పాటు, యూనిక్ ట్రైయాంగిలర్ క్రైమ్ నెరేటివ్ ని అందిస్తుంది. శుక్రవారం ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రానికి 'సంక్రాంతికి వస్తున్నాం' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ టైటిల్ పండుగ ప్రాముఖ్యతను తెలియజేస్తూ, సంక్రాంతి రిలీజ్ కి పర్ఫెక్ట్ మూవీ అనిపించింది. టైటిల్ డిజైన్ లో రంగోలి, తుపాకీ ఎలిమెంట్స్ ఫెస్టివల్, సినిమా క్రైమ్ థీమ్‌లను సూచిస్తుంది. టైటిల్ ఫాంట్ ఎట్రాక్టివ్ గా వుంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో, వెంకటేష్ లుంగీ ధరించి, స్పోర్టింగ్ షేడ్స్, తుపాకీ పట్టుకుని సీరియస్ పోజ్ లో కనిపించారు. అతని ఆన్-స్క్రీన్ భార్య ఐశ్వర్య రాజేష్ సాంప్రదాయ లుక్‌లో, ఎక్స్ లవర్ మీనాక్షి చౌదరి మోడరన్ అవతార్‌లో ఉన్నారు. వెంకటేష్ లుక్ సాంప్రదాయ, స్టైలిష్ ఎలిమెంట్స్ తోకట్టిపడేసింది, పోస్టర్ లో వెంకటేష్ చరిష్మా అదిరిపోయింది. బ్యాక్‌గ్రౌండ్‌లో క్లూస్, ముఖ్యమైన తేదీలు,వార్తాపత్రికల క్లిప్పింగ్‌లతో నిండిన ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ బోర్డు ఉంది, ఇది మూవీ ఆసక్తికరమైన కథాంశాన్ని సూచిస్తుంది. మొత్తంమీద, ఫస్ట్ లుక్ పోస్టర్ క్యూరియాసిటీని రేకెత్తిస్తుంది. పోస్టర్ డిజైన్‌లో అనిల్ రావిపూడి మార్క్ ఆకట్టుకుంది. ఇప్పటికే డబ్బింగ్ పనులు జరుగుతున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్ కాగా, తమ్మిరాజు ఎడిటర్. ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లేను ఎస్ కృష్ణ, జి ఆదినారాయణ అందించగా, వి వెంకట్ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు.

తారాగణం: వెంకటేష్, మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్, ఉపేంద్ర లిమాయే, రాజేంద్ర ప్రసాద్, సాయి కుమార్, నరేష్, VT గణేష్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి, సాయి శ్రీనివాస్, ఆనంద్ రాజ్, చైతన్య జొన్నలగడ్డ, మహేష్ బాలరాజ్, ప్రదీప్ కబ్రా,చిట్టి

# పుష్ప-2 నుంచి శ్రీవల్లి, పుష్పరాజ్ రొమాంటిక్ పోస్టర్..

అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో తెరకెక్కతున్న పుష్ప-2 మూవీ కోసం బన్నీ ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. డిసెంబర్ 5న ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు మేకర్ ప్రకటించారు. గతంలో డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దీపావళి పండగ సందర్భంగా రష్మిక, అల్లు అర్జున్ రొమాంటిక్ పోస్టర్‌ను మేకర్ వదిలారు. ప్రస్తుతం పోస్టర్ వైరల్‌గా మారింది. పుష్ప ది రైజ్ చిత్రం పాన్ ఇండియా స్థానంలో బిగ్గెస్ట్ బ్లాక్ బాస్టర్‌గా నిలిచింది. ఆ తర్వాత పుష్ప-2 ది రూల్‌పై మూవీపై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ మూవీని ఆరు భాషల్లో కలిపి 11,500 స్క్రీన్స్‌లో విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఓవర్సీస్‌లో 5వేల స్క్రీన్స్, భారత్‌లో 6500 స్క్రీన్స్‌లో విడుదల కాబోతున్నట్లుగా తెలుస్తున్నది.



ఈ మూవీ భారతీయ సినీ చరిత్రలో బిగ్గెస్ట్ రిలీజ్ ఇండియన్ సినిమాగా నిలుస్తుందని పేర్కొంటున్నారు. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ, ఒడియా భాషలో ఒకేసారి విడుదల చేయనున్నారు. ఇక ఈ మూవీలో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నది. ఫహాద్ ఫాజిల్, రావు రమేశ్, అనసూయ భరద్వాజ్, జగపతిబాబు కీలకపాత్రలు పోషిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తుండగా.. డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ బాధ్యతలు పోలెండ్ కెమెరామెన్ కూబాకు అప్పగించారు. ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్ స్పెషల్ సాంగ్‌లో కనిపించనుందని టాక్ వినిపిస్తున్నది. ఈ సాంగ్‌ను నవంబర్ 4 నుంచి షూటింగ్ జరుపుకోనుందని ఇక రెండోవారంలో మరో ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు తెలుస్తున్నది. ఆ తర్వాత నుంచి మూవీ ప్రమోషన్స్‌ను మొదలుపెట్టనున్నట్లు తెలుస్తున్నది.

# నవంబర్ 9న 'గేమ్ ఛేంజర్' టీజర్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్'. డిఫరెంట్ ప్రమోషనల్ ప్లానింగ్‌తో మూవీపై అంచనాలు పెరుగుతున్నాయి. తాజాగా ఈ మూవీ టీజర్ డేట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. నవంబర్ 9న 'గేమ్ ఛేంజర్' టీజర్‌ను విడుదల చేస్తున్నారు. దీంతో మెగాభిమానులు, సినీ ప్రేక్షకుల్లో ఎగ్జయిట్‌మెంట్ మరింత పెరిగింది. టీజర్ రిలీజ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ గమనిస్తే రైల్వే ట్రాక్‌పై రామ్‌చరణ్ కూలింగ్ గ్లాస్ పెట్టుకుని లుంగీ, బనియన్‌తో పక్కా మాస్ లుక్‌లో కూర్చున్న రామ్ చరణ్‌ను చూడొచ్చు. మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ లుక్ ఉన్న పోస్టర్‌ను పోస్ట్ చేసి గేమ్ చేంజర్‌లో ట్రైన్ ఫైట్ ఉండబోతుందని, ఆ ఫైట్ అందరి అంచనాలను మించేలా ఉంటుందని చెప్పారు. మూవీ నుంచి ఇప్పటికే వదిలిన పోస్టర్స్, 'జరగండి జరగండి..', 'రా మచ్చా మచ్చా' సాంగ్స్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చాయి. డైరెక్టర్ శంకర్ లార్జర్ దేన్ లైఫ్ సినిమాలను తెరకెక్కించటమే కాకుండా, అభిమానులకు, ప్రేక్షకులకు సినిమా డిఫరెంట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుంటారు. రామ్ చరణ్‌లాంటి మాస్ హీరో ఉన్నప్పుడు ఆ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఎలా ఉంటుందో చూడాలని మెగాభిమానులు, మూవీ లవర్స్ 'గేమ్ ఛేంజర్' కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు ఆయన తెరకెక్కించిన సినిమాలను మించేలా 'గేమ్ ఛేంజర్'ను ఆయన రూపొందిస్తున్నారు. పవర్‌ఫుల్ రోల్ లో చరణ్‌ను ప్రెజెంట్ చేస్తున్నారు శంకర్. రామ్ చరణ్ కెరీర్‌లోనే హయ్యస్ట్‌గా గేమ్ చేంజర్ సినిమా నార్త్ ఇండియా డిస్ట్రిబ్యూషన్ రైట్స్‌ను ఎఎ ఫిల్మ్స్ ఫ్యాన్సీ రేటుకి సొంతం చేసుకుంది. ఈ భారీ చిత్రానికి తమన్ సంగీత సారథ్యం వహిస్తున్నారు. ప్రముఖ ఆడియో కంపెనీ సారేగమ ఈ సినిమా ఆడియో రైట్స్‌ను ఫ్యాన్సీ ప్రైజ్‌కి దక్కించుకుంది.

# కిరణ్ అబ్బవరం క చిత్రానికి సూపర్ క్రేజ్

టాలీవుడ్ యాక్టర్ కిరణ్ అబ్బవరం కాంపౌండ్ నుంచి చేసిన సరికొత్త ప్రయత్నం క. సుజిత్-సందీప్ డైరెక్షన్‌లో పీరియాడిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని చేస్తున్నారు. దీపావళి కానుకగా శుక్రవారం గ్రాండ్‌గా విడుదలైంది. కాగా ఓ వైపు థియేటర్లలో సందడి చేస్తుండగా.. అప్పుడే ఓటీటీ అప్‌డేట్ వచ్చేసింది. తాజా సమాచారం ప్రకారం క చిత్రం పోస్ట్ థ్రియాట్రికల్ స్ట్రీమింగ్ రైట్స్‌ను పాపులర్ తెలుగు ప్లాట్‌ఫాం ఈటీవీ విన్ దక్కించుకుంది. అంతేకాదు శాటిలైట్ రైట్స్ ఈటీవీ గ్రూప్ సొంతం చేసుకున్నట్టు సమాచారం. మేకర్స్ ఈ రెండు రైట్స్ ద్వారా రూ.10 కోట్లు ఆర్జించినట్టు టాక్. ట్రైలర్‌లో వాసుదేవ్‌గా కనిపించిన కిరణ్ అబ్బవరం..ఈ ఊరేంటి చాలా విచిత్రంగా ఉంది. మధ్యాహ్నం మూడు గంటలకే చీకటి పడిపోతుందని వాసుదేవ్ ఓ గ్రామస్థుడిని అడిగితే.. మా ఊరు చుట్టూ ఎత్తైన కొండలుంటాయి. కొండల మధ్యలో మా ఊరుంటుంది. మధ్యాహ్నం మూడయ్యే సరికి సూర్యుడు కొండల వెనక్కి వెళ్లిపోయి.. ఆ నీడ మా ఊరి మీద పడి 3 గంటలకే చీకటి పడిపోతుందబ్బాయి.. చీకటి వలయం.. గందరగోళం.. ఏప్రిల్ 22 1977 ఆ రోజు నీకొచ్చిన ఉత్తరాన్ని తెరిచి చదివావు. అందులో ఏముంది.. అంటూ సాగుతున్న ట్రైలర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు. వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించారు.

# ఈ నూనెతో వంటలు చేస్తే ఆరోగ్యం



నూనెల్లో చాలా రకాల ఉన్నాయి. కానీ ఎక్కువగా వంటకు ఉపయోగించే వాటిల్లో పామ్ ఆయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్, వేరుశనగ, కొబ్బరి నూనె ఉంటాయి. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం పామ్ ఆయిల్, సన్ ఫ్లవర్ ఆయిల్, వేరుశనగ యూజ్ చేస్తారు. ఇప్పుడంటే ఆయిల్స్‌లో ఇన్ని రకాలు వచ్చాయి. కానీ పూర్వం ఎక్కువగా ఆవాల నూనె, నువ్వుల నూనెను ఉపయోగించేవారు. వీటితో వంటలకు రుచి మాత్రమే కాకుండా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రస్తుతం చలి కాలం కాబట్టి.. ఈ నూనె తీసుకోవడం వల్ల బ్యాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్స్ రాకుండా అడ్డుకోవచ్చు. ఇంకా మరెన్నో దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా చేస్తాయి. ఆవాల నూనెను వంటల్లో ఉపయోగించడం వల్ల ఎలాంటి బెనిఫిట్స్ ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.

**కీళ్ల నొప్పులు మాయం:**
తరచూ ఆవాల నూనె ఉపయోగించిన వంటలు తింటే కీళ్ల నొప్పులు తగ్గించుకోవచ్చు. ఇందులో ఆల్ఫా లినోలెనిక్ యాసిడ్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటయి. ఇవి కీళ్లను దృఢంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. అర్థరైటిస్‌తో బాధ పడేవారు ఈ నూనె తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

**గుండెకు మేలు:**
మస్టర్డ్ ఆయిల్ వంటలు తినడం వల్ల గుండెకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. ఇందులో ఉండే పోషకాలు.. శరీరంలో రక్త ప్రసరణ సరిగా జరిగేలా చేస్తాయి. దీంతో రక్త పోటు కూడా కంట్రోల్ అవుతుంది. ఈ క్రమంలో గుండె సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి.

**జలుబు, దగ్గు కంట్రోల్:**
మస్టర్ ఆయిల్ తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు అనేవి కంట్రోల్ అవుతాయి. ఛాతీలో పేరుకు పోయిన కఫాన్ని బయటకు పంపుతుంది. అదనపు నీరు ఉన్నా తగ్గుతుంది. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడేవారికి ఆవాల నూనెతో మసాజ్ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

**చర్మం — జుట్టు సమస్యలు మాయం:**
ఆవాల నూనెతో చేసిన వంటలు తినడం వల్ల చర్మానికి, జుట్టుకు కూడా చాలా మంచిది. ఇందులో ఉండే పోషకాలు చర్మ రంగును మెరుగు పరుస్తాయి. ఎలాంటి మచ్చలు లేకుండా యవ్వనంగా ఉండేలా చేస్తుంది. అలాగే ఆవాల నూనె తీసుకోవడం వల్ల తలపై వేడి అనేది ఉత్పత్తి అవుతుంది. దీంతో రక్త ప్రసరణ బాగా జరిగి.. జుట్టు ఒత్తుగా, పొడుగ్గా పెరుగుతుంది.

# కార్తీక మాసంలో బెస్ట్ రెసిపీ

కార్తీక మాసం నవంబర్ 2వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. కార్తీక మాసం వచ్చిందంటే చాలా మంది.. ఒక నెల మొత్తం నాన్ వెజ్ తినకుండా ఆ కైలాస నాథుడికి పూజలు చేస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే ఎప్పుడూ చేసుకునే వంటలకు బదులు ఇలా కొత్తగా, రుచిగా, హెల్దీగా చేసుకుంటే.. మీరు కూడా ఆరోగ్యంగా ఉంటారు. బోర్ కొట్టకుండా ఉంటుంది. రాజ్మా ఆరోగ్యానికి చాలా మంది. ఇందులో శరీరానికి కావాల్సిన అనేక రకాల పోషకాలు ఉన్నాయి. రాజ్మా నేరుగా తినలేని వారు ఇలా పులావ్‌డగా చేసుకుని కూడా తినవచ్చు. మరి ఈ రాజ్మాతో పులావ్ ఎలా తయారు చేస్తారు? ఈ రెసిపీ చేయడానికి కావాల్సిన పదార్థాలు ఏంటో ఇప్పుడు చూద్దాం.

**రాజ్మా పులావ్‌కు కావాల్సిన పదార్థాలు:**
ఉడికించిన రాజ్మా, బాస్మతీ రైస్, ఉల్లిపాయలు, పచ్చి మిర్చి, పుదీనా, కొత్తిమీర, పులావ్ దినుసులు, ఉప్పు, కారం, పసుపు, శీరా కల్లు.

**రాజ్మా పులావ్ తయారీ విధానం:**
ముందుగా అన్నీ కట్ చేసి పెట్టుకోవాలి. అలాగే రాజ్మా కూడా నానబెట్టి 80 శాతం ఉడికించి పక్కన పెట్టాలి. ఆ తర్వాత బాస్మతీ రైస్ శుభ్రంగా కడిగి ఓ అరగంట పాటు నానబెట్టాలి. ఇప్పుడు ఓ కుక్కర్ తీసుకుని అందులో ఆయిల్ కొద్దిగా, నెయ్యి కొద్దిగా వేసి వేడి చేయాలి. ఆ తర్వాత పులావ్ దినుసులు వేసి వేయించాక.. ఉల్లిపాయ, పచ్చి మిర్చి ముక్కలు వేయాలి. ఇవి కూడా వేగాక పుదీనా కొత్తిమీర, శీరాకల్లు, కారం, పసుపు, ఉప్పు వేసి వేయించాలి.ఆ తర్వాత రాజ్మా, బాస్మతీ రైస్, రైస్ ఉడకడానికి తగినంత నీరు వేసి మూత పెట్టాలి. రెండు విజిల్స్ వచ్చాక స్టవ్ ఆఫ్ చేయాలి. వేడి తగ్గాక మొత్తం అంతా ఒకసారి కలుపుకోవాలి. అంతే ఎంతో రుచిగా ఉండే రాజ్మా పులావ్ సిద్ధం. దీన్ని ఏ కర్రీతో తిన్నా.. రైతాతో తిన్నా చాలా రుచిగా ఉంటుంది. టేస్టీగా, హెల్దీగా ఉండాలి అనుకునేవారికి ఇది బెస్ట్ రెసిపీ. దీన్ని బ్రేక్ ఫాస్ట్‌గా, లంచ్‌గా, డిన్నర్‌గా కూడా తినవచ్చు. వేడి వేడిగా తింటే చాలా రుచిగా ఉంటుంది.



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com